సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 356

మంగళవారం 17-3-2020



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



ఆగని విలయం..

సెన్సెక్స్ 2,713 పాయింట్లు డౌన్..
రూ.7.6 లక్షల కోట్ల సంపద ఆవిరి..
క్రూడ్, బంగారం 'బేర్'..
రిటైల్ ఇన్వెస్టర్లకు రూ.308 కోట్ల నష్టం..
జీడీపీకి కరోనా కాటు..
అమెరికా వడ్డీ రేట్లు @ 0

- వివరాలు బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

● మధ్యప్రదేశ్ అసెంబ్లీ వాయిదా

కమల్‌ను కాపాడిన కరోనా

కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కరోనా వైరస్ తాత్కాలికంగా ఆదుకుంది. విశ్వాస పరీక్ష ఎదుర్కోవాలని గవర్నర్ కమల్‌నాథ్‌ను ఆదేశించిన నేపథ్యంలో.. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే కరోనా కారణంగా సభను మార్చి 26 వరకు వాయిదా వేస్తూ స్పీకర్ ప్రజాపతి నిర్ణయం తీసుకున్నారు.

- 5లో

● పెద్దల సభకు మాజీ సీజేఐ

రాజ్యసభకు గొగోయ్

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ని కేంద్రం రాజ్యసభకు నామినేట్ చేసింది. ఈ మేరకు ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కేటీఎస్ తులసి రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన స్థానంలో జస్టిస్ గొగోయ్‌ని కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది.

- 5లో

● తక్షణమే విచారణ జరపండి

ఐసీజేకు నిర్భయ దోషులు

నిర్భయ కేసు మరో మలుపు తిరిగింది. ఉరిశిక్ష అమలుపై స్టే ఇవ్వాలంటూ నలుగురు దోషుల్లో ముగ్గురు అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) తలుపు తట్టారు. ఈ కేసు విచారణ తప్పుల తడకగా సాగిందని, తమను బలిపశువులుగా చేసి, అన్యాయంగా శిక్ష విధించారని ఆరోపించారు.

- 5లో

● ఎస్ఈసీకి ఏపీ సీఎస్ లేఖ

'స్థానిక' వాయిదా వద్దు

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వాయిదా వేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఎస్ నీలం సాహ్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా ఎన్నికలను నిర్వహించాల్సిందిగా ఆమె కోరారు.

- 14లో

'కోవిడ్' దిగ్బంధనం

- యూకే, ఈయూ, టర్కీ ప్రయాణికులపై నిషేధం
- వైరస్ కట్టడికి కేంద్రం చర్యలు
- సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్

- వివరాలు 5లో



వ్యాక్సిన్ పరీక్షలు షురూ

ఢిల్లీలో అన్నింటిపై నిషేధం..

మరణాలు @ 7007

- 5లో

మరొకరికి కరోనా

స్కాట్లాండ్ నుంచి వచ్చిన వ్యాపారికి పాజిటివ్

- గాంధీ ఐసోలేషన్ వార్డులో చికిత్స
- వైద్యాధికారుల వెల్లడి
- తల్లి అంత్యక్రియలకు షాంఘై నుంచి ఒకరి రాక
- పాల్గొనేందుకు అనుమతి ఇవ్వని అధికారులు
- శ్వాసకోశ వ్యాధులతో ప్రైవేట్‌కు వచ్చే వారి వివరాల సేకరణ
- మహారాష్ట్ర సరిహద్దుల్లో అప్రమత్తం..
- తప్పుడు ప్రచారం చేసిన ముగ్గురిపై కేసు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో నాలుగో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. స్కాట్లాండ్ నుంచి వచ్చిన ఓ వ్యాపారికి (46) వైరస్ సోకినట్లు సోమవారం వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం ఆయన గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఆయన ఈ నెల 7న హైదరాబాద్ నుంచి స్కాట్లాండ్ వెళ్లారు. 13న స్కాట్లాండ్ నుంచి హైదరాబాద్ వచ్చారు. 15న కోవిడ్ లక్షణాలతో గాంధీ ఆస్పత్రిలో చేరారు. కోవిడ్ పాజిటివ్ వచ్చిన నలుగురిలో మహేంద్రహిల్స్‌కు చెందిన యువకుడు చికిత్స తర్వాత పూర్తిగా కోలుకోవడంతో ఇటీవల డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో ఇటలీ నుంచి వచ్చిన యువతి (24), నెదర్లాండ్ నుంచి వచ్చిన మరో వ్యక్తి (48) చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో ముగ్గురు పాజిటివ్ లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. ఇదే ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో మరో 20 మంది

మిగతా 3వ పేజీలో ▶

సజల సుజల సస్యశ్యామల తెలంగాణ

- సాకారం అయ్యే వరకు చిత్తశుద్ధితో పనిచేస్తాం
- కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ప్రగతి పథంలో తీసుకెళ్తాం
- 'ప్రాణహిత ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తు'కు సంబంధించి ఒప్పందాలు ఉంటే రాజీనామా చేస్తా
- కాంగ్రెస్ నిరూపిస్తుందా? పంథా మార్చుకోకపోతే వారికే నష్టం
- వచ్చే రెండేళ్లలో 1,200 చెక్‌డ్యామ్‌లను పూర్తిచేస్తాం
- త్వరలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతాం
- ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చకు సమాధానంలో సీఎం కేసీఆర్

- 2లో

ఇదేం చట్టం?

దేశ ప్రతిష్ట గంగలో కలుస్తోంది

సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలపై సీఎం కేసీఆర్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను సవరించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆమోదం లభించింది. జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్), జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ) ప్రతిపాదనల అమలుపై సోమవారం అసెంబ్లీ ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్పీఆర్, ఎన్నార్సీ లాంటి చర్యల నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరింది. సోమవారం సభ ప్రారంభం కాగానే ప్రభుత్వ పక్షాన సీఎం కేసీఆర్ సభలో ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం తీర్మానంపై మాట్లాడారు. ఆ తర్వాత ఎంఐఎం, టీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు మాట్లాడి తీర్మానానికి మద్దతు తెలపగా, బీజేపీ మాత్రం వ్యతిరేకించింది. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీర్మాన ప్రతులను చించేసి స్పీకర్ పోడియం ముందు ఆందోళన చేస్తుండగానే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తీర్మానాన్ని సభ ముందు ఆమోదానికి ఉంచారు. మెజార్టీ సభ్యులు మద్దతు తెలపడంతో సభ ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ తీర్మానాన్ని మండలి సైతం ఆమోదించింది.

- సీఏఏను వెనక్కి తీసుకుని, పునఃసమీక్ష చేయాలి
- సరిహద్దులో గోడ కడితే మేమంతా మద్దతిస్తాం..
- సీఏఏను వ్యతిరేకిస్తూ చేసిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం
- బీజేపీ మినహా అన్ని పార్టీల సభ్యుల మద్దతు

నిప్పులు చెరిగిన కేసీఆర్..

తీర్మానంపై సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. సీఏఏతో ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్ట గంగలో కలుస్తోందని మండిపడ్డారు. లౌకిక, ప్రజాస్వామిక, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కేంద్రం మంటగలుపుతోందని నిప్పులు చెరిగారు. సీఏఏ కేవలం హిందూ, ముస్లింల సమస్య కాదని.. యావత్ దేశ సమస్య అని, నిమ్న వర్గాలు, సంచార జాతులు, మహిళలు, పేదలు, వలసదారులు ఈ చట్టంతో భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఓసారి విఫలమైన ఈ ప్రయోగాన్ని మళ్లీ అమలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. సీఏఏ నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని, దీనిపై అందరికీ

మిగతా 2వ పేజీలో ▶

సీఏఏతో విద్వేషపు గోడలు

- ఇది ముస్లింలు సహా అణగారిన వర్గాలకు వ్యతిరేకం
- నన్ను భారతీయ ముస్లింగా చూడాలి: అక్బరుద్దీన్ ఒవైసీ

2 లో

తెలంగాణ విడిచి వెళ్లిపోతా

- ఒక వర్గం మెప్పు కోసం అసత్యాలు ప్రచారం చేయడం సమంజసం కాదు
- ప్రభుత్వం తీరుపై రాజాసింగ్ ఆగ్రహం

తక్షణమే అమలు నిలిపేయాలి: సీఎల్పీ నేత భట్టి



సోమవారం సంగాయిపేట వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన డీసీఎం, ఆర్టీసీ బస్సు

రక్తమోడిన రోడ్లు

మెదక్ జిల్లాలో ఒకేరోజు మూడు ప్రమాదాలు

పది మంది దుర్మరణం.. మరో 13 మందికి గాయాలు

మెదక్‌జోన్/కొల్చారం/చేగుంట: మెతుకుసీమలో రహదారులు రక్తసిక్తమయ్యాయి. సోమవారం ఒకే రోజు జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 10 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 13 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో ఓ చిన్నారితో పాటు ఐదుగురు మహిళలు ఉన్నారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళుతూ.. సంగారెడ్డి జిల్లా పసల్‌వాది మండలం గంజిగూడెం గ్రామానికి చెందిన గొడుగు రాములు ఏడుపాయల్లో అమ్మవారి మొక్కు తీర్చుకునేందుకు బంధువులను ఆహ్వానించారు. దీంతో ఆదివారం రాత్రి కొంతమంది ఏడుపాయలకు చేరుకోగా.. సోమవారం ఉదయం సుమారు 25 మంది మహిళలు, చిన్నారులు, వృద్ధులు డీసీఎంలో బయల్దేరారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేట గ్రామ శివారులోకి రాగానే

మిగతా 4వ పేజీలో ▶

వారానికి 3 రోజులే హైకోర్టు

- కరోనా వ్యాప్తి నివారణకు న్యాయస్థానం నిర్ణయం
- కింది కోర్టుల్లోనూ అత్యవసర కేసులే విచారణ
- స్టేల పొడిగింపునకు న్యాయవాదులు ప్రయత్నించాలని సూచన
- బెయిల్, ఇంజక్షన్ కేసులకే ప్రాధాన్యత

- 3లో

ప్రీప్రైమరీ స్కూళ్లలో చిన్నారుల సామర్థ్యం మదింపు!

- కొత్త సంస్కరణలు తెస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ
- ఐసీడీఎస్‌ల పరిధిలో నడుస్తున్న వాటిల్లో అమలుకు నిర్ణయం

- వివరాలు 4లో



ముగిసిన అసెంబ్లీ

- 8 రోజుల పాటు సాగిన సమావేశాలు
- ఈ నెల 6న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం
- వార్షిక బడ్జెట్‌తో పాటు ఆరు బిల్లులకు ఆమోదం
- చివరి రోజు సీఏఏ, మరో తీర్మానంపై అసెంబ్లీలో చర్చ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రసంగంతో ఈ నెల 6న ప్రారంభమైన రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం ముగిశాయి. తొలుత ఈ నెల 20 వరకు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని శాసనసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీలో నిర్ణయించారు. అయితే ఈ నెల 14న సమావేశమైన రాష్ట్ర కేబినెట్ 'కరోనా'పై పలు కఠిన నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలను కుదించారు. దీంతో నిర్ణీత గడువు కంటే నాలుగు రోజుల ముందుగానే సోమవారం అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. 8 రోజుల పాటు సాగిన అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2020-21ను సభ్యులు ఆమోదించారు. ఏడో తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాలు తెలుపుతూ చర్చ జరగ్గా, ఎనిమిదో తేదీన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి హరీష్‌రావు సభలో ప్రవేశపెట్టారు. హోలీ సందర్భంగా 9, 10 తేదీల్లో విరామం అనంతరం 11న ప్రారంభమైన అసెంబ్లీలో రెండు రోజుల పాటు బడ్జెట్‌పై సాధారణ చర్చ జరిగింది. ఈ నెల 13న ప్రభుత్వ శాఖల వారీగా పద్దులపై చర్చ మొదలై 19 వరకు కొనసాగాల్సి ఉండగా, మూడు రోజుల్లోనే 40 పద్దులపై చర్చించి సభ ఆమోదించింది. శాసనసభ సమావేశాల చివరి రోజు సోమవారం ద్రవ్య వినిమయ, వినియోగ బిల్లులను ఆమోదించిన తర్వాత అసెంబ్లీని వాయిదా వేస్తున్నట్లు అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.

చివరి రోజు సీఏఏని వ్యతిరేకిస్తూ..

ఎనిమిది రోజుల పాటు సాగిన అసెంబ్లీ సమావేశాల్లో రెండు తీర్మానాలు, ఆరు బిల్లులపై చర్చ జరిగింది. సమావేశాల చివరి రోజు సోమవారం అత్యంత కీలకమైన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్‌పీఆర్, ఎన్‌ఆర్‌సీపై తీర్మానాన్ని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రతిపాదించారు. దీంతో పాటు పదేళ్లపాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పొడగింపునకు సంబంధించి పార్లమెంటు ఆమోదించిన '126వ రాజ్యాంగ సవరణ బిల్లు 2019'కు మద్దతుగా తీర్మానం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మొత్తం ఆరు బిల్లులను ప్రవేశ పెట్టగా, ద్రవ్య వినిమయ బిల్లు, ద్రవ్య వినియోగ బిల్లులతో పాటు మరో నాలుగు బిల్లులకు అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. లోకాయుక్త సవరణ బిల్లు-2020, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సవరణ బిల్లు 2020, లాభదాయక సంస్థల సవరణ బిల్లు, ఎస్‌హెచ్‌జీ వాటా రద్దు బిల్లు 2020 ఈ జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు పల్లె ప్రగతి, కరోనా అంశం పై స్వల్పకాలిక చర్చ జరిగింది. మొత్తంగా ఎనిమిది రోజుల పాటు వివిధ అంశాలపై జరిగిన చర్చలో 63 శాతం మంది సభ్యులు ప్రసంగించారు.

పార్టీల వారీగా సభ్యులు మాట్లాడిన సమయం

టీఆర్ఎస్: 11 గంటల 6 నిమిషాలు, **ఎంఐఎం:** 5 గంటల 14 నిమిషాలు, **కాంగ్రెస్:** 7 గంటల 02 నిమిషాలు, **టీడీపీ:** 27 నిమిషాలు, **బీజేపీ:** 57 నిమిషాలు, **ఇతరులు:** 10 నిమిషాలు, ప్రశ్నోత్తరాలు, పద్దులపై మంత్రుల సమాధానం-17 గంటల 47 నిమిషాలు

బడ్జెట్‌పై అనేక అనుమానాలు

అవి నివృత్తి చేయకపోతే అభివృద్ధిపై తీవ్ర ప్రభావం: భట్టి

సాక్షి, హైదరాబాద్: గోదావరి నుంచి నీటిని సద్వినియోగపరచుకునేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం 152 మీటర్ల ఎత్తులో ప్రాణహిత ప్రాజెక్టు కట్టేందుకు చర్యలు చేపట్టిందని కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. అయితే టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం 100 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టుకు ఎగువ, దిగువ రాష్ట్రాల సీఎంలను ఒప్పించామని చెబుతోందని, 100 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టుకు వాళ్లను ఒప్పించామనుకుంటున్నారా? వాళ్లే ఒప్పుకున్నారా? స్పష్టం చేయాలన్నారు. అసెంబ్లీలో సోమ వారం ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయని, అవి నివృత్తి కాకపోతే అభివృ ద్ధిపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. రూ.1,43,914 కోట్ల ఆదా యం వస్తుందని అంచనా వేశారని, గతేడాది సవరించిన దాని ప్రకారమే 1.10 లక్షల ఆదాయమే వచ్చిందన్నారు. ఈ వ్యత్యాసాన్ని ఎలా పూడ్చుతారని పేర్కొన్నారు. ఉన్న ఖర్చు కంటే ఆదాయం ఎక్కువ చూపి మిగులు బడ్జెట్‌గా చూపించారని, అది ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

ఇదేం చట్టం?

▶ మొదటి పేజీ తరువాయి

ఆమోదయోగ్యంగా ఉండేలా పునఃసమీక్ష చేయాలని విన్నవించారు. టీఆర్ఎస్ ఇప్పటికే పార్లమెంట్‌లో సీఏఏను వ్యతిరేకించిందని, దానికే కట్టుబడి అసెంబ్లీలోనూ వ్యతిరేకంగా తీర్మానిస్తున్నామని ప్రకటించారు. సీఏఏతో దేశం విపత్కర పరిస్థితి ఎదుర్కొంటోందని, ప్రజాస్వామిక, లౌకికవాదులంతా దీన్ని నిరసిస్తున్నారని చెప్పారు.

వసుధైక కుటుంబ వాదానికి వ్యతిరేకం..

తెలంగాణ తన సొంత నిర్మాణం చేసుకుంటూనే, దేశ నిర్మాణంలో భాగస్వామి అవుతోందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. దేశ సామాజిక భద్రతలో రాష్ట్ర భద్రత కూడా ఇమిడి ఉన్నందున సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు సీఎం కేసీఆర్ వివరించారు. వసుధైక కుటుంబంగా కలలు కంటున్న తరుణంలో, సాంకేతికత సరిహద్దులను చెరిపేస్తున్న ఈ సమయంలో సీఏఏను తెరపైకి తేవడం సమంజసం కాదన్నారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశ పర్యటన సందర్భంగా ఢిల్లీలో జరిగిన అల్లర్లలో 50 మంది చనిపోయారు. కొందరు ఎంపీలు, కేంద్ర మంత్రులు దుర్మార్గంగా మాట్లాడారు. గోలీమారో సాలోంకు.. అంటూ బాధ్యత మరిచి వ్యవహరించారు. దేశానికి ఇది వాంఛనీయం కాదు. దేశం ఇలాంటిది అంగీకరించదు. ఈ రాక్షసానందం దేశానికి మంచిది కాదు. అంతర్జాతీయంగా మన ఖ్యాతి దెబ్బతింటుంది. దేశానికి వేరే ఇతర సమస్య లేవీ లేనట్లు, ఇదొక్కటే సమస్య అన్నట్లు కల్లోలం లేపొద్దు'అని పేర్కొన్నారు.

బర్త్ సర్టిఫికేట్ లేని వారి సంగతేంటి?

'సీఎంగా నాకే బర్త్ సర్టిఫికెట్ లేదు. చింతమడక ఇంట్లో పుట్టిన. జన్మపత్రికే ఉంది. బర్త్ సర్టిఫికెట్ తీసుకురమ్మంటే ఎక్కడి నుంచి తేవాలి. దేశంలో నాలాగే కోట్లాది మంది సామాన్యులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల పరిస్థితేంటి? ఇది ఏ ఒక్కరి సమస్యో కాదు. 130 కోట్ల ప్రజలకు సంబంధించిన సమస్య'అని కేసీఆర్ పేర్కొన్నారు. 'ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకునేలా ఓటరు కార్డు ఇచ్చారు. సీఏఏకు ఓటింగ్ కార్డు పనికి రాదు. ఓటరు కార్డుతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు పనిచేయదంటున్నారు. దేశ ప్రధానిని ఎన్నుకునే ఓటర్ కార్డు కూడా సీఏఏకు పనిచేయదంటే ఎలా? దేశంలోకి చొరబాటుదారుల్ని అనుమతించాలని ఎవరూ చెప్పట్లేదు. మెక్సికో నుంచి వలసలు రాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోడ కడతామన్నారు. మయన్మార్ నుంచి చొరబాట్లు రాకుండా భారత్‌లో కూడా సరిహద్దు చుట్టూ గోడ కడతామంటే మేమూ మద్దతిస్తాం'అని తెలిపారు.

వ్యతిరేకిస్తే దేశద్రోహులేనా..

'ముస్లింలను మినహాయించి కేంద్రం బిల్లు తీసుకొచ్చింది. భారత రాజ్యాంగం కులమతాలకు అతీతంగా ఉంటుంది. సీఏఏని ఎవరైనా వ్యతిరేకిస్తే వారు దేశ ద్రోహులు, పాకిస్తాన్ ఏజెంట్లు అవుతారా? అసెంబ్లీ సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానిస్తే అసెంబ్లీలోని సభ్యులంతా దేశద్రోహులేనా. మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలో ఎల్‌కే అడ్వాణీ ఆధ్వర్యంలో సీఏఏపై 2003లో కమిటీ వేశారు. 12 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్వే కూడా చేశారు. 12 లక్షల మందికి మాత్రమే కార్డులు ఇవ్వగలిగారు. అప్పట్లోనే ఈ ప్రాజెక్టు విఫలమైందని యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాలు తేల్చాయి. అలాంటి విఫల ప్రయోగం మళ్లీ అవసరమా? ఇతర దేశాల నుంచి వచ్చిన కాందిశీకుల పరిస్థితేంటి? ఇతర ప్రాంతాల్లో వలసవచ్చి ఉంటున్న వారి పరిస్థితేంటి? విభజన రాజకీయాలు ఈ దేశానికి అవసరమా' అని సీఎం తీవ్ర స్వరంతో ప్రశ్నించారు.

ద్వంద్వ వైఖరి ఎందుకు..

'పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో ఎన్నార్సీ చేస్తామని ఉంది. ఎన్నార్సీ చేయం.. ఎన్పీఆర్ మాత్రమే చేస్తామని కేంద్ర హోంమంత్రి అంటున్నారు. నివేదిక ఒకటుంటే, చెప్పేది ఇంకోటుంది. దేన్ని నమ్మాలి. అందుకే అగ్గి పుట్టింది. కేంద్రానికి ద్వంద్వ వైఖరి అక్కర్లేదు. దేశంలో 50-60 శాతం మంది ప్రజలను ఇబ్బంది పెట్టడం అవసరమా? చేయదలుచుకుంటే నేరుగా చేయాలి.. ద్వంద్వ వైఖరి ఎందుకు? పౌరసత్వం ఇవ్వాలనుకుంటే రాద్ధాంతం అవసరం లేదు. నేరుగా ఇంకో విధానంలో అందరికీ ఆమోదయోగ్యంగా ఇవ్వండి. కొత్త ప్రతిపాదనతో ముందుకు వస్తే మద్దతిచ్చే అంశంపై ఆలోచిస్తామని స్పష్టం చేశారు. ఎంఐఎంతో కలసి పనిచేస్తున్నంత మాత్రాన అన్ని అంశాల్లో ఏకాభిప్రాయం ఉండదు. కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలు ఉంటాయన్నారు. కశ్మీర్ విషయంలో 370 అధికరణ విషయంలో మొట్టమొదట మద్దతిచ్చింది మేమే అన్న విషయం గుర్తు పెట్టుకోవాలి'అని సీఎం కేసీఆర్ వివరించారు. కాగా, ద్రవ్యవినిమయ బిల్లుపై జరిగిన చర్చలో కూడా సీఎం కేసీఆర్ ఎన్పీఆర్ అంశాన్ని ప్రస్తావించారు. ఎన్పీఆర్‌పై స్టే తీసుకురావాలని అక్బరుద్దీన్ అడిగిన అంశంపై వివరణ ఇచ్చారు. దేశంలో ఒకే భావజాలం ఉన్న ఇతర రాష్ట్రాలను సమీకరించి పోరాడుతామని భరోసా ఇచ్చారు. ఎన్పీఆర్‌పై స్టే తెచ్చే విషయంలో కేరళ ప్రభుత్వంతో కూడా మాట్లాడతామని పేర్కొన్నారు.

సోమవారం అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

తెలంగాణ విడిచి వెళ్లిపోతా: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

సీఏఏ, ఎన్పీఆర్ వల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందని తెలిసిన మరుక్షణమే తన శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి, తెలంగాణ విడిచి వెళ్లిపోతానని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటించారు. ఒక వర్గం మెప్పు కోసం అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. సీఏఏ విషయంలో కేసీఆర్ సర్కారు తెలంగాణ ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తోందని విరుచుకుపడ్డారు. ఎవరికి అన్యాయం జరుగుతోందో చెప్పకుండా.. ప్రజలను మోసం చేసేలా ప్రకటనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పాక్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌లలో అల్ప సంఖ్యాకులు అణచివేతకు గురవుతున్నారని, అక్కడి నుంచి ఇక్కడకు వచ్చిన శరణార్థులకు మాత్రమే పౌరసత్వం కల్పిస్తున్నామే తప్ప.. ఇక్కడ ఉన్న మైనార్టీ సోదరులు భయపడాల్సిన పరిస్థితి లేదన్నారు. గతంలోనూ ఎన్నార్సీ, ఎన్పీఆర్ సర్వేలు జరిగాయని, కానీ ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఇప్పుడు ఏదో జరిగిపోతున్నట్లు రాద్ధాంతం చేయడం గర్హనీయమన్నారు. తెలంగాణ ప్రజలకు ధోకా చేయొద్దనే వ్యాఖ్యలపై అధికారపార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ పదాలను రికార్డుల నుంచి తొలగించాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి ప్రకాశ్‌రెడ్డి మధ్యలో స్పీకర్‌ను కోరారు. మరోసారి రాజాసింగ్ మాట్లాడుతుండగా.. స్పీకర్ మైక్ కట్ చేశారు. దీంతో తీర్మాన ప్రతులను చించి తన నిరసన తెలిపారు. పోడియం వద్దకు వెళ్లి ఆందోళన కొనసాగించారు.

తక్షణమే అమలు నిలిపేయాలి: సీఎల్పీ నేత భట్టి

ఎన్పీఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ శాసన సభ పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేంద్రం కుట్రపూరితంగా తీసుకొచ్చిన పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తే సరిపోదని, ఆ చట్టం అమలు కాకుండా నిరోధించినప్పుడే తీర్మానానికి సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం సీఏఏ, ఎన్పీఆర్ వ్యతిరేక తీర్మాన చర్చలో భట్టి మాట్లాడుతూ.. 70 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఈ దేశ పౌరుడో కాదో నిరూపించుకోవాల్సి రావడం దురదృష్టకరమని దుయ్యబట్టారు. బర్త్ సర్టిఫికెట్లు, మీ తల్లిదండ్రులు ఎక్కడివారనే సమాచారాలపై ధ్రువపత్రాలు ఇవ్వకపోతే.. శరణార్థి శిబిరాలకు పంపుతామనే కేంద్ర నిర్ణయం ఆందోళన కలిగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహా తన లాంటి వారెందరో ఎన్పీఆర్ నియామావళికి అనుగుణంగా ఈ దేశ పౌరులమో కాదో నిరూపించుకోవడం కష్టమన్నారు. ఈ దేశ పౌరులకు ఆందోళనకరంగా మారిన సీఏఏ, ఎన్పీఆర్‌ను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, మోదీ ప్రభుత్వం ఈ సమస్యను ఒక మత సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. పౌరుల భద్రత, క్షేమం కోసం చట్టాలు చేయాల్సిన కేంద్రం కొన్ని వర్గాలను అణచివేసేలా చట్టాలను తీసుకురావడం దారుణమన్నారు. రాజ్యాంగానికి భిన్నంగా చట్టాలను తీసుకొస్తే ఒప్పుకునే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు. కేరళ తరహాలో వాటి అమలు ప్రక్రియ నిలిపేస్తూ జీవో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీకి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని స్వాగతిస్తున్నట్టు భట్టి చెప్పారు.

సజల.. సుజల.. సస్యశ్యామల తెలంగాణ

సాకారం అయ్యే వరకు నిబద్ధతతో పని చేస్తాం ● ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చకు సమాధానంలో ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: పేగులు తెగేదాకా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు, ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం వాటిల్లనివ్వబోమని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తెచ్చేవరకు విశ్రమించబోమని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో మిగిలిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, రైతును రాజును చేసే వరకు ఖర్చుకు వెనుకాడకుండా పని చేస్తామని, రైతు సంక్షేమమే ధ్యేయంగా సజల సుజల సస్యశ్యామల తెలంగాణను సాకారం చేసే వరకు నిబద్ధతతో పనిచేస్తామని వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ అనంతరం సీఎం కేసీఆర్ సమాధానం ఇచ్చారు. కేసీఆర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

గోదావరి నుంచి 950 టీఎంసీలు బాజాప్తాగా తెస్తాం...

తెలంగాణకు గోదావరిలో కేటాయించిన 950 టీఎంసీల నీటిని బాజాప్తాగా తీసుకొస్తాం. ప్రతి నీటి బొట్టును సద్వినియోగ పరచుకుంటాం. ఉమ్మడి రాష్ట్రంలో పక్క రాష్ట్రాలతో ఒప్పందాలు చేసుకోకుండానే ప్రాజెక్టులు ప్రారంభించారు. కాంగ్రెస్ నేతలంత అనుభవం మాకు లేకున్నా ఎగువ, దిగువ రాష్ట్రాలను ఒప్పించి ప్రాజెక్టులను కడుతున్నాం. కాంగ్రెస్ చెబుతున్నట్లుగా ప్రాణహిత ప్రాజెక్టులోని తమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు సంబంధించి అగ్రిమెంట్ ఉన్నట్లు చూపిస్తే రాజీనామా చేస్తా. కాంగ్రెస్ దాన్ని నిరూపిస్తుందా? వాళ్లు అసమర్థతను అంగీకరించరు. ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి ఇప్పుడు సభను, ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. కాళేశ్వరం ద్వారా 530 టీఎంసీల నీటిని గోదావరి నుంచి ధంకా భజాయించి తెస్తాం. దేవాదుల నుంచి 75 టీఎంసీలు, సీతమ్మసాగర్ ద్వారా 175 టీఎంసీల నీటిని తీసుకొస్తాం. మిషన్ కాకతీయ చాలా వరకు పూర్తయింది. రెండేళ్లలో 1,200 చెక్ డ్యామ్‌లను పూర్తిచేస్తాం. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి, తద్వారా రాష్ట్ర జీఎస్‌డీపీని పెంచుతాం.

కాంగ్రెస్ పంథా మార్చుకోవాలి...

కాంగ్రెస్ నేతలు పంథా మార్చుకోకపోతే వారికే మంచిది కాదు. మంచిని మంచి అనే సంస్కారం నేర్చుకోవాలి. సమైక్యాంధ్రుల శాపాలు, పనికిరారని చెప్పిన వారి అంచనాలను తలకిందులు చేస్తూ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకెళ్తోంది. అవన్నీ 'కాగ్' లెక్కలే. కేంద్ర మంత్రులు రాష్ట్ర పథకాలను పొగిడారు. రైతు బంధును ఐరాస అభినందించింది. అయినా ప్రభుత్వ మంచిని కాంగ్రెస్ ఒప్పుకోవట్లేదు.

సమైక్య పాలనలో రూ. 200 పెన్షన్...

సమైక్య రాష్ట్రంలో ప్రజలకు పెన్షన్ ముష్టి రూ. 200 ఇచ్చారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక పెన్షన్‌ను రూ. వెయ్యి చేశాం. వారి కడుపు నిండాలని, మంచిగా బతకాలని దాన్ని రూ. 2,016కు పెంచాం. ఏ రాష్ట్రంలో లేనివిధంగా బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్నాం. తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్ర జీఎస్‌డీపీ రూ. 4 లక్షల కోట్లు ఉంటే ఇప్పుడది రూ. 9.69 లక్షల కోట్లకు చేరుకుంది. టీడీపీ, కాంగ్రెస్ హయాంలో విజయ డెయిరీని నాశనం చేశారు. రూ. 30 కోట్ల అప్పుల్లో ఉన్న దాన్ని మేం రూ. 25 కోట్ల లాభాల్లోకి తెచ్చాం. పాల రైతులకు రూ. 4 ప్రోత్సాహం ఇస్తున్నాం. కామారెడ్డిలో ప్రాసెసింగ్ యూనిట్ పెట్టబోతున్నాం.

ఇది ప్రగతి కాదా..?

సాగునీటి ప్రాజెక్టుల్లో ఏం అపోహలున్నాయి. పంట పండుతుందా లేదా? అన్న ఆందోళనకర పరిస్థితి నుంచి భరోసాతో దర్జాగా పంటలు వేసుకునేలా రాష్ట్రంలో అభివృద్ధి చేశాం. 124 రోజులు కాకతీయ కాలువ సజీవంగా పారుతోంది. అది కాంగ్రెస్ నాయకులకు కనిపించట్లేదా? గతంలో ఎప్పుడైనా ఇలా ఉందా? యాసంగిలో 38 లక్షల ఎకరాలకుపైగా వరి నాట్లు వేశారు. తెలంగాణ సోనాను పెద్ద ఎత్తున పండించబోతున్నాం. సీడ్స్ అభివృద్ధి చేయాలని వ్యవసాయ యూనివర్సిటీకి చెప్పాం. వ్యవసాయ రంగంలో రాష్ట్రం 34 శాతం వృద్ధి సాధించింది. ఇది ప్రగతి కాదా?

మైనింగ్ పాలసీ మారుస్తాం..

ఉమ్మడి రాష్ట్రంలో ఇసుక ద్వారా పదేళ్లలో రూ. 50 కోట్లు వస్తే తెలంగాణ వచ్చాక రూ. 2 వేల కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. ఇప్పుడు రూ. 5-6 వేల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. గతంలో పెట్టిన మైనింగ్ పాలసీ బాలేదు. దాన్ని మారుస్తాం. త్వరలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచబోతున్నాం. ఆరేళ్లలో పైసా పెంచలేదు. ఈసారి రూ. 1.63 లక్షల కోట్ల ఆదాయం సాధిస్తాం. మైన్స్, ఇసుక, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ద్వారా మరో రూ. 20 వేల కోట్లు సాధిస్తాం.

అవసరమైతే మద్యం ధరల పెంపు

కాంగ్రెస్ ఎప్పుడైనా మద్యనిషేధం అమలు చేసిందా? కాంగ్రెస్ హయాంలో బెల్టు షాపులే లేనట్లు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ హయాంలో వీధివీధికీ సారా తయారీ ఉండేది. మద్యపానాన్ని తగ్గించేందుకే రేట్లు పెంచాం. అవసరమైతే మళ్లీ మద్యం ధరలు పెంచుతాం. 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నాం కాబట్టి విద్యుత్ చార్జీలూ పెంచక తప్పదు. ప్రజలను మోసం చేయం. నిజాలు చెబుతాం.

నిరుద్యోగులను మోసగించొద్దు..

తెలంగాణ ఏర్పడితే లక్ష ఉద్యోగాలు వస్తాయని చెప్పా. ఇంటికో ఉద్యోగం వస్తుందని చెప్పలేదు. మేం చెప్పినట్లు ఉద్యోగాలు ఇస్తున్నాం. 70 ఏళ్ల చరిత్రలో గత ప్రభుత్వాలు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాయి? నిరుద్యోగ యువతను మోసం చేయడం విపక్షాలు మానుకోవాలి. వాస్తవాలు చెబితే ప్రజలు గౌరవిస్తారు. డ్రామాలు ఆడుతూ వారిని జులాయిలుగా తయారు చేయొద్దు. 50 లక్షల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తానని నేను చెప్పలేదు. అది సాధ్యమా?

దేశాన్ని తెలంగాణ సైతం సాకనుంది..

తెలంగాణ నుంచి కేంద్రానికి రూ. 2,72,926 కోట్లు వెళ్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ. 1,12,854 కోట్లే వచ్చాయి. ఇంకా రూ. 1,62,070 కోట్లను కేంద్రమే వాడుకుంటోంది. కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాల్లో కోత పెట్టారు. భవిష్యత్తులో దేశాన్ని నడిపించే నాలుగైదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా ఉండబోతోంది. కేంద్రానికి మనం భిక్ష వేస్తున్నామా? కేంద్రం మనకు భిక్ష వేస్తుందా? నేడు అత్యధికంగా అప్పులున్న దేశం అమెరికా. వాళ్లేం తెలివి తక్కువ వాళ్లా? తెచ్చిన అప్పు ఏం చేస్తున్నాం అనేది ముఖ్యం. తెచ్చిన అప్పుల్లో సాగునీటి ప్రాజెక్టులపై రూ. లక్ష కోట్లు పెట్టాం. రైతులు పంటలు పండిస్తే రెండేళ్లలోనే సగం అప్పులు తీరిపోతాయి. రాష్ట్రంలో 2 లక్షల టన్నులకుపైగా సన్న బియ్యం పంట పండబోతోంది.

కేంద్రం తరహాలో కనీస వేతనాలు...

చేనేత కార్మికులకు నూలు, రంగులను 50% సబ్సిడీపై ఇప్పిస్తున్నాం. కాలిపోయిన ఇళ్లకు పరిహారం ఇస్తాం. కార్మికులకు కనీస వేతనాలను కేంద్రం ఎంత ఇస్తుందో రాష్ట్రంలో అంత చేస్తాం. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగులు కాదు. వారికి కాంగ్రెస్ మద్దతు సరికాదు. వారి విషయంలో కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారు.

సీఏఏతో విద్వేషపు గోడలు

- ఇది ముస్లింలు సహా అణగారిన వర్గాలకు వ్యతిరేకం
- ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ

సాక్షి, హైదరాబాద్: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) దేశాన్ని విభజిస్తోందని, బలహీనం చేస్తోందని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ప్రజల మధ్య విభజన తెచ్చేలా, రాజ్యాంగ వ్యతిరేకంగా సీఏఏను కేంద్రం తెరపైకి తెచ్చిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చలో అక్బరుద్దీన్ మాట్లాడుతూ సీఏఏ కేవలం ముస్లింలకే కాకుండా అణగారిన వర్గాలు, పేదలు, మహిళలందరికీ వ్యతిరేకంగా ఉందన్నారు. సీఏఏపై కేంద్రం వెనక్కి తగ్గే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో ఎవరికీ భయపడబోమన్నారు. అలాగే రాష్ట్రంలో వచ్చే నెల ఒకటి నుంచి మొదలుకానున్న జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) ప్రక్రియను వెంటనే నిలుపుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కేరళ తరహాలో ఎన్‌పీఆర్‌ను నిలిపేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించారు. తన ప్రసంగంలో అక్బరుద్దీన్ ఇంకా ఏమన్నారంటే...

దేశం కోసం తల నరుక్కుంటా...

పౌరసత్వ సవరణ చట్టం దేశ పౌరులను విదేశీయులుగా, విదేశీయులను దేశ పౌరులుగా మారుస్తోంది. సీఏఏ ముస్లిం వ్యతిరేకమని, ముస్లింలు ఈ చట్టానికి వ్యతిరేకమని చూడాల్సిన అవసరం లేదు. ఈ చట్టం పేదలకు వ్యతిరేకం. పెద్దగా చదువు రాని భారతీయులకు వ్యతిరేకం. దేశ మహిళలకు వ్యతిరేకం. ఎస్సీ, ఎస్టీలు, ఆదివాసీలు, బలహీన వర్గాలకు వ్యతిరేకం. ఈ చట్టం పేద హిందూ సోదరులకు వ్యతిరేకం. నేను ముస్లిం కావడంపట్ల, భారతీయుడిని కావడంపట్ల గర్వపడుతున్నా. అయితే నన్ను కేవలం ముస్లింగానే చూస్తున్నారు. అలా కాకుండా నన్ను భారతీయ ముస్లింగా చూడాలి. కానీ కొందరు దేశద్రోహి అని, పాకిస్తాన్ వెళ్లాలని అంటున్నారు. నేను ఈ దేశవాసిని. దేశం కోసం అవసరమైతే ప్రాణం అర్పిస్తా... తల నరుక్కుంటా. దేశం కోసం హిందూ, ముస్లిం, సిక్కులంతా ప్రాణాలు అర్పించారు. ఈ దేశం ప్రతి ఒక్కరిది. ఏ మతాన్నీ ఆచరించని వారిది కూడా. అయితే ప్రస్తుత చట్టం దేశాన్ని విభజిస్తోంది.

దేశాన్ని ఏకం చేసే చట్టాలు కావాలి...

దేశాన్ని ఏకం చేసే చట్టాలు, ఆలోచనలు మనకు కావాలి తప్ప విద్వేషాలు కాదు. విరిగిన హృదయాలు, దూరమైన ఇద్దరు సోదరులను దగ్గరికి తెచ్చేలా చట్టాలు ఉండాలి తప్ప దూరం పెంచేవిగా కాదు. సీఏఏ వంటి చట్టాలతో ప్రజల మధ్య దూరం పెరిగింది. మనం

సోమవారం ఇండొనేసియా పర్యాటకులను కరోనా స్క్రీనింగ్ కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

మరొకరికి కరోనా

▶ మొదటి పేజీ తరువాయి

కోవిడ్ అనుమానిత లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. వీరి పరీక్షల నివేదికలు రావాల్సి ఉంది.

22 మంది హరిత హోటల్‌కు..

హైరిస్క్ దేశాల నుంచి వచ్చిన 22 మందిని వికారాబాద్ జిల్లా అనంతగిరి హరిత హోటల్‌కు తరలించారు. వీరు చైనా, ఇటలీ, ఇరాన్, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, దక్షిణ కొరియాల నుంచి వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. హరిత హోటల్‌లో వీరికి ప్రత్యేకంగా గదులు కేటాయించారు. అక్కడ మొత్తం 32 గదులున్నాయని, ఒక కుటుంబం మొత్తం ఒకే గదిలో ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆయా దేశాల నుంచి వచ్చిన దాదాపు 107 మందిని గుర్తించే పనిలో అధికారులున్నారు.

శ్వాసకోశ వ్యాధిగ్రస్తుల వివరాలు చెప్పాలి

కోవిడ్ ఏ మేరకు ప్రజల్లోకి వెళ్లిందన్న దానిపై అధికారుల్లో అయోమయం నెలకొంది. కొందరు విమానాశ్రయం నుంచి నేరుగా వెళ్లిపోతున్నారు. వారి ద్వారా ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. కోవిడ్ శ్వాసకోశ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి కాబట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వైద్య ఆరోగ్య శాఖ కొన్ని ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. క్లినికల్ సర్వైలెన్స్ చేయడం తప్పనిసరి చేసింది. ఆస్పత్రులకు ఎంతమంది న్యుమోనియాతో వస్తున్నారు? వారిలో చనిపోయిన వారెందరు తదితర వివరాలు పంపాలని ఆస్పత్రులకు ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. 15 ఏళ్లకు పైబడిన వారి వివరాలు ఇవ్వాలని సూచించింది. అలాంటివి వస్తే తక్షణమే ఐడీఎస్‌పీ బృందానికి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ సీమ తబుసం ఫోన్ నంబర్: 9059746612కు వివరాలతో వాట్సాప్ చేయాలని ఆదేశించారు. కాగా, జలుబు, దగ్గు, జ్వరం, ముక్కు కారటం వంటి కోవిడ్ అనుమానిత కేసులు వస్తే అనేక ప్రైవేటు ఆస్పత్రులు నిరాకరిస్తున్నాయి. కర్ణాటకకు చెందిన ఓ బాధితుడు రెండు, మూడు ప్రైవేటు ఆస్పత్రులకు తిరగడం, ఆ తర్వాత చనిపోవడంతో ఒక్కసారిగా ఆయా ఆస్పత్రుల్లో ఆందోళన పెరిగింది. ఇలాంటి కేసులు తీసుకుంటే సాధారణ రోగులు రావడానికి భయపడతారనేది వాటి భావన. మొదట్లో కోవిడ్ నియంత్రణకు ముందు కొస్తామని చెప్పినా.. ఇప్పుడు వెనకడుగు వేస్తున్నాయి.

కరీంనగర్‌లో కోవిడ్ టెన్షన్

కరీంనగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో సోమవారం కోవిడ్ వదంతులతో హైటెన్షన్ నెలకొంది. ఇండొనేసియా నుంచి వచ్చిన 10 మంది వైద్య పరీక్షల కోసం రావడం, అందులో ఒకరికి జ్వరం, దగ్గు, జలుబు ఉండటంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. ఐసోలేషన్ వార్డుకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కోవిడ్ పరీక్షల కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇండొనేసియాకు చెందిన 10 మంది మత బోధకుల బృందం ఈ నెల 9న భారత్‌కు వచ్చింది. ఢిల్లీ విమానాశ్రయంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి రైలులో రామగుండం చేరుకొని, 14 సాయంత్రం కరీంనగర్‌కు వచ్చి ఓ ప్రార్థనా మందిరంలో బస చేశారు. 15న ఉదయం పోలీసులకు రిపోర్టు చేసేందుకు వెళ్లగా, స్థానికంగా వైద్య పరీక్షలు చేయించుకొని మెడికల్ రిపోర్టులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రికి ఉదయం 10 గంటలకు చేరుకోగా, పరీక్షలు నిర్వహించారు.

నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి..

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలానికి చెందిన ఓ వ్యక్తి (40)కి కోవిడ్ లక్షణాలున్నాయని అక్కడి ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి పంపారు. అతడు 10 రోజుల కింద సౌదీ నుంచి వచ్చాడు. అప్పటినుంచి తీవ్ర జ్వరం, దగ్గుతో బాధపడుతున్న అతడు సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చాడు. కోవిడ్ లక్షణాలున్నాయని చెప్పడంతో కుటుంబసభ్యులు గాంధీకి తరలించారు.

కోవిడ్ బాధితులకు మంత్రి ఈటల ఫోన్

కోవిడ్ వైరస్ బారిన పడి గాంధీలో చికిత్స పొందుతున్న ముగ్గురితో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఫోన్‌లో మాట్లాడారు. వాళ్ల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వార్డులో ఉన్న సౌకర్యాలు, ఆహారం తదితరాలు అడిగి తెలుసుకున్నారు. వైరస్ బారిన పడిన యువకుడు కోలుకున్నాడని గుర్తు చేస్తూ ఈ ముగ్గురికి ధైర్యం చెప్పారు. వాళ్లు అడిగిన సౌకర్యాలు సమకూర్చాలని గాంధీ సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్‌కు మంత్రి సూచించారు. ఈ మేరకు మంత్రి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటోందని, ఎవరూ భయపడాల్సిన పని లేదని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు.

గచ్చిబౌలి స్టేడియంలో 400 గదులు..

గచ్చిబౌలి స్టేడియానికి అనుబంధంగా ఉన్న టవర్లలో 400 గదులు అందుబాటులో ఉన్నాయి. వాటిని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తారు. అవసరమైతే వాటిని శాశ్వతంగా వైరస్ నియంత్రణ ఆస్పత్రిగా మార్చాలన్న ఆలోచనలో సర్కారు ఉంది. ఫారెస్ట్ అకాడమీ సహా మరో నాలుగైదు ప్రభుత్వ సంస్థలకు చెందిన భవనాలను కూడా సిద్ధం చేస్తున్నారు. విమానాశ్రయానికి వచ్చే ఏడు దేశాలకు చెందిన వారెవరినైనా సరే సర్కారు ఆధ్వర్యంలోనే ఐసోలేషన్ చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం లిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చారు.

విమానాశ్రయంలో 63,181 మందికి స్క్రీనింగ్

హైదరాబాద్ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చిన వారిలో ఇప్పటివరకు మొత్తం 63,181 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్యశాఖ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

మహారాష్ట్ర సరిహద్దుల్లో హై అలర్ట్

మహారాష్ట్రలో అత్యధిక కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చే రూట్లలో, చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. ధర్మబాద్, బోరజ్, జహీరాబాద్, సిర్పూర్ కాగజ్ నగర్ శివారుల్లోని చెక్ పోస్ట్‌ల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్కారు తెలిపింది. అవసరమైన చోట థర్మల్ స్క్రీనింగ్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. సాధారణంగా మహారాష్ట్ర నుంచి మన రాష్ట్రానికి అనేకమంది వస్తూపోతుంటారు. బస్సులు, రైళ్లల్లో వచ్చి వెళ్తుంటారు. దీంతో వైరస్ మనకు విస్తరించే ప్రమాదం ఉందన్న భావన నెలకొంది. కాగా, వైరస్ వ్యాప్తిపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న భావనతో, కొందరు ఫేక్ పేర్లతో పలానా వ్యక్తికి కోవిడ్ వచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీంతో హైదరాబాద్‌లో ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారని ప్రజారోగ్య విభాగం తెలిపింది.

రైలు బోగీల్లో ఏసీ 25 డిగ్రీలే..

- అంతకంటే చల్లగా ఉండనివ్వరు
- కర్టెన్ల తొలగింపు.. బెడ్‌షీట్లు మాత్రమే అందుబాటులోకి
- రైల్వే శాఖ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో కోవిడ్ వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతుండటంతో ప్రజా రవాణాపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా రైళ్ల నిర్వహణలో ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే రైల్వే ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులు, ప్రత్యేక వైద్యులను అందుబాటులోకి తీసుకొచ్చిన రైల్వే శాఖ.. తాజాగా రైలు బోగీల్లో చర్యలకు శ్రీకారం చుట్టింది. కోవిడ్ ప్రభావాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించటంతో వెంటనే రైల్వే శాఖ పలు నిర్ణయాలను అమల్లోకి తెచ్చింది. ముఖ్యంగా ఏసీ బోగీలపై ప్రధాన దృష్టి

కేంద్రీకరించింది. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో సాధారణంగా ఏసీ బోగీల్లో ఉష్ణోగ్రత 17, 18 డిగ్రీలుగా ఉండేలా చూస్తారు. కానీ కోవిడ్ వైరస్ నేపథ్యంలో ఉష్ణోగ్రత 25 డిగ్రీల కంటే తక్కువగా ఉండొద్దని రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు ఏసీ బోగీల్లో ఉండే కర్టెన్లు అన్నింటినీ తొలగించాలని ఆదేశించింది. కర్టెన్లను నిత్యం మార్చరు. కొన్ని రైళ్లలో పక్షం రోజులకోసారి, కొన్నింటిలో నెలకోసారి మార్చి ఉతికినవి ఏర్పాటు చేస్తారు. ప్రస్తుత పరిస్థితిలో అవి ఉండటం క్షేమం కాదని అధికారులు నిర్ణయించారు. అలాగే ఏసీ బోగీల్లో సాధారణ బెడ్‌షీట్లను మాత్రమే అందుబాటులో ఉంచుతారు. వాటిని నిత్యం మార్చి ఉతికిన జతను సరఫరా చేస్తున్నందున వాటిని యథావిధిగా అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. చలి తీవ్రతను తట్టుకునేందుకు ఇచ్చే బ్లాంకెట్లను సైతం తొలగించారు. ఎవరైనా డిమాండ్ చేస్తే ఇస్తారంటూ జరిగిన ప్రచారం సరికాదని అధికారులు తేల్చి చెప్పారు. అసలు వాటిని అందుబాటులోనే ఉంచమని, మరీ చలిని తట్టుకోలేని వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి మాత్రం రెండు మూడు ఉతికి శుభ్రంగా ఉన్నవి మాత్రం అందుబాటులో ఉంచుతారు. వీలైనంతవరకు వాటి వాడకాన్ని కూడా లేకుండా చూసే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణంగా బెడ్‌షీట్లను నిత్యం మార్చి ఉతికినవాటిని అందుబాటులో ఉంచుతారు. కానీ బ్లాంకెట్లను మాత్రం 40 రోజులకోమారు మాత్రమే మారుస్తారు. అంతకుముందు ఇతరులు ఉపయోగించినవాటిని వేరే వారికి వాడకానికి అందివ్వడం ప్రస్తుత పరిస్థితిలో ఏ మాత్రం క్షేమకరం కాదని ఈ నిర్ణయం తీసుకున్నారు. మధ్యలో ఎక్కే ప్రయాణికులకు కూడా కొత్త బెడ్‌షీట్లు ఇచ్చేందుకు అదనంగా కొన్నింటిని అందుబాటులో ఉంచాలని కూడా ఆదేశాలందాయి. ఈ మేరకు రైల్వే శాఖ సోమవారం ప్రకటించింది. ఈ నిబంధనలను వెంటనే అమల్లోకి తెచ్చినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన పౌరసంబంధాల అధికారి రాకేశ్ పేర్కొన్నారు. ఇక క్లీన్ ట్రైన్ స్టేషన్లు (సీటీఎస్)గా ఉన్న సికింద్రాబాద్, విజయవాడ, గుంతకల్, రేణిగుంట స్టేషన్లలో, దూరప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను అప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు తీసుకున్నారు.

నిరంతరం పరిశుభ్రత చర్యలు..

రైళ్లలో ప్రత్యేకంగా ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సిబ్బంది ఉంటారు. వీరు నిరంతరం ప్రయాణికులు ఎక్కువగా వాడే నల్లాలు, తలుపులు, గొళ్లాలు, డోర్ హ్యాండిళ్లను వారు క్రిమి సంహారక రసాయనాలతో నిరంతరం శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రయాణికులు యాప్ ద్వారా పేర్కొన్నా, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా వారు వచ్చి సూచించిన ప్రాంతాన్ని శుభ్రం చేసి వెళ్తారు. ఇప్పటికే ఈ చర్యలు ప్రారంభించగా, కేంద్రం తాజాగా జాతీయ విపత్తుగా ప్రకటించడంతో మరింత అప్రమత్తంగా చర్యలు ప్రారంభించారు. దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో అప్పుడప్పుడు నీళ్లు అయిపోతాయి. తదుపరి నీటిని నింపే స్టేషన్ వచ్చే వరకు టాయిలెట్లు, వాష్ బేసిన్ వద్ద నీళ్లు ఉండవు. ఇప్పుడా పరిస్థితి లేకుండా నిరంతరం పుష్కలంగా రైళ్లలో నీళ్లు అందుబాటులో ఉంచాలని కూడా కేంద్రం ఆదేశించింది. అలాగే టాయిలెట్లను శుభ్రంగా ఉంచాలని, అక్కడ చేతులు కడుక్కోవడానికి వీలుగా సబ్బు ద్రావణం, ఇతర క్రిమి సంహారక ద్రావణాలు ఉంచాలని కూడా ఆదేశించింది.

కోవిడ్ కట్టడికి కట్టుదిట్ట చర్యలు

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించిన ఈటల

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వివరించారు. ఈ మేరకు సోమవారం ఆయన అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ అయ్యారు. కరోనా వైరస్ నియంత్రణ, పాజిటివ్ వచ్చిన వారికి అందిస్తున్న చికిత్స, ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలను సీఎంకు ఈటల వివరించారు. గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ వసతులను వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రొక్యూర్‌మెంట్ కమిటీ హెడ్, ఐఏఎస్ అధికారి శ్రీదేవి, వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమేశ్ రెడ్డి, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌తో ఫోన్లో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. ఆ వివరాలను సీఎంకు వివరించారు. పీహెచ్‌సీలకు అందించేందుకు అవసరమైన శానిటైజర్లకు ఆర్డర్లిచ్చామని, చికిత్స అందించేందుకు సరిపోయేంత మందులు కొనాలని కోరామన్నారు. థర్మో స్కానర్ల కొనుగోలుకు ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు.

టెండర్లు లేకుండా కొనుగోళ్లు...

టెండర్లు లేకుండా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని మంత్రి ఈటల అధికారులను ఆదేశించారు. మార్కెట్లో కంటే అతి తక్కువ ధరతో, నాణ్యమైన వాటిని సేకరించేలా చర్యలు తీసుకోవాలని ప్రొక్యూర్‌మెంట్ చైర్మన్‌ను, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీని కోరారు. గాంధీ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డు దగ్గరికి సాధారణ వ్యక్తులు ఎవరూ వెళ్లకుండా దారులు అన్నీ మూసి వేయాలని ఆదేశించారు. ఐసోలేషన్ వార్డుల్లో పనిచేయడానికి మూడు షిఫ్టుల్లో సరిపోయేంత సిబ్బంది, వారికి కావాల్సిన వ్యక్తిగత భద్రత కిట్స్, శానిటైజర్లు, మాస్కులు అందించాలన్నారు. గచ్చిబౌలిలో ఏర్పాటు చేస్తున్న క్వారెంటైన్ రూములను వెంటనే అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరారు. స్కాట్లాండ్ నుంచి వచ్చిన ఒక వ్యక్తికి కోవిడ్ వైరస్ పరీక్షలో పాజిటివ్ వచ్చిందని, నిర్ధారణ కోసం మరోసారి పరీక్ష చేస్తున్నామన్నారు. కరోనా పాజిటివ్ అంటూ సోషల్ మీడియాలో వార్తలు సర్క్యులేట్ చేస్తున్న వారిపై కేసులు పెట్టాలని మంత్రి ఆదేశించారు.

ఐసోలేషన్ వార్డుల్లో అందుబాటులో ఉంచిన ఎన్-95 మాస్కులు:	50,000
కొనుగోలు చేసిన వ్యక్తిగత రక్షణ పరికరాలు:	25,000
కొనుగోలుకు ఆదేశాలు జారీ చేసిన గ్లౌజులు:	1,00,000
ట్రిపుల్ లేయర్ మాస్కులు:	2,00,000

వినియోగదారుల కమిషన్‌లోనూ...

రాష్ట్ర వినియోగదారుల కమిషన్, జిల్లా ఫోరాల్లో కూడా సోమ, గురువారాల్లో అత్యవసర కేసుల్ని మాత్రమే విచారించాలని నిర్ణయించాయి. ఈ మేరకు రాష్ట్ర కమిషన్ చైర్మన్ ఎం.ఎస్.జైశ్వాల్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 17 నుంచి 31 వరకూ విచారించాల్సిన కేసుల్ని ఏప్రిల్‌కు వాయిదా వేశారు. అత్యవసర కేసుల్ని విచారణ చేయాలని నిర్ణయించినా కేసుల దాఖలుకు మాత్రం ఎలాంటి ఆటంకాలు లేవని తెలిపారు.

ఓయూ హాస్టళ్ల బంద్

నేడు నీళ్లు, కరెంట్ కట్

ఉస్మానియా యూనివర్సిటీ: కోవిడ్ వ్యాప్తిని నియంత్రించేందుకు తరగతులు రద్దు చేసిన ఓయూ అధికారులు క్యాంపస్‌లోని 25 హాస్టళ్లను, భోజన శాలలను మూసి వేశారు. హాస్టళ్లలో ఉంటున్న పీజీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఇతర కోర్సుల విద్యార్థులు సోమవారం నాటికి 80శాతం మంది సొంత ఊళ్లకు వెళ్లారు. హాస్టళ్లను పూర్తిగా మూసి వేసేందుకు మంగళవారం క్యాంపస్‌లోని 25 హాస్టళ్లకు నీరు, విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా హాస్టళ్ల మూసివేత పట్ల పీహెచ్‌డీ విద్యార్థులు అభ్యంతరం తెలిపారు.

అంగన్‌వాడీలకూ సెలవులివ్వాలి

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతి

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ హెల్త్ ఎమర్జెన్సీ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సెలవులు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చినట్లు అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సెలవులు ఇవ్వాలని, ఈ వైరస్ ప్రభావం చిన్నారులపై పడే అవకాశం ఉండడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని యూనియన్ అధ్యక్షురాలు ఎన్.భారతి ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. జాతీయ విపత్తు నేపథ్యంలో లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని ఇంటింటికీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కోవిడ్ వ్యాప్తిపై సీఎస్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోవిడ్ వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండటానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఇచ్చిన సూచనలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం జారీ చేసిన సూచనలు కచ్చితంగా పాటించాలని కోరారు. సోమవారం కోవిడ్ వైరస్ నియంత్రణ, సన్నద్ధతపై సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. విదేశీ ప్రయాణం నుంచి వచ్చిన వారిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏడు దేశాల నుంచి వచ్చిన వ్యక్తులు, వారిని కలసిన వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేయాలని సూచించారు. పరిస్థితిని అత్యంత జాగ్రత్తగా నియంత్రించాలని, ఎలాంటి సమస్య ఎదురైనా సమర్థంగా పరిష్కరించాలని ఆదేశించారు. కోచింగ్ కేంద్రాలతో సహా అన్ని విద్యాసంస్థలు ఈ నెలాఖరు వరకు తక్షణమే మూసేయాలని ఆదేశించారు. బోర్డు పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. జిల్లాల్లో సామూహిక సమావేశాలు, కార్యక్రమాలు జరగకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. వైరస్‌పై నకిలీ వార్తలను వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులను కొనసాగించడానికి అనుమతిచ్చారు. మహారాష్ట్రలో అధిక సంఖ్యలో కోవిడ్ కేసులు నమోదవుతున్నాయని, సరిహద్దు జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు సునీల్ శర్మ, వికాస్‌రాజ్, జగదీశ్వర్, సందీప్ కుమార్ సుల్తానియా, సుదర్శన్‌రెడ్డి, ఉమర్ జలీల్, శ్రీదేవి, యోగితా రాణా, మాణిక్‌రాజ్, లోకేశ్‌కుమార్, రఘునందన్ రావు, జితేందర్ పాల్గొన్నారు.

వారానికి మూడు రోజులే హైకోర్టు

కరోనా వ్యాప్తి నివారణకు ఉన్నత న్యాయస్థానం నిర్ణయం

- కింది కోర్టుల్లోనూ అత్యవసర కేసులే విచారణ
- బెయిల్, ఇంజక్షన్ కేసులకే ప్రాధాన్యత
- స్టేల పొడిగింపునకు న్యాయవాదులు ప్రయత్నించాలని సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని న్యాయస్థానాల్లో కరోనా వైరస్ వ్యాపించకుండా నివారించేందుకు హైకోర్టు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు కోర్టులు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో పలు సూచనలు చేసింది. సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ అధ్యక్షతన మొత్తం న్యాయమూర్తులతో కూడిన ఫుల్ బెంచ్ సమావేశమైంది. అడ్వొకేట్‌జనరల్ బీఎస్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సూర్యకరణ్‌రెడ్డి, పలువురు వైద్యులు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్టుల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అంతకుముందు నాంపల్లి, రంగారెడ్డి, ఇతర కింది కోర్టుల్లో కేసుల సంఖ్య అధికంగా ఉండటం వల్ల రద్దీ అధికంగా ఉంటోందని, ఈ విషయంలో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ప్రధాన న్యాయమూర్తికి బార్ కౌన్సిల్ చైర్మన్ వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల విషయంలోనూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎ.వెంకటేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు, ఇతర కోర్టుల బార్ అసోసియేషన్లను మూసేయాలని పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ హైకోర్టు తీసుకున్న నిర్ణయాలు అమల్లో ఉంటాయని స్పష్టంచేశారు.

ఇవీ నిర్ణయాలు...

- హైకోర్టు ఇకపై ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో వారానికి మూడురోజులు మాత్రమే పనిచేస్తుంది.
- ఉగాది 25న బుధవారం వచ్చినందున ఆ రోజుకు బదులు 26న పనిచేస్తుంది.
- హైకోర్టులో ద్విసభ్య న్యాయమూర్తుల ధర్మాసనం ఒకటి, నాలుగు ఏకసభ్య ధర్మాసనాలు అందుబాటులో ఉంటాయి.
- అన్ని స్థాయి కోర్టుల్లోనూ కక్షిదారులు న్యాయస్థానానికి రాకూడదు. కేసుకు సంబంధం ఉన్న న్యాయవాది మాత్రమే కోర్టు హాల్లోకి అనుమతి ఇస్తారు.
- ఇతర న్యాయవాదులు కోర్టు కారిడార్లకే పరిమితం కావాలి.
- గతంలో వివిధ కేసుల్లో జారీ చేసిన స్టే ఉత్తర్వుల గురించి కోర్టుల దృష్టికి తీసుకువచ్చి వాటి పొడిగింపునకు న్యాయవాదులు ప్రయత్నించాలి.
- ఈ నెల 17 నుంచి 31 తేదీల మధ్య స్టే ముగిసే కేసుల్లో తిరిగి ఉత్తర్వులు పొందాలి.
- కోర్టులు స్పందించకపోతే పరిణామాలు చేయి దాటేలా ఉంటాయన్న కేసులను మాత్రమే విచారిస్తాయి.
- న్యాయవాదులు కోర్టులోకి వచ్చేముందు చేతులు శుభ్రం చేసుకోవాలి. ఇందుకోసం కోర్టు హాలు బయట ఏర్పాటు చేసే శానిటైజర్లను వినియోగించాలి.
- న్యాయవాదులు, ఇతరులు గుంపులుగా ఉండకూడదు.
- కోర్టు ధిక్కార కేసుల్లో వ్యక్తిగత హాజరు కావాలన్న ఉత్వర్వులు తదుపరి ఆదేశాలు వెలువడే వరకూ అమలు కావు.
- కోర్టు ధిక్కార కేసుల్లో వ్యక్తిగత హాజరుపై తాజాగా వెలువడిన ఈ ఉత్తర్వులను అడ్వొకేట్ జనరల్ కార్యాలయం సంబంధిత అధికారులకు తెలియజేయాలి.
- అన్ని రకాల పిటిషన్లు దాఖలు చేసేందుకు వీలుంటుంది. అయితే అత్యంత ముఖ్యమైన కేసులను మాత్రమే కోర్టులు విచారిస్తాయి.
- హైకోర్టు సిబ్బందికి సోమవారం నుంచే బయోమెట్రిక్ హాజరు రద్దు చేశారు. వారంతా రిజిస్టర్లలో సంతకాలు పెట్టాలి.
- బార్ అసోసియేషన్, మహిళా న్యాయవాదుల భోజనశాలల్ని మూసివేయాలి.
- న్యాయమూర్తుల వద్ద పనిచేసే లా క్లర్కులు తిరిగి ఉత్తర్వులిచ్చే వరకూ విధులకు హాజరు కానవసరం లేదు.
- కింది కోర్టుల్లో బెయిల్, ఇంజక్షన్, రిమాండ్ కేసులకు ప్రాధాన్యత ఇచ్చి వాటిని మాత్రమే విచారించాలి. ఇతర కేసుల్ని మూడు వారాల పాటు వాయిదా వేయాలి.
- వ్యక్తిగతంగా హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎవరు కోరినా కింది కోర్టు సానుకూలంగా ఉండాలి.



మ.. మ.. మాస్క్ ఖైదీలు!

- కరోనా నేపథ్యంలో అప్రమత్తమైన జైళ్లశాఖ
- కోర్టుకు వెళ్లి వచ్చేవారిపై ప్రత్యేక శ్రద్ధ
- మాస్కుల పంపిణీ, స్నానం చేశాకే మళ్లీ జైలులోకి..

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ (కరోనా) వైరస్ దెబ్బకు అన్ని శాఖలతో పాటు జైళ్ల శాఖ కూడా అప్రమత్తమైంది. వందలాది మంది ఒకేచోట ఉండే ప్రాంతం కావడంతో వారి ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు జైళ్ల శాఖ ఖైదీల ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేంద్ర (చంచల్‌గూడ, చర్లపల్లి, వరంగల్) కారాగారాలు, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లా కారాగారాలకు జారీ చేసింది. ముఖ్యంగా కోర్టు విచారణలకు వెళ్లి వచ్చే ఖైదీలకు ప్రత్యేకంగా మాస్కులు ఇస్తోంది. ఇటు ఖైదీతో పాటు వచ్చే ఎస్కార్టు సిబ్బందికీ

ప్రజలను మోసం చేసిన బడ్జెట్ ఇది: భట్టి

సాక్షి, హైదరాబాద్: ఈ బడ్జెట్ ప్రజలకు మేలు చేస్తుందనుకుంటే మోసం చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ప్రభుత్వంపై మండిపడ్డారు. గొప్పలు చెప్పి రూ.1.83 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చూపి అప్పులు తేవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. సోమవారం బడ్జెట్ సమావేశాలు ముగిసిన అనంతరం పార్టీ ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్కలతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో భట్టి మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో కేవలం అంకెలు చెప్పారు తప్ప వాస్తవానికి దగ్గర్లో లేదని, రాష్ట్ర రాబడిలో రూ.25 వేల కోట్ల వ్యత్యాసం కనిపిస్తోందని పేర్కొన్నారు. మద్యం, భూములు అమ్మేసి రాష్ట్రాన్ని నడపాలని ప్రభుత్వం చూస్తోందని, తెచ్చిన అప్పులు తీర్చడానికి మళ్లీ అప్పులు తెస్తున్నారని ఆరోపించారు. రాబోయే తరం ఈ అప్పులను కట్టలేని దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని సీఎంను అడిగితే.. ప్రభుత్వం మీకిస్తే భర్తీ చేస్తారా అని ఆయన విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని భట్టి అన్నారు.

స్వాగతిస్తున్నాం.. కానీ సందేహాలున్నాయి

అసెంబ్లీలో ఎన్నార్సీ తీర్మానంపై కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: ఎన్నార్సీ, సీఏఏ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఈ తీర్మానంపై తమకు సందేహాలున్నాయని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ అన్నారు. ఆరు పేజీల తీర్మానంలో కేవలం మూడు లైన్లు మాత్రమే ప్రభుత్వ వైఖరిని తెలియజేసే విధంగా ఉందని, అందులో స్పష్టమైన వైఖరిని తెలియపర్చడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని సోమవారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. సీఏఏను రాష్ట్రంలో అమలు చేస్తారా? లేదా? అనే విషయంలో స్పష్టత లేదని, ఎన్‌పీఆర్, ఎన్నార్సీ ప్రక్రియలను నిలిపివేస్తారా? లేదా అన్న దాన్ని కూడా తేల్చలేదని విమర్శించారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్‌పీఆర్‌లను రాష్ట్రంలో అమలు చేయబోమని సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని షబ్బీర్ అలీ డిమాండ్‌చేశారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే నిలదీస్తాం

కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అదే మంచి పనులు చేస్తే అభినందిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ అని అన్నారు. అన్ని ఇచ్చిన కాంగ్రెస్‌ను సభలో కోవిడ్ కాంగ్రెస్ అని అనడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో పూర్తిచేసిన ప్లాంట్లతో 24 గంటల కరెంట్ ఇస్తుందని, టీఆర్ఎస్ ప్రభుత్వం మొదలుపెట్టిన పవర్ ప్రాజెక్టు ఒక్కటి కూడా పూర్తికాలేదని ఆరోపించారు. కేసీఆర్ పొద్దునో మాట సాయంత్రం ఒక మాట మాట్లాడుతూ పేదల బలహీనతలను ఆసరాగా చేసుకుంటున్నారన్నారు. నాకు సీఎం, మంత్రులతో ఎలాంటి వైరం లేదని, సభలో నేను లేనప్పుడు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నన్ను జోకర్ అన్నారని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఇసుక దొరక్క ప్రజలకు ఇబ్బంది: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ఇసుక అందుబాటులో లేక సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తాము సభలో అడిగిన అనేక ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానం లేదన్నారు. కోవిడ్ వైరస్ పేరుతో బడ్జెట్ సమావేశాలను ఎందుకు కుదించారో అర్థం కావడం లేదన్నారు.

ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు వినాలి: సీతక్క

సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్షాల గొంతు వినే సహృదయం సర్కార్‌కు ఉండాలని, ముఖ్యమంత్రి పాలన ఆదర్శంగా నిలవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ కోవిడ్ వైరస్‌పై మాట్లాడితే గాలి మాటలని కొట్టిపారేసిన సీఎం.. నేడు ఎందుకు బంద్ ప్రకటించారని, అసెంబ్లీ ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం గొప్పలు, బల్లలు గుద్దుకోవడానికి మా త్రమే సభను పెట్టారని ఆరోపించారు. హుస్సేన్‌సాగర్ పూడిక, అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అలాగే ఇప్పటి వరకు ఎన్ని చెరువులు కాపాడారో చెప్పాలన్నారు.

రాజ్యసభకు కేకే, సురేశ్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే

సాక్షి, హైదరాబాద్: రాజ్యసభ సభ్యులుగా టీఆర్ఎస్ అభ్యర్థులు కె.కేశవ రావు, కేఆర్ సురేశ్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనమే. రాష్ట్రంలోని రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, మొత్తం నలుగురు వ్యక్తులు నామినేషన్ వేశారు. నామినేషన్ల పరిశీలన సోమవారం ముగియగా, ఇద్దరు వ్యక్తుల నామినేషన్లను తిరస్కరించారు. దీంతో రెండు స్థానాలకు పోటీలో కె.కేశవరావు, సురేశ్‌రెడ్డిలు మాత్రమే మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 18తో ముగియనుంది. ఆ తర్వాత వీరిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించనున్నారు.

పురపాలికల్లో బయో మైనింగ్!

చెత్త నుంచి పేపర్, ప్లాస్టిక్, రబ్బర్, మెటల్ పదార్థాల సేకరణ

139 పురపాలికల్లో 82,33,505 మెట్రిక్ టన్నుల మేర నిల్వలు

డంపింగ్ యార్డులను దున్ని వెలికితీసి వ్యర్థాల రీసైక్లింగ్..

ఏప్రిల్ 1 నుంచి శ్రీకారం.. ఎన్జీటీ ఉత్తర్వుల అమలుకు చర్యలు

లేదంటే ప్రతి నెలా పురపాలికలకు జరిమానాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని పురపాలికల్లో బయో మైనింగ్‌కు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందులో భాగంగా డంపింగ్ యార్డుల్లో దశాబ్దాలుగా పారబోసిన చెత్త నుంచి పనికి వచ్చే వస్తువులను వెలికితీయడంతో పాటు ఆ స్థలాలను ఇతర అవసరాలకు వినియోగించుకునే విధంగా పూర్వస్థితికి తీసుకురానున్నారు. జీహెచ్ఎంసీ మినహాయిస్తే రాష్ట్రంలోని ఇతర 139 పురపాలికల్లోని డంపింగ్ యార్డుల్లో సుమారు 82,33,505.39 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకుపోయాయని పురపాలక శాఖ అంచనా వేసింది. దీనికి తోడు రోజుకు 3,948.55 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ చెత్తతో డంపింగ్ యార్డులు నిండిపోయి శివారు గ్రామాలు, కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు, అనారోగ్యాలకు గురవుతున్నారు. తక్షణమే ఈ డంపింగ్ యార్డుల్లో బయోమైనింగ్ ప్రక్రియను చేపట్టి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది. డంపింగ్‌యార్డుల చెత్త నుంచి ఇనుము, ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగులు, దుస్తులు, ర్యాగ్స్, గ్లాస్, రబ్బర్, చెక్క వస్తువులు, థర్మకోల్ తదితర వస్తువులను సేకరించనున్నారు.

అమలు చేయకుంటే జరిమానాలు

ఏప్రిల్ 1 నాటికి దేశంలోని అన్ని పురపాలికల్లో బయో మైనింగ్ ప్రక్రియను ప్రారంభించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశించింది. లేని పక్షంలో లక్షకు మించిన జనాభా కలిగి ఉంటే రూ.10 లక్షలు, 5 లక్షల నుంచి 10 లక్షల జనాభా కలిగి ఉంటే రూ.5 లక్షలు, 5 లక్షల లోపు జనాభా కలిగి ఉంటే రూ. లక్ష చొప్పున ప్రతి నెలా జాతీయ కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి పురపాలికలు జరిమానా చెల్లించాలని తీర్పు నిచ్చింది. పురపాలికల ముఖ్య అధికారుల వార్షిక సర్వీస్ నివేదికల్లో వారి పనితీరును తప్పుబడుతూ రిమార్క్ ఎంట్రీ చేయాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ నెల 31లోగా రాష్ట్రంలోని అన్ని పురపాలికల్లో బయో మైనింగ్‌కు శ్రీకారం చుట్టాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించింది.

మహిళా సమాఖ్యలకు పనులు..

బయో మైనింగ్ నిర్వహణకు టెండర్లు నిర్వహించి ప్రైవేటు సంస్థలకు కాంట్రాక్టు అప్పగించే వరకు మరో రెండు నెలల సమయం పట్టే అవకాశాలున్నాయి. మరోవైపు ఎన్జీటీ విధించిన గడువు ముంచుకొస్తుండటంతో పట్టణ/మురికి వాడల మహిళా సమాఖ్యల సహకారంతో పురపాలికలు స్వయంగా బయో మైనింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని పురపాలక శాఖ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ తాజాగా ఆదేశించారు. టెండర్లు నిర్వహించి ప్రైవేటు కంపెనీలకు పనులు అప్పగించిన తర్వాత ఆధునిక యంత్రాలను వినియోగించి చెత్తను వేరు చేయనున్నారు. ఇటు డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్త నుంచి వివిధ రకాల వ్యర్థాలను వెలికి తీస్తూనే మరోవైపు ఏ రోజు కారోజు తరలివచ్చే చెత్తను సైతం ఈ కంపెనీలు మైనింగ్ చేయనున్నాయి. దీంతో కొన్ని రోజుల్లోనే డంపింగ్ యార్డులు పూర్వస్థితికి చేరుకోనున్నాయి. రీసైక్లింగ్‌కు పనికి రాని వ్యర్థాలను విద్యుదుత్పత్తి కోసం వినియోగించనున్నారు.

మహిళా సమాఖ్యలు చేయాల్సింది..

- విష వాయువులు బయటకి వెళ్లిపోయేలా జేసీబీ, ట్రాక్టర్ డోజర్ల సహాయంతో డంపింగ్ యార్డును దున్ని కందకాలు ఏర్పాటు చేయాలి.
- ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు, దుస్తులు, గ్లాస్, రబ్బర్, చెక్క వస్తువులు, థర్మాకోల్ తదితర వస్తువులను సేకరించాలి. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈ-వేస్ట్) అంతటిని ప్రత్యేకంగా నిల్వ చేయాలి.

- సేకరించిన వస్తువులను 4 విభాగాలుగా నిల్వ చేయనున్నారు. సాధ్యమైన వస్తువులను రీసైక్లింగ్ చేయనున్నారు.

4 విభాగాలుగా...

- ఆర్‌డీఎఫ్ (పేపర్, ప్లాస్టిక్, క్యారీ బ్యాగ్స్, రబ్బర్, ర్యాగ్స్, దుస్తులు)
- రిసైకిలబుల్స్ (గ్లాస్, ఇనుము, అల్యూమినియం, హార్డ్ ప్లాస్టిక్ వస్తువులు, పీవీసీ)
- ప్రమాదకర వ్యర్థాలు (ట్యూబ్‌లైట్స్, విరిగిన గాజులు, సానిటరీ నాప్కిన్స్, ఈ-వేస్ట్ తదితరాలు)
- కాంక్రీట్, నిర్మాణ వ్యర్థాలు వంటి తొందరగా పాడు కాని వస్తువులు..

పురపాలికలు తక్షణమే చేపట్టాల్సిన పనులు..

- వ్యర్థాల పరిమాణాన్ని నిర్ధారించాలి. బరువు ఎన్ని టన్నులో అంచనా వేయాలి. డంపింగ్ యార్డు విస్తీర్ణం ఆధారంగా బరువును శాస్త్రీయ పద్ధతిలో లెక్కించాలి.
- బయోమైనింగ్ నిర్వహణకు ఏఈ/డీఈఈని నోడల్ అధికారిగా నియమించాలి.
- స్వయం సహాయక సంఘా (ఎస్‌హెచ్‌జీ)ల కలయికతో ఏర్పడిన స్లమ్ లెవల్ ఫెడరేషన్స్ (ఎస్ఎల్ఎఫ్), టౌన్ లెవల్ ఫెడరేషన్స్(టీఎల్ఎఫ్) ను ఎంపిక చేసి బయో మైనింగ్ పనులను అప్పగించాలి. కార్మికులను నియమించుకోవచ్చు.
- ఎస్ఎల్ఎఫ్/టీఎల్ఎఫ్‌లకు చెల్లింపుల కోసం ఆర్థిక పరిస్థితి బాగా లేని పురపాలికలకు పురపాలక శాఖ నిధులు కేటాయించనుంది.
- ఈ పనులకు 14వ ఆర్థిక సంఘం నిధులను పురపాలికలు వినియోగించుకోవచ్చు.
- మాస్కులు, గ్లౌజులు, ఆప్రాన్స్, గమ్ బూట్స్, క్యాప్స్ తదితర రక్షణ పరికరాలను కార్మికులకు సరఫరా చేయాలి.
- పురపాలికలు రోజు వారీ పురోగతిపై సమాచారమివ్వాలి. బయో మైనింగ్‌కి ముందు తర్వాత ఉన్న పరిస్థితికి సంబంధించిన ఫొటోలను పురపాలక శాఖ డైరెక్టరేట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

ప్రీప్రైమరీ స్కూళ్లలో చిన్నారుల సామర్థ్యం మదింపు!

- కొత్త సంస్కరణలు తెస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ
- ఐసీడీఎస్‌ల పరిధిలో నడుస్తున్న వాటిల్లో అమలుకు నిర్ణయం
- వచ్చే నెలలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు..
- మానసిక ఎదుగుదల ఉండేలా పాఠ్యాంశాల రూపకల్పన

సాక్షి, హైదరాబాద్: పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో మరిన్ని సంస్కరణలు తేవాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ భావిస్తోంది. ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి పథకం) కింద నడుస్తున్న ప్రీప్రైమరీ స్కూళ్లలో చిన్నారుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు సరికొత్త కార్యాచరణ రూపొందిస్తోంది. చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి పెంచడం, కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఉత్సాహాన్ని రెట్టింపు చేసేలా ఈ సంస్కరణలు తీసుకొస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 కేంద్రాలు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ఈ కేంద్రాలన్నింట్లో ప్రీస్కూల్ తరగతులు నిర్వహిస్తుండగా.. ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉన్న దాదాపు 2,450 కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రీస్కూళ్లుగా కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రీస్కూళ్లకు వచ్చేవారిలో 3 ఏళ్ల నుంచి 4 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రీస్కూల్ తరగతుల్లో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఎల్‌కేజీ పిల్లలకు తంగేడు పువ్వు పేరిట నాలుగు పుస్తకాలు, యూకేజీ పిల్లలకు పాలపిట్ట పేరిట ఐదు పుస్తకాలను ఇస్తున్నారు.

సామర్థ్యాల మదింపు..

ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు నిర్దేశించిన పాఠ్యాంశాన్ని ఏమేరకు అర్థం చేసుకున్నారనే దాన్ని తేల్చేందుకు వారి సామర్థ్యాల మదింపునకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. బడికి రావాలనే ఆసక్తిని వారిలో పెంచడంతో పాటు కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఉత్సాహాన్ని పెంచేలా వారిని ప్రోత్సహిస్తూనే చిన్నారుల సామర్థ్యాన్ని గుర్తిస్తారు. ఈమేరకు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఇందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా పుస్తకాలను సైతం రూపొందిస్తోంది. ఇందులో చిన్నారుల సామర్థ్యాలను గుర్తించే మెళకువలు, చిన్నారుల మానసిక స్థితి అభివృద్ధి చేసే కార్యక్రమాలపై సలహాలు, సూచనలుంటాయి. వచ్చే నెలలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆ శాఖ భావిస్తోంది. అయితే కరోనా నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా శిక్షణ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నాకే తదుపరి చర్యలు చేపట్టే అవకాశముంది.

విద్యుత్ సౌధలో టెన్షన్..టెన్షన్..!

సాక్షి, హైదరాబాద్ : విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులు విభజన అంశం మళ్లీ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఏపీ సంస్థల్లో పని చేస్తున్న స్థానిక ఉద్యోగులను అక్కడి యాజమాన్యాలు ని బంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేసి, తెలంగాణ విద్యుత్ సంస్థలకు పంపడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.ఆయా ఉద్యోగులు సోమవారం రిలీవ్ ఆర్డర్లు తీసుకుని తెలంగాణ విద్యుత్ సంస్థల కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు వారిని లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో విద్యుత్‌సౌధ సహా మింట్‌కాంపౌండ్‌లోని డిస్కం ప్రధాన కార్యాలయాల వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ మేరకు తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు ఎన్.శివాజీ, పి.అంజయ్య, రామేశ్వర్ శెట్టి, షరీఫ్, వినోద్, గణేష్, రవికుమార్, వీరస్వామి, పరమేశ్, తిరుపతయ్య, అనిల్ సహా పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రత్నాకర్‌రావు, సదానందం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు సోమవారం ఆయా కార్యాలయాల ముందు భైఠాయించారు. ఏపీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆయా కార్యాలయాల ప్రధాన గేట్ల ముందు పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఏపీ ఉద్యోగులు లోనికి వెళ్తే..తెలంగాణ ఉద్యోగులు దాడి చేసే ప్రమాదం ఉందని భావించి అక్కడికి చేరుకున్న ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి లోనికి అనుమతించారు. కనీసం ఉద్యోగుల అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా వారినెలా రిలీవ్ చేస్తారని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు ప్రశ్నించారు. జస్టిస్ ధర్మాధికారి ఏపీ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి, తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం జరిగే విధంగా కేటాయింపులు చేశారని మండిపడ్డారు.

టీచర్లు స్కూళ్లకు వెళ్లాల్సిందే

- సెలవులు విద్యార్థులకే.. టీచర్లకు కాదు
- పెండింగ్ వర్క్ పూర్తి చేసుకోండి
- విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్

సాక్షి, హైదరాబాద్: పాఠశాలలు, కాలేజీలకు సెలవులు ప్రకటించినా టీచర్లు మాత్రం పాఠశాలలకు వెళ్లాలని, పరీక్షల విధులను నిర్వర్తించాలని, పెండింగ్ పనులను పూర్తి చేసుకోవాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా డీఈవోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం ఇంటర్మీడియెట్, పాఠశాల విద్యాశాఖ జిల్లాల అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్ స్పాట్ వ్యాల్యుయేషన్ విధులు, టెన్త్ పరీక్ష విధులు పడిన వారు కచ్చితంగా వాటిని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కోవిడ్ వైరస్ ప్రభావం నేపథ్యంలో ఇచ్చిన సెలవులు విద్యార్థులకు మాత్రమేనని, టీచర్లకు కాదని పేర్కొన్నారు. పరీక్ష విధులు కాకుండా మిగతా ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లాలని, ఇతర పెండింగ్ పనులను చేసుకోవాలని సూచించారు. యూడైస్, వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేసుకోవడం, ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలన వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. మార్కుల రిజిస్టర్లను పూర్తి చేయాలని తెలిపారు. ఇతర అన్ని రికార్డులను రాసుకోవాలని పేర్కొన్నారు. వీటితోపాటు స్థానికంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రైవేటు స్కూల్ టీచర్లు రొటేషన్ బేసిస్‌లో స్కూల్‌కు వెళ్లి పనులు చేసుకోవచ్చని సూచించారు.

బంద్ చేయని స్కూళ్లకు నోటీసులు..

ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మూసివేయకుండా, తరగతులను నిర్వహించిన పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ తెలిపారు. తాము గుర్తించిన విద్యా సంస్థలపై చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఇవేకాకుండా ఇంజనీరింగ్ కాలేజీలు తరగతులను నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ దృష్టికి వచ్చింది. వాటిపైనా చర్యలు చేపట్టేందుకు సిద్ధం అవుతోంది. అందులో మంత్రి మల్లారెడ్డి బంధువు విద్యా సంస్థ కూడా ఉన్నట్లు సమాచారం.

మాస్క్‌లతో టెన్త్ విద్యార్థులకు అనుమతి..

ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను కరోనా నేపథ్యంలో మాస్క్‌లతో అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు మాస్క్‌లు ధరించి పరీక్షలకు హాజరు కావచ్చని వెల్లడించింది. ఇప్పటికే విద్యార్థుల హాల్‌టికెట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. మరోవైపు పాఠశాలలు హాల్‌టికెట్ల పంపిణీని సోమవారం నుంచి ప్రారంభించాయి.

రక్తమోడిన రోడ్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఎదురుగా మెదక్ నుంచి పటాన్‌చెరుకు వెళ్తున్న సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్35 టీ 7452) అతివేగంగా డీసీఎంను ఢీకొట్టింది. ఆ ధాటికి ఐదుగురు మహిళలు గుర్తుపట్టని విధంగా గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, 11 మంది గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో తొమ్మిదేళ్ల చిన్నారి మృత్యువాత పడింది. మృతుల్లో సంగారెడ్డి జిల్లా అంగడిపేట గ్రామానికి చెందిన చాపల మాధవి(40), కంది మండలం చేర్యాల గ్రామానికి చెందిన మన్నె మంజుల(40), గంజిగూడెంకు చెందిన నీరుడి దుర్గమ్మ(58), గూడల మాణెమ్మ(55), పసల్‌వాదికి చెందిన గొడుగు రజిత(45), సదాశివపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన దిగ్వాల్ మధురిమ (9) ఉన్నారు. బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

కంటతడి పెట్టిన కలెక్టర్

సంగాయిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న మెదక్ కలెక్టర్ ధర్మారెడ్డి మెదక్ ఏరియా ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను, మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి మధురిమ తల్లి మంజుల కలెక్టర్ కాళ్లపై పడి రోదించారు. 'నాకు ఒక్కతే బిడ్డ! ఆమె నాకు లేకుండా పోయింది.. ఇక నేను ఎవరి కోసం బతకాలి'అంటూ విలపించడంతో కలెక్టర్ కూడా కంటతడిపెట్టారు.

అత్తగారింటికి వెళ్తూ అనంతలోకాలకు...

సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం సిర్గాపూర్ గ్రామానికి చెందిన నర్సయ్య(27) హైదరాబాద్‌లోని సుచిత్ర వద్ద నివసిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి బాన్సువాడలో ఉంటున్న తన అత్తగారింటికి బైక్‌పై వెళ్తుండగా మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

కేటీఆర్ దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాద ఘటనలపై మంత్రి కేటీఆర్ ది గ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

వీడ్కోలు పలికి వస్తూ మృత్యుఒడికి...

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి గ్రామానికి చెందిన పిట్ల రవి దుబాయ్‌కి వెళ్తుండటంతో తోడల్లుడు కృష్ణ, వదిన కావ్య, తాత కిష్టయ్య, బావమరిది అజయ్ మారుతీ ఓమ్నీ వ్యానులో శంషాబాద్‌కు వెళ్లి వీడ్కోలు పలికారు. తిరుగు ప్రయాణంలో మెదక్ జిల్లా నార్సింగి శివారు వద్ద ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మాచారెడ్డికి చెందిన కిష్టయ్య(60), డ్రైవర్ ఆం జనేయులు (25), రాజన్న సిరిసిల్లా జిల్లా గంభీ రావుపేట మండలం దమ్మన్నపేటకుకు చెందిన కృష్ణ(28) అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణ భార్య కావ్య, ఆమె తమ్ముడు అజయ్‌కు గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం రామాయంపేటలోని ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఓమ్నీ వ్యాన్

రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా ఆయనకు సోమవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కూడా శుభాకాంక్షలు చెప్పారు

'చలో ఢిల్లీ'కి కదిలిన బీసీలు

హైదరాబాద్: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనగణనలో కులాల జనాభా చేపట్టాలన్న డిమాండ్‌లతో పార్లమెంట్ వద్ద తలపెట్టిన భారీ ధర్నాకు సోమవారం కాచిగూడ, అంబర్‌పేట నుంచి వందలాది మంది కార్యకర్తలు ఢిల్లీ బయలుదేరారు. ఢిల్లీకి వెళ్

'కోవిడ్' దిగ్బంధనం

యూకే, ఈయూ, టర్కీ ప్రయాణికులపై నిషేధం ● వైరస్ కట్టడికి కేంద్రం చర్యలు ● సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్

జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్ట్‌లో రన్‌వేపై నిలిచిపోయిన విమానాలు

న్యూఢిల్లీ: కోవిడ్-19 (కరోనా వైరస్) విజృంభిస్తుండటంతో వైరస్ కట్టడికి కేంద్ర ప్రభుత్వం మరికొన్ని చర్యలు తీసుకుంది. యూరోపియన్ యూనియన్, బ్రిటన్, టర్కీ నుంచి వచ్చే ప్రయాణికులు భారత్‌లో ప్రవేశించడంపై మార్చి 31 వరకూ నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కోవిడ్ కేసుల సంఖ్య పెరిగిపోతున్న కారణంగా ఈ ముందు జాగ్రత్త చర్య తీసుకున్నట్లు సోమవారం ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. మార్చి 18న అర్ధరాత్రి నుంచి ఈ నిషేధం అమల్లోకి రానుందని సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. సోమవారం నుంచి దేశ అంతర్జాతీయ సరిహద్దుల ద్వారా అన్ని రకాల ప్రయాణికుల రాకపోకలను నిషేధించారు. దేశం మొత్తమ్మీద వైరస్ నియంత్రణ చర్యల పుణ్యమా అని అధికశాతం విద్యార్థులకు ఇళ్లకు పరిమితమైపోగా, ఉద్యోగులు ఇళ్ల నుంచే పనిచేసే పరిస్థితి ఏర్పడింది. జిమ్‌లు, సినిమా హాళ్లు, స్విమ్మింగ్ పూల్స్ వంటివి దాదాపు అన్ని రాష్ట్రాల్లో మూసేశారు.

కొత్త టోల్‌ఫ్రీ నంబర్

వైరస్‌కు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం కేంద్రం సోమవారం నుంచి కొత్త టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకూ ఉన్న 011- 23978046తోపాటు 1075 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా కోవిడ్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చునని ఆరోగ్య శాఖ అధికారులు ప్రకటించారు. ncov2019 @gmail.comకు ఈ మెయిల్ చేయడం ద్వారా సమాచారం తెలుసుకోవచ్చు.

నవోదయకు ముందుగానే సెలవులు

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దేశంలోని 600 జవహర్ నవోదయ విద్యాలయాలకు ముందుగానే సెలవులు ప్రకటించనున్నారు. పరీక్షలు అయిపోతున్న నేపథ్యంలో వేసవి సెలవులను ముందుగానే ప్రకటిస్తున్నామని మార్చి 21 నుంచి మే 25 వరకూ సెలవులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

ఒడిశాలో తొలి కేసు

భారతదేశంలో కరోనా కోరలు చాస్తూనే ఉంది. ఒడిశాలో సోమవారం తొలి కరోనా కేసు నమోదైంది. ఇటలీ నుంచి మార్చి 6న ఢిల్లీకి వచ్చి ఆ తరువాత రైలు మార్గం ద్వారా మార్చి 12న భువనేశ్వర్‌కు వచ్చిన 33 ఏళ్ల వ్యక్తికి కరోనా సోకినట్లు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతానికి అతడి పరిస్థితి నిలకడగానే ఉంది. లదాఖ్, కశ్మీర్, కేరళల్లో నమోదైన ఒక్కో కేసును పరిగణనలోకి తీసుకుంటే దేశం మొత్తమ్మీద సోమవారానికి ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 114కు చేరుకున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. వ్యాధి కారణంగా మరణించిన ఇద్దరితోపాటు 17 మంది విదేశీయులు, చికిత్స పొంది ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయిన వారు ఈ 114 మందిలో ఉన్నారు. ముంబైలో నలుగురు వ్యక్తులు కరోనా వైరస్ బారిన పడటంతో మహారాష్ట్రలో ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 37కు చేరుకుంది.

దేవాలయాలకు తాళాలు

కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా మహారాష్ట్రలోని ప్రముఖ దేవాలయాలు, ముంబైలోని సిద్ధి వినాయక ఆలయం, ఒస్మానాబాద్‌లోని తుల్జా భవానీ ఆలయాలను మూసివేయనున్నట్లు దేవాలయ అధికారులు తెలిపారు. సిద్ధి వినాయక ఆలయం తదుపరి ఉత్తర్వుల వరకూ మూతపడగా.. తుల్జాభవానీ ఆలయం మంగళవారం నుంచి ఈ నెలాఖరు వరకూ మూతపడనుంది. సామూహిక సమావేశాలను నివారించాలన్న ప్రభుత్వం పిలుపు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు సిద్ధివినాయక ఆలయం ట్రస్టు చైర్మన్ అదేశ్ భండేకర్ తెలిపారు.

శక్తివంచన లేకుండా కృషి: మోదీ

వైరస్ నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం శక్తి వంచన లేకుండా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. వ్యాప్తి నిరోధాల విషయంలో వైద్యులు, నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు.

పరిష్కారాలు సూచించండి

వైరస్ నియంత్రణకు mygov. in వెబ్‌సైట్‌లో టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలు సూచించాల్సిందిగా దేశ ప్రధాని మోదీ కోరారు. వ్యాధిని ఎక్కడికక్కడ నియంత్రించేందుకు పౌరులకు తగిన సమాచారం అందడం చాలా ముఖ్యం. కొంతమంది వ్యక్తులు, కంపెనీలు బయో ఇన్ఫర్మాటిక్స్, డేటాసెట్స్, వ్యాధి నిర్ధారణకు అప్లికేషన్ వంటివి అభివృద్ధి చేశారు. ఈ టెక్నాలజీలన్నింటినీ వినియోగించుకోవడం ద్వారా వైరస్‌ను కట్టడి చేయవచ్చునని పేర్కొన్నారు.

వ్యాక్సిన్ పరీక్షలు షురూ

వాషింగ్టన్: ప్రాణాంతక కోవిడ్‌కు విరుగుడుగా అభివృద్ధి చేసిన ఓ టీకాను అమెరికా పరీక్షిస్తోంది. అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ఆర్థిక సాయంతో ఒక మహిళా వాలంటీర్‌కు ప్రయోగాత్మక టీకా వేశారు. అన్నీ సవ్యంగా సాగి ఈ పరీక్షలు విజయవంతమైతే అందరికీ అందుబాటులోకి వచ్చేందుకు మరో ఏడాదిన్నర సమయం పట్టే అవకాశముందని అధికారులు చెప్పారు. సియాటెల్‌లోని కైసర్ పెర్మనెంటే వాషింగ్టన్ హెల్త్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆరోగ్యంగా ఉన్న 45 మంది స్వచ్ఛంద కార్యకర్తలకు ఎన్ఐహెచ్, మోడెర్నా అనే కంపెనీలు సంయుక్తంగా అభివృద్ధి చేసిన టీకాలు ఇస్తాయి. తీవ్రమైన దుష్ప్రభావాలేవీ లేనట్టు నిర్ధారించుకునేందుకు మాత్రమే ఈ ప్రయోగం చేస్తున్నామని, ఇందులో వైరస్ ఏదీ లేని కారణంగా టీకా తీసుకున్న వ్యక్తికి కోవిడ్ సోకే అవకాశమూ లేదని వివరించారు.

సియాటెల్‌లో టీకా వేస్తున్న దృశ్యం

అమెరికా, జర్మనీ మాటల యుద్ధం

క్యూర్‌వ్యాక్ అనే కంపెనీ తయారు చేస్తున్న కరోనా నిరోధక టీకా ఒకటి అమెరికా, జర్మనీల మధ్య మాటల యుద్ధానికి కారణమవుతోంది. జర్మనీకి చెందిన ఈ కంపెనీ అభివృద్ధి చేస్తున్న టీకాపై తాము హక్కులు కొనుక్కుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంపై జర్మన్లు విరుచుకుపడుతున్నారు. జర్మనీ అమ్మకానికి లేదని ఆ దేశ ఆర్థిక శాఖ మంత్రి పీటర్ ఆగ్రహంవ్యక్తంచేశారు. డైవెల్ట్ అనే పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం.. క్యూర్‌వ్యాక్ అభివృద్ధి చేస్తున్న టీకాపై హక్కుల కోసం అమెరికా 100కోట్ల డాలర్లు ఇవ్వచూపింది. ఆ టీకా అమెరికాలో వాడాలన్నది షరతు. మరోవైపు, క్యూర్‌వ్యాక్‌లో పెట్టుబడులు పెట్టిన వారు మాట్లాడుతూ ఏ ఒక్క ప్రభుత్వానికో తాము టీకా అమ్మబోమని స్పష్టం చేశారు. సమర్థమైన టీకా అందుబాటులోకి వస్తే అది ప్రపంచ ప్రజలందరినీ రక్షించాలని కోరుకుంటున్నట్లు డైట్ హాప్ అనే పెట్టుబడిదారు వ్యాఖ్యానించారు.

అహ్మదాబాద్‌లో ఖాళీగా ఉన్న షాపింగ్‌మాల్

మరణాలు @7007

బీజింగ్/టెహ్రాన్/జెనీవా: చైనాలో నమోదైన కోవిడ్ మరణాల కంటే ప్రపంచంలోని ఇతర దేశాల్లో నమోదైన మరణాల సంఖ్యే ఎక్కువని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సోమవారం తెలిపింది. ఏఎఫ్‌పీ వార్తాసంస్థ లెక్కల ప్రకారం 142 దేశాల్లో 1,75,536 కేసులు నమోదుకాగా, మరణాల సంఖ్య 7007 దాటింది. చైనాలో 3,213 మంది మరణించగా, ఇటలీలో 2,158, ఇరాన్‌లో 853, స్పెయిన్‌లో 297 మంది మరణించారు. వైరస్ అని అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరినీ పరీక్షించాలని డబ్ల్యూహెచ్‌ఓ ప్రపంచ దేశాలకు సూచించింది. వైరస్ వ్యాప్తిని నిరోధించే చర్యలను భారత్ సహా ప్రపంచ దేశాలు ముమ్మరం చేశాయి. ఫ్రాన్స్‌లో తొలివారం 12గా ఉన్న నిర్ధారిత కేసుల సంఖ్య నాలుగువారాలు గడిచేనాటికి 4500కి పెరిగింది. ఇరాన్‌లో ఈ సంఖ్య 12,700కి చేరింది. ఇటలీలో 24వేల మందికి వైరస్ సోకింది. ఇటలీలో మృతుల సంఖ్య రెండు వేలు దాటింది. స్పెయిన్ లోనూ నాలుగు వారాల వ్యవధిలో కోవిడ్ కేసుల సంఖ్య 8 నుంచి 6 వేలకు పెరిగింది. మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లో కరోనా పాజిటివ్‌గా తేలిన కేసుల సంఖ్య తక్కువే. చాలా దేశాలు పాఠశాలలకు, కాలేజీలకు సెలవులు ప్రకటించాయి. సినీ థీయేటర్లు, పబ్‌లు, బార్లు, షాపింగ్ మాల్స్‌ను మూతపడ్డాయి. సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేయసాగాయి. స్పెయిన్, చాలా దేశాలు దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించాయి. ప్రజలను ఇళ్లల్లోనే ఉండాలని ఆదేశించాయి. అమెరికాలోనూ కరోనా కేసుల సంఖ్య 3 వేలు దాటింది. 50, అంతకన్నా ఎక్కువ మంది పాల్గొనే కార్యక్రమాలను వచ్చే 8 వారాల పాటు వాయిదా వేసుకోవాలని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ సంస్థ సూచించింది.

చైనాలో అదుపులోకి..

కరోనా తమ దేశంలో అదుపులోకి వచ్చినట్లే అని చైనా వైద్య నిపుణులు ప్రకటించారు. అయితే తుది నిర్ణయం నెల తర్వాత తీసుకుంటామని పెకింగ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కావ్ లీ తెలిపారు. వూహాన్ ప్రాంతంలో పలువురు ఇతర వైద్యులతో పర్యటించిన కావ్ లీ విలేకరులతో మాట్లాడారు. వాతావరణానికి, కరోనా వైరస్‌కు సంబంధం ఉన్నట్లు ఇప్పటివరకూ ఎలాంటి రుజువు లభించలేదని డాక్టర్ కావ్ లీ స్పష్టం చేశారు.

నెదర్లాండ్స్‌లోని అల్స్మీర్‌లో వేలంకేంద్రంలో ఎవరూ కొనకపోవడంతో పారబోసేందుకు సిద్ధంచేసిన ఖరీదైన పూలు

రాజ్యసభకు మాజీ సీజేఐ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ను కేంద్రం రాజ్యసభకు నామినేట్ చేసింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సోమవారం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కేటీఎస్ తులసి రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన స్థానంలో జస్టిస్ గొగోయ్‌ని కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. గత సంవత్సరం నవంబర్ 9న సున్నితమైన అయోధ్య కేసులో తీర్పు ప్రకటించిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి జస్టిస్ గొగోయ్ నేతృత్వం వహించిన విషయం తెలిసిందే. అదే నెలలో ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవి విరమణ చేశారు. రఫేల్ ఫైటర్ జెట్స్ కేసును, శబరిమలలోకి మహిళల ప్రవేశానికి సంబంధించిన కేసును కూడా ఆయన విచారించారు. అయోధ్య కేసులో 2.77 ఎకరాల వివాదాస్పద స్థలం మొత్తాన్ని రామాలయ నిర్మాణం కోసం వినియోగించాలని ఆయన తీర్పునిచ్చారు. మసీదు నిర్మాణం కోసం అయోధ్యలోని మరో ప్రముఖ ప్రాంతంలో ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని ఆదేశించారు. సీజేఐగా పదవీకాలంలో లైంగిక వేధింపుల ఆరోపణ సహా పలు వివాదాలను ఆయన ఎదుర్కొన్నారు. రఫేల్ ఫైటర్ జెట్ డీల్‌లో మోదీ ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇచ్చిన ధర్మాసనానికి కూడా జస్టిస్ గొగోయే నేతృత్వం వహించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం సమాచార హక్కు చట్టం పరిధిలోకే వస్తుందని సంచలన తీర్పునిచ్చింది కూడా ఆయన నేతృత్వంలోని ధర్మాసనమే. ఎన్నార్సీ ప్రక్రియను సమీక్షించిన బెంచ్‌కు కూడా జస్టిస్ గొగోయ్ నేతృత్వం వహించారు. రాజ్యసభకు నామినేట్ అవుతున్న తొలి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆయనే కావడం విశేషం. మాజీ సీజేఐ రంగనాథ్ మిశ్రా కూడా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు కానీ, ఆయన నామినేటెడ్ సభ్యుడు కాదు. కాంగ్రెస్ తరఫున ఎగువ సభకు ఎన్నికయ్యారు.

పర్యాటకానికి మోదీ బ్రాండ్ అంబాసిడర్

న్యూఢిల్లీ: దేశ పర్యాటక రంగానికి ప్రధాని మోదీయే బ్రాండ్ అంబాసిడర్ అని పర్యాటక శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ లోక్‌సభలో వ్యాఖ్యానించారు. పర్యాటక రంగం కోసం మోదీ సాధ్యమైనంత మేర కృషి చేస్తున్నారని, ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గత ఐదేళ్లలో పర్యాటకుల సంఖ్య పరంగా అంతర్జాతీయంగా భారత్ ర్యాంకు 65 నుంచి 34కు చేరుకుందని అన్నారు. పర్యాటకుల కోసం జీఎస్టీ తగ్గింపు, వీసా పరిమితి పెంపు, వీసా ఫీజు తగ్గింపు వంటి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా మొత్తం పన్నుల్లో 11 శాతం, జీడీపీలో 10 శాతం పర్యాటక రంగమే సమకూరుస్తోందని తెలిపారు.

'చే'జారిన మరో ఎమ్మెల్యే

గాంధీనగర్: రాజ్యసభ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ కాంగ్రెస్ పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. మధ్యప్రదేశ్‌లో పార్టీ ఎమ్మెల్యేల తిరుగుబాటు వ్యవహారం ఒకవైపు కొనసాగుతుండగా, గుజరాత్ కాంగ్రెస్ అదే దారిలో నడుస్తోంది. ఇప్పటి వరకు రాజీనామా చేసిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆదివారం మరొకరు జతయ్యారు. ఈ ఐదుగురి రాజీనామాలను ఆమోదించినట్లు సోమవారం స్పీకర్ రాజేంద్ర త్రివేదీ ప్రకటించారు. ఈ పరిణామంతో గుజరాత్ నుంచి ఇద్దరిని రాజ్యసభకు పంపాలన్న కాంగ్రెస్ ఆశలకు గండికొట్టినట్లయింది. ఒక్క సీటు మాత్రమే కచ్చితంగా గెలుచుకునే అవకాశం ఆ పార్టీకి ఉంది. 182 మంది సభ్యులున్న అసెంబ్లీలో తాజా పరిణామంతో కాంగ్రెస్ బలం 68కి పడిపోయింది. అధికార బీజేపీకి సొంతంగా 103 మంది బలముంది. ఇతర పార్టీలు, స్వతంత్రులు కలిపి మరో నలుగురు ఎమ్మెల్యేలుండగా వారిలో ముగ్గురు బీజేపీ పక్షాన ఉన్నారు. కోర్టు వివాదాలతో అసెంబ్లీలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాగా, ఖాళీ అయ్యే నాలుగు రాజ్యసభ స్థానాల్లో మూడింటిని బీజేపీ గెలుచుకోవాలంటే 108 మంది సభ్యులు, రెండు సీట్లు గెలుచుకోవాలంటే కాంగ్రెస్‌కు 72 మంది కావాలి. కాంగ్రెస్ నుంచి మరికొందరు రాజీనామా చేసే అవకాశాలున్నాయని గుజరాత్ ఉపముఖ్యమంత్రి ప్రకటించడంతో కాంగ్రెస్ భయపడుతోంది.

అంతర్జాతీయ కోర్టుకు నిర్భయ దోషులు

న్యూఢిల్లీ: నిర్భయ కేసు మరో మలుపు తిరిగింది. ఉరిశిక్ష అమలుపై స్టే ఇవ్వాలంటూ నలుగురు దోషుల్లో ముగ్గురు అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) తలుపు తట్టారు. ఈ కేసు విచారణ తప్పుల తడకగా సాగిందని, తమను బలిపశువులుగా చేసి, అన్యాయంగా శిక్ష విధించారని ఆరోపించారు. 'మాకు పాలీగ్రాఫ్, లై డిటెక్టర్, బ్రెయిన్ మ్యాపింగ్ వంటి పరీక్షలు కూడా చేయాలని కోరినా దర్యాప్తు అధికారులు పట్టించుకోలేదు. బాధితురాలి సన్నిహితులు చెప్పిన తప్పుడు సాక్ష్యం ఆధారంగా శిక్ష ఖరారు చేసి, మమ్మల్ని బలిపశువులుగా మార్చారు. దీనిపై ఐసీజే జోక్యం చేసుకుని తక్షణమే విచారణ జరపాలి' అని వారు ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. నలుగురు దోషులకు న్యాయపరమైన వెసులుబాటు మార్గాలు ఇంకా మిగిలి ఉండగానే తీహార్ జైలు అధికారులు ఈ నెల 20వ తేదీన ఉరిశిక్ష అమలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని దోషుల తరఫున లాయర్ ఏపీ సింగ్ వ్యాఖ్యానించారు. అంతకుముందు.. న్యాయపరమైన తన హక్కులను తిరిగి పునరుద్ధరించాలంటూ దోషి ముకేశ్ సింగ్ పెట్టుకున్న పిటిషన్ సమర్థనీయం కాదంటూ సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో రివ్యూ పిటిషన్, క్యూరేటివ్ పిటిషన్లను కూడా తిరస్కరిస్తూ జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎంఆర్ షాల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీన దోషులు ముకేశ్ సింగ్(32), అక్షయ్ సింగ్(31), పవన్‌గుప్తా(25), వినయ్ శర్మ(26)కు ఉరిశిక్ష అమలు చేయాలంటూ ఈనెల 5వ తేదీన తాజాగా న్యాయస్థానం వారెంట్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తీహార్ జైలు అధికారులు తలారి పవన్ జల్లాడ్‌ను పంపాలని కోరుతూ ఉత్తరప్రదేశ్ అధికారులకు లేఖ రాశారు. ముకేశ్, పవన్, వినయ్‌లు ఆఖరిసారిగా తమ కుటుంబసభ్యులను ముఖాముఖి కలుసుకున్నారు.

సంస్కృత వర్సిటీల బిల్లుకు రాజ్యసభ ఓకే

న్యూఢిల్లీ: కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాల బిల్లు(సెంట్రల్ సాంస్కృట్ యూనివర్సిటీస్ బిల్-2019)కి సోమవారం రాజ్యసభ పలు సవరణలతో ఆమోదం తెలిపింది. డీమ్డ్ యూనివర్సిటీలైన రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్(న్యూఢిల్లీ), శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠ్(న్యూఢిల్లీ), రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠ్ (తిరుపతి)లను సెంట్రల్ వర్సిటీలుగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లు ఇది.

- లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో దేశంలో నెలకొన్న నిరుద్యోగితను సభ్యులు ప్రస్తావించారు. ఎంఎస్సీ గణితం చదివిన వ్యక్తి మద్రాస్ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వీపర్ ఉద్యోగంలో చేరిన విషయాన్ని డీఎంకే నేత ప్రస్తావించారు.
- వైరస్ విజృంభణ నేపథ్యంలో.. పార్లమెంటు కాంప్లెక్స్‌లో థర్మల్ స్క్రీనింగ్ సౌకర్యాన్ని కల్పించారు. సిబ్బందిని, జర్నలిస్టులను స్క్రీనింగ్ చేస్తున్నారు. పార్లమెంట్‌లోకి సందర్శకులకు అనుమతించడం ఇప్పటికే నిలిపేశారు.
- ఐదు నెలల క్రితం మోటారు వాహనాల సవరణ చట్టం ఆమోదం పొందిన తరువాత.. వాహన ప్రమాదాల్లో మృతి చెందినవారి సంఖ్య 10% తగ్గిందని రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం రాజ్యసభకు తెలిపారు.
- లోక్‌సభలో అదనపు ప్రశ్నలు అడిగేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బ్యాంకు రుణాలను అత్యధిక మొత్తంలో ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టిన వారి గురించి ప్రశ్నించానని, ఆ ప్రశ్నకు అనుబంధంగా మరో ప్రశ్న అడిగేందుకు స్పీకర్ అనుమతించలేదని పార్లమెంటు వెలుపల మీడియాకు తెలిపారు.

2 వేల నోట్ల ముద్రణ ఆగలేదు

ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: రూ.2 వేల నోట్ల ముద్రణ నిలిపివేతపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని కేంద్రం స్పష్టం చేసింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ సోమవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'రూ.2 వేల నోట్ల ముద్రణ ఆపే విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు'అని వివరించారు. 'రూ.2 వేల నోట్లకు చిల్లర కొరతతో వినియోగదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో, రూ.500, రూ.200 నోట్లుంచేందుకు ఏటీఎంలను సిద్ధం చేయాలని ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్ తమ అధికారులను ఆదేశించాయి'అని వివరించారు.

చారిత్రక కట్టడాల్లో చోరీలు

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా శ్రీ ఆనందవల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పరశురామేశ్వర స్వామి ఆలయంలో ఉన్న నంది విగ్రహం, కర్ణాటకలోని సదాశివస్వామి గుడిలో రాగి కలశం చోరీకి గురయ్యాయని సాంస్కృతిక శాఖ మంత్రి ప్రహ్లాద్ లోక్‌సభకు తెలిపారు. రక్షిత చారిత్రక కట్టడాల వద్ద 280 మౌలిక సౌకర్యాల కల్పన ప్రాజెక్టులకు అనుమతులిచ్చినట్లు చెప్పారు.

హెచ్ఐవీ మందులు కీలకం

హెచ్ఐవీ చికిత్సకు వాడే రెండు మందులను వాడటం రాజస్థాన్‌లో కోవిడ్ నియంత్రణలో కీలకపాత్ర పోషించాయని రాష్ట్ర ప్రభుత్వం అడిషనల్ చీఫ్ సెక్రటరీ రోహిత్ కుమార్ సింగ్ సోమవారం తెలిపారు. రాజస్థాన్‌లో వ్యాధి బారిన పడ్డ నలుగురిలో ముగ్గురికి నయమైంది. ఇటలీ దంపతులు మొదటగా వ్యాధి బారిన పడగా వారికి తాము మలేరియా, స్పైన్‌ఫ్లూ మందులు ఇచ్చామని, ఆ తరువాత భారత వైద్య పరిశోధనల సమాఖ్యతో సంప్రదింపులు జరిపి కరోనా చికిత్సకు హెచ్ఐవీ మందులు వాడామని వివరించారు. రెండు మందులు కలిపి ఇవ్వడం సత్ఫలితాలిచ్చిందని, వయసు ఎక్కువగా ఉన్నప్పటికీ ముగ్గురికీ నయంకావడం ఇందుకు నిదర్శనమని చెప్పారు.

తల్లి నుంచి బిడ్డకు సోకదు

బీజింగ్: కరోనా వైరస్ తల్లుల నుంచి బిడ్డలకు సోకదని చైనాలో జరిగిన అధ్యయనం ఒకటి స్పష్టం చేసింది. హౌర్హూంగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు నిర్వహించిన ఈ అధ్యయనం ఫ్రాంటియర్స్ ఆఫ్ పీడియాట్రిక్స్ తాజా సంచికలో ప్రచురితమైంది. వైరస్‌కు కేంద్ర బిందువైన హుబేలోని వూహాన్‌లో నలుగురు గర్భిణులపై ఈ అధ్యయనం జరిగింది. వీరందరూ కోవిడ్ బారిన పడినప్పుడే పిల్లలకు జన్మనిచ్చారు. నవజాత శిశువులను ఐసీయూలో ఉంచి సాధారణ ఆహారం అందించినప్పటికీ ఎవరిలోనూ జ్వరం, దగ్గు లాంటి వ్యాధి లక్షణాలు కనిపించలేదని తెలిపారు. పుట్టిన నలుగురిలో ముగ్గురిలో శ్వాసకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు లేవని స్పష్టం కాగా, నాలుగో బిడ్డపై పరీక్షలు చేసేందుకు తల్లి నిరాకరించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఒక పసిబిడ్డ మూడు రోజులపాటు కొద్దిపాటి శ్వాస సంబంధిత సమస్యలు ఎదుర్కొందని తెలిపారు.

వైరస్‌కు రెండు మందులు

మెల్బోర్న్: ప్రాణాంతక కరోనా వైరస్‌కు రెండు మందులను గుర్తించినట్లు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంకు చెందిన శాస్త్రవేత్తలు సోమవారం ప్రకటించారు. ఈ రెండు ఔషధాలలో ఒకటి హెచ్ఐవీ కోసం , రెండోది మలేరియా వ్యాధి కోసం ఇప్పటికే వాడుతున్నారని, పరిశోధనశాలలో ఇవి వైరస్‌ను సమర్థంగా అడ్డుకోగలిగాయని సెంటర్ ఫర్ క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డేవిడ్ పాటర్సన్ తెలిపారు. ఆస్ట్రేలియాలో కోవిడ్ బారిన పడ్డ వారిలో కొందరికి వీటిల్లో ఒక మందు ఇచ్చి సత్ఫలితాలు సాధించామని ఆయన చెప్పారు. ఈ మందును మరింత క్షుణ్ణంగా పరిశీలించేందుకు వీలుగా ఆస్ట్రేలియాలోని 50 ఆసుపత్రుల్లో ప్రయోగాలు నిర్వహించనున్నామని, ఈ మందును.. రెండు మందులను కలిపి ఇచ్చి ఫలితాలను బేరీజు వేస్తామని చెప్పారు. ఈ నెలాఖరుకల్లా పరీక్షలు మొదలవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత తొందరగా కోవిడ్ బాధితులకు ఈ మందులు అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ఢిల్లీలో అన్నింటిపై నిషేధం

నూఢిల్లీ: ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఒక అడుగు ముందుకేసి ఈ నెలాఖరు వరకూ ఢిల్లీలో ఎలాంటి సాంఘిక, సాంస్కృతిక, మత, రాజకీయ సమావేశాలన్నింటిపై నిషేధం విధించారు. ఈ నిషేధం ఆందోళనలకు వర్తిస్తుందని సోమవారం మీడియాతో చెప్పారు. వివాహాలకు మినహాయింపు ఉన్నప్పటికీ ప్రజలు వీలైనంత వరకూ పెళ్లి తేదీలను వాయిదా వేసుకోవాలని సీఎం అభ్యర్థించారు. ఢిల్లీలో కోవిడ్ బారిన పడ్డ ఏడుగురిలో నలుగురు కోలుకుంటున్నారని తెలిపారు.

కమల్‌ను కాపాడిన 'కరోనా'

కరోనా కారణంగా అసెంబ్లీని 26 వరకు వాయిదా వేసిన మధ్యప్రదేశ్ స్పీకర్

- విశ్వాస పరీక్షకు పట్టుబట్టిన విపక్షం
- సుప్రీంకోర్టుకు బీజేపీ నేత శివరాజ్ సింగ్
- మంగళవారం బలం నిరూపించుకోవాలని మళ్లీ ఆదేశించిన గవర్నర్

భోపాల్/న్యూఢిల్లీ: మధ్య ప్రదేశ్ రాజకీయాల్లో సోమవారం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. కరోనా వైరస్ కమల్ నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాత్కాలికంగా ఆదుకుంది. విశ్వాస పరీక్ష ఎదుర్కోవాలని గవర్నర్ లాల్జీ టాండన్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్‌ను ఆదేశించిన నేపథ్యంలో.. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే సభను మార్చి 26 వరకు వాయిదా వేస్తూ స్పీకర్ ప్రజాపతి సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా విజృంభిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. అంతకుముందు, కోవిడ్-19ను ప్రపంచ ఆరోగ్య సంస్థ విశ్వవ్యాప్త మహమ్మారిగా నిర్ధారించిందని, ఆ వైరస్ వ్యాప్తిని నిరోధించే లక్ష్యంతో.. రాజస్తాన్, కేరళ, ఒడి

సాక్షి
మంగళవారం, మార్చి, 17

హేతుబద్ధత ఎక్కడ?

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను కరోనా సాకుతో ఆరు వారాలు వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదివారం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్థానిక సంస్థలకు ప్రభుత్వాలు వీసమెత్తు విలువీయడం లేదని, వాటికి సకాలంలో ఎన్నికలు జరపడం లేదని ప్రజాస్వామికవాదుల నుంచి తరచు విమర్శలొస్తూ వుంటాయి. ఇదొక రివాజుగా మారుతున్నదని గ్రహించాక నిర్దిష్ట వ్యవధిలో ఎన్నికల నిర్వహణను తప్పనిసరిచేస్తూ 1992లో కేంద్రం రాజ్యాంగ సవరణ తీసుకొచ్చింది. అయినా ఆ సవరణకు తూట్లు పొడుస్తూనేవున్నారు. ఈ విషయంలో ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధహస్తుడు. గతంలో తొమ్మిదేళ్లు ముఖ్య మంత్రిగా పనిచేసినప్పుడైనా, ఆ తర్వాత మొన్నటివరకూ అయిదేళ్లు ఆ పదవిలో కొనసాగినప్పుడైనా స్థానిక సంస్థల ఎన్నికలంటే ఆయనకు ప్రాణాంతకమే. న్యాయస్థానాలు మొట్టికాయలేసినా... విపక్షాలు ఒత్తిళ్లు తెచ్చినా బేఖాతరే. 2018లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అప్పటి ఉమ్మడి హైకోర్టు ఆదేశించినా ఆయన నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు. స్థానిక సంస్థలపై ఆయనకెంత చిన్నచూపో బాబు గతంలో రాసుకున్న 'మనసులో మాట' బయటపెట్టింది. చిత్రమేమంటే విపక్షానికి పరిమితమైనా ఈ విషయంలో ఆయన వైఖరి మారలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన రిజర్వేషన్లను సవాలు చేస్తూ తన పార్టీ వ్యక్తితో న్యాయస్థానాల్లో పిటిషన్ దాఖలు చేయించారు. చైనాలోని వూహాన్‌లో కరోనా జాడ కనబడ్డాక ఆ సాకుతో ఎన్నికలు వాయిదా వేయిద్దామని బాబు ప్రయత్నించారు. ఆయనతో కాంగ్రెస్, జనసేన గొంతు కలిపాయి. ఈ అవరోధాలన్నీ దాటుకుని ఈ నెల 7న ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడినప్పటినుంచి బాబుకు కంటిమీద కునుకు లేదు. కరోనా రాష్ట్రానికి ఎప్పుడొస్తుందా, ఎప్పుడు ఎన్నికల్ని ఆపేస్తుందా అన్నట్టు ఆయన ఎదురు చూశారు. ఆ అవసరం లేకుండానే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ స్థానిక ఎన్నికలను ఏకంగా ఆరువారాలు నిలిపివేస్తున్నట్టు ప్రకటించి బాబు మనోభీష్టాన్ని నెరవేర్చారు.

సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వాలు మోకాలడ్డుతుంటాయి. కానీ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తిచేయాల్సిన కమిషనే ఈసారి ఆ పని చేసి కొత్త రికార్డు నెలకొల్పింది. కేంద్రం కరోనా వైరస్‌ను జాతీయ విపత్తుగా ప్రకటించినందువల్ల వాయిదా వేస్తున్నామని నిమ్మగడ్డ చేస్తున్న వాదన తర్కానికి నిలబడదు. ఈ నెల 7న షెడ్యూల్ ప్రకటించేనాటికీ, ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా తలెత్తిన విపత్కర పరిస్థితులేమీ లేవు. సోమవారం కేంద్రం ప్రకటించిన గణాంకాలు గమనిస్తే దేశవ్యాప్తంగా వెల్లడైన కరోనా కేసులు 116 కాగా, మృతుల సంఖ్య 2. ఆంధ్రప్రదేశ్‌లో కరోనా అనుమానిత కేసులు 79. వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపాక అందులో 66మందికి ఆ వ్యాధి లేదని తేలింది. ఒక్కరికి మాత్రం పాజిటివ్ అని వచ్చింది. అతను కూడా కోలుకుంటున్నాడని, త్వరలో డిశ్చార్జి చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. పైగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు ప్రారంభించింది. వ్యాధిగ్రస్తులెవరైనా ఉన్నట్టు తేలితే వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించడానికి వీలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు ఏర్పాట్లు చేసింది. అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఇప్పటికే తిరుపతి, విశాఖల్లోవున్న వైరాలజీ ల్యాబ్‌లకు తోడు విజయవాడలో కూడా మరొకటి నెలకొల్పారు. ఈ వాస్తవాలన్నీ ఎన్నికల కమిషనర్‌కు అవసరం లేదా? తమకు హైకోర్టు జడ్జి అధికారాలుంటాయని వాదిస్తున్న కమిషనర్.. ఆ అధికారాల ప్రాతిపదికగా తీసుకునే నిర్ణయాలకు హేతుబద్ధత కూడా అవసరమన్న సంగతిని ముందుగా గ్రహించాలి. రాష్ట్రంలో కరోనా వ్యాధి ఉందో లేదో... ఉంటే దాని తీవ్రత ఎంతో నిమ్మగడ్డ తనకు తాను ఎలా నిర్ణయానికి రాగలుగుతారు? ఆ వ్యాధికి సంబంధించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని సంప్రదించకుండా వాస్తవ పరిస్థితేమిటో ఆయనకు బోధపడేదెలా? కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులను సంప్రదించామన్న సంజాయిషీ ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎక్కడో ఢిల్లీలో వున్నవారితో మాట్లాడగలిగిన కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని సంప్రదించాలన్న ఇంగిత జ్ఞానం ఎందుకు లేకపోయింది? కనీసం జిల్లా కలెక్టర్లతో మాట్లాడినా క్షేత్రస్థాయి పరిస్థితులేమిటో ఆయనకు అవగాహన కలిగేది. అప్పటికీ శంక తీరకపోతే సభలూ, సమావేశాలపై ఆంక్షలు పెట్టవచ్చు. పోలింగ్ కేంద్రాల సంఖ్యను పెంచి తక్కువ వ్యవధిలో అధికశాతం మంది ఓట్లేసేవిధంగా చర్యలు తీసుకోవచ్చు. ఏం చేసైనా సకాలంలో స్థానిక సంస్థలకు ప్రాణప్రతిష్టచేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టాలన్న సంకల్పం కమిషన్‌కే కొరవడటం విస్మయం కలిగిస్తుంది.

నోటిఫికేషన్ వెలువడిననాటినుంచీ ఎన్నికలకు గండికొడదామని బాబు ఎంతగా తాపత్రయపడుతున్నారో అందరికీ తెలుస్తూనేవుంది. తన పార్టీ శ్రేణుల్ని రంగంలోకి దించి, హింసను ప్రేరేపించి దాన్ని కారణంగా చూపుదామని ఆయన చేసిన ప్రయత్నాలు రాష్ట్ర ప్రజలు కొన్నిరోజులుగా గమనిస్తూనే వున్నారు. కానీ ఎన్నడూలేని విధంగా నామినేషన్ల ప్రక్రియ స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విచ్చలవిడిగా పారకుండా చేయడంలో, ఎవరూ శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా చూడటంలో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించింది. షెడ్యూల్ ప్రకారం మరో వారంలో ఎన్నికలు పూర్తవుతాయి. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు మొదలై నెలాఖరుకల్లా ఫలితాలు కూడా వెలువడతాయి. కరోనా తన ప్రతాపం చూపకముందే స్థానిక సంస్థలు ఉనికిలోకొచ్చి, ఆ వ్యాధిని అరికట్టడంలో తమ వంతు పాత్ర పోషించగలుగుతాయి. ఈ విషయంలో అవగాహనారాహిత్యంతో ప్రవర్తించిన ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని న్యాయస్థానాలు సరిదిద్దుతాయని, స్థానిక స్వపరిపాలన స్ఫూర్తిని కాపాడతాయని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.అష్టమి ఉ.8.10 వరకు, తదుపరి నవమి నక్షత్రం మూల సా.4.27 వరకు, తదుపరి పూర్వాషాఢ వర్జ్యం ప.2.50 నుంచి 4.27 వరకు, దుర్ముహూర్తం ఉ.8.33 నుంచి 9.21 వరకు, తదుపరి రా.10.55 నుంచి 11.43 వరకు అమృతఘడియలు... ఉ.10.05 నుంచి 11.45 వరకు.

సూర్యోదయం : 6.12
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

ముసుగు కరోనాది-లోసుగు బాబుది



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'కరోనా అంటువ్యాధి కారణంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఆరు వారాల పాటు నిలిపివేస్తున్నాను. ఆరు వారాల తర్వాత సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత రాష్ట్రంలో తిరిగి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. అత్యున్నత స్థాయి అధికారులతో చర్చించి పరిస్థితులను మదింపు వేసి ఈ నిర్ణయం తీసుకున్నాను'

– ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అకస్మిక ప్రకటన

'రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ తెలుగుదేశం నాయకుడు చంద్రబాబు ప్రతినిధిగా వర్ల రామయ్య ఎన్నికల కమిషనర్‌కు ఒక లేఖ అందచేశారు'

– మీడియా వార్తలు

2019 సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ చరిత్రలో కనీవినీ ఎరుగని ఓటమిని పొందిన తర్వాత, ఆ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మనఃస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తున్నాడనడానికి స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ తన హయాంలో అధికార పదవులు వెలగబెట్టిన ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్‌ను ప్రభావితం చేస్తూ కోరడమే నిదర్శనం. పదవీచ్యుతుడైన పాలకుడు తిరిగి ఆ పదవిలోకి పునరావాసం చేయడానికి ఎన్ని సాకు లైనా వెతుకుతాడు. ఆ పనిలోనే ఉన్న చంద్రబాబు చేతికి, నోటికి అంది వచ్చిన సరికొత్త 'ఆయుధం' కరోనా వ్యాధి.

చైనాలో ఒక రాష్ట్రంలోని ఒక నగరంలో పుట్టి పెరిగిన కరోనా వ్యాధి తీవ్రతను అదుపులోకి తెచ్చినందుకు ఒకవైపున ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిపతులు చైనాను ప్రశంసించింది. మరోవైపున ప్రపంచవ్యాపితంగా చైనా నుంచి ఇతరదేశాలకు, ఇతర దేశాల నుంచి చైనాకు ప్రయాణాలు నిలిపివేయడంతోసహా, పౌరులపై అనేక దేశాలు ఆంక్షలు విధించి, వ్యాధి వ్యాప్తిని అడ్డుకునే చర్యలు ముమ్మరం చేశాయి. భారతదేశంలో కూడా కరోనా వ్యాప్తి నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ స్థాయిల్లో ప్రజారోగ్య రక్షణకు ముందస్తు చర్యలూ ముమ్మరం చేశాయి. అన్ని రాష్ట్రాల్లో కన్నా కరోనా వైరస్ వార్తలు వెల్లడైన మరుక్షణం నుంచే దాని వ్యాప్తి నిరోధానికి ముమ్మరంగా జయప్రదంగా చర్యలు తీసుకుంటూనే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నవారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.

పైగా స్థానిక సంస్థల ఎన్నికలను గతంలో చంద్రబాబు ప్రభుత్వం సాధా రణ పరిస్థితుల్లో కూడా సాకులపై సాకులు చూపెట్టి, వాయిదా వేసింది. ఆ సంగతిని 'పరగడుపు' చేసుకున్న బాబు, అడుగూడి చతికిలబడిన అతని వర్గమూ, ఎన్టీఆర్ ప్రాణాలు తోడేయడంలో బాబుకు చేదోడువాదోడుగా నిలిచిన రెండు దిన పత్రికలూ, వాటి టీవీ చానళ్లూ, ఈరోజున కరోనాను రాజకీయ ప్రచారానికి వాడుకుంటూ.. సాధారణ ప్రభుత్వ కార్యకలాపాలకు, కరోనాతో సంబంధం లేని స్థానిక సంస్థల ఎన్నికలకూ స్వార్థ బుద్ధితో మోకాలడ్డుతున్నారు. స్థానిక సంస్థలకూ ప్రకటితమైన ఎన్నికల షెడ్యూల్‌నే మార్చించేందుకు తంత్రాలు, కుతంత్రాలు పన్నుతున్నారు.

నిజానికి ఎన్నికల షెడ్యూల్ మొదలై, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల స్థాయిలో వివిధ పార్టీల తరపున అభ్యర్థుల నామినేషన్లు, ప్రచారాల ఆర్భాటం ప్రారంభం కావడమూ, కొన్ని చోట్ల అభ్యర్థుల నామినేషన్లు ఏకగ్రీవంగా ఖరారు కావటమూ జరిగిపోతున్నాయి. ఈ దశలో ఎన్నికల కమిషనర్ రమేష్ ఎన్నికలను ఆరు వారాలపాటు నిలిపివేస్తూ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికం, నిరంకుశం, అసాధారణం కావడమే కాదు, ఒక తరహా రాచరికపు ధోరణి కూడా. ఈ ధోరణినే రాచరికాల రోజుల్లోనే లార్డ్ కోక్.. 'అయ్యా, చట్టానికి రాజే కాదు, వాడబ్బ ఎవడైనా సరే అతీతుడుగా ఉండడానికి అర్హుడు కాడు' అన్నాడు. చంద్రబాబు హయాంలో ఒక్క రమేష్ కాదు, వారి కుటుంబ సభ్యులొకరు కూడా ఉద్యోగార్థులై కొలువుకూటంలో చేరి ఉన్నందువల్ల కూడా న్యాయ నిర్ణయంలో సమతుల్యతను కోల్పోవలసి వచ్చింది. కమిషనర్ అసలు ఎన్నికలను ఏకపక్షంగా వాయిదా వేసే ముందు కనీస బాధ్యతగా రాష్ట్ర గవర్నర్‌ను కలుసుకొని ఫలానా కారణంవల్ల వాయిదా వేస్తున్నాను అని చెప్పి ఉండాలి గదా? మొదటి కర్తవ్యంగా ఆ పని చేయకపోగా ఎన్నికల కమిషనర్ విధిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోనూ, ఆరోగ్య, వైద్య శాఖ కార్యదర్శితోనూ సంప్రదించాల్సిన అవసరం ఉందా లేదా? ఈ దారుణమైన తన లోపాన్ని ఎన్నికల కమిషనర్ రమేష్ ఎక్కడ కప్పిపుచ్చుకోవాలనుకున్నారు? ఈ బాధ్యతను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎత్తిచూపేదాకా ఎన్నికల కమిషనర్ స్పృహకు రాకపోవటం యాదృచ్ఛికమా? ఎగవేతా?

తీరా.. తాను తీసుకున్న నిరంకుశాధికార చర్యకు సమర్థనగా కమిషనర్ ఎరువు తెచ్చుకుని చెప్పిన సాకు 'కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి తాను నిర్ణయం తీసుకున్నాను' అని మాత్రమే. కానీ, అప్పటికే చంద్రబాబు తాను కమిషనర్‌ను 'వాయిదా వేయమని కోరాన'ని ప్రకటించడమూ జరిగిపోయింది. ఈ అర్ధంతరంగా జారీ చేసిన ఆకస్మిక నిర్ణయంలో బాబు పాత్రతో పాటు కమిషనర్ చెబుతున్నట్టు 'కేంద్ర ఆరోగ్య శాఖాధికారుల' పాత్ర ఎంత? బీజేపీ పాలకుల పాత్ర ఎంత? అన్న విషయాలు కూడా తేలాలి. ఎందుకంటే మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి, తిరిగి ఎన్నికలు జరపమని కోరడానికి బీజేపీ పాలకులకు మాత్రం 'కరోనా' వైరస్ అడ్డురావటం లేదు కాబట్టి, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి కూడా స్పష్టం కావాలి.

అంతేగాదు, రాష్ట్రంలోని అన్ని పరిస్థితులను, అన్ని స్థాయిలలోనూ ఉన్నతాధికారులతోనూ సంప్రదింపులు జరిపి, అభిప్రాయాలు ప్రజాస్వామికంగా సేకరించిన తరువాతనే ఆరు నెలలపాటు ఎన్నికల నిర్వహణ బాధ్యతలకు సంబంధించిన నిర్ణయాలు సాధికారికంగా తీసుకున్న తరువాతనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ పత్రాలు తదితర సరంజామా అంతా సిద్ధపరచుకున్న తరువాతనే ఎన్నికల ప్రక్రియకు దిగిందని బాబుకి, ఆయనకు ఆశ్రయం కల్పించిన కమిషనర్ రమేష్‌కు తెలిసి ఉండాలి. అసలు గుబులంతా ఎప్పుడైతే వివిధ పార్టీలు తమ అభ్యర్థులు నామినేషన్లు వేయటం ప్రారంభించాయో, అప్పటినుంచే పలుచోట్ల ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లుగా ప్రకటనలు వెలువడుతూ వచ్చాయి. కుంగి, కృశించిపోతున్న బాబుకు, ఆయన వర్గానికీ ఇదే కంటగింపు అయింది. జగన్ 'నవ రత్నాలు', మాటకు కట్టుబడి ఉండే మనసూ, తత్వమూ.. ఆచరణలో అవి అక్షరాలా అమలు జరుగుతున్న తీరూ, ప్రజలలో మెజారిటీ బడుగు, బలహీన వర్గాలలో ఇంతకాలం కొనసాగుతున్న నైరాశ్యం క్రమంగా తొలగి ఆశావహులుగా మారుతున్న పరిణామం రాష్ట్రంలో కనపడుతోంది. ఒక వైపున పేదసాదల్లో, మధ్య తరగతి ఉద్యోగ సద్యోగ జీవుల్లో కొత్త ఆశలు చిగురించి భవిష్యత్తు ఆశాజనకంగా ఉండగలదన్న భావం మొలకెత్తుతున్న సమయంలో పాలకుండలో విషపు చుక్కలు కలిపి ఆనందించే దశలో బాబు వర్గమూ, ఆయని పంచన చేరిన కాంగ్రెస్ లోని ఒక వర్గమూ (అహ్మద్‌పటేల్) ఉంది. మరొకవైపు నుంచి జగన్ పాలనకు ఇబ్బందులు కలిగించే బాబు వర్గంలోని 'కపట సన్యాసుల' ముఠాకు బీజేపీ కేంద్ర నాయకత్వం ఆశ్రయం కల్పించి 'రెండుగుళ్ల, మూడుగుళ్ల ఆటకు అలవాటుపడటమూ జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో పట్టుమని రెండు 'కరోనా' కేసులు (ధ్రువపడనివి) లేకపోయినా, స్థానిక ఎన్నికలు సహజంగా జరక్కుండా చేయాలన్న బాబు దుగ్ధ, అందుకు కమిషనర్ సహకరించడానికి బిడియంతో నైనా తలూపడమూ– 'కరోనా'కు మించిన వైరస్‌గానే భావించాల్సి ఉంటుంది. అప్పులతో రాష్ట్రాన్ని, ప్రజలను ముంచి వెళ్లింది చాలక, తప్పనిసరిగా రాజ్యాంగ విహితంగా జరగవలసిన స్థానిక ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించకుండా చేయడం.. తద్వారా లక్షలాదిమంది పేదలకు దక్కనున్న స్థలాల పంపిణీని ఎన్నికలను వాయిదా వేయించడంద్వారా వారి పొట్ట కొట్టడమూ చంద్రబాబుకీ, పక్షపాతంతో ఉన్న అతని పక్షానికే చెల్లు. 'కరోనా' వల్ల ఎన్నికలను వాయిదా వేయాలన్న బ్యూరాక్రాట్ బుర్ర లక్షలాదిమంది విద్యార్థులు హాజరయ్యే పరీక్షల్ని, అధికారుల ట్రాన్స్‌ఫర్లను మాత్రం ఆపలేకపోయింది ఎందుకనో! చివరికి ఈ దేశంలో న్యాయ వ్యవస్థపై విశ్వాసమున్న వారు కేవలం అవినీతిపరులు (స్కామర్స్), స్మగ్లర్లు, బడాబాబులు, రాజకీయులు, పెద్ద పెద్ద కేసుల్లో ఇరుకున్న నిరంకుశాధికారులు (బ్యూరాక్రాట్స్) కావటం ఒక ఆనవాయితీగా మారినందుననే, సామాన్యులకు పెక్కు సందర్భాల్లో న్యాయం దూరమవుతోందని సుప్రసిద్ధ విశ్లేషకుడు సుధాంశు రంజన్ (జస్టిస్ వర్సెస్ జ్యుడీషియరీ రచన, ఆక్స్‌ఫర్డ్ ప్రెస్, 2019, పే.11) పేర్కొన్నారు.

ఇంతవరకు భారత రాష్ట్రాల ప్రభుత్వ స్థాయిలో సంస్థలతో ప్రపంచబ్యాంకు, దాని అనుబంధ సంస్థలు చర్చలు జరుపుతాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఒకే ఒక వ్యక్తితో, నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే చర్చలు జరపాల్సి వస్తోంది. మిగతా అధికారులు ఉండరు. పైగా బాబు ప్రభుత్వం చూపే చిట్టా ఆవర్జా లెక్కలు విశ్వసనీయమైనవి కావు (డ్యూబియస్)' అని ప్రపంచబ్యాంకు అనుబంధ సంస్థ డీఎఫ్‌ఈడీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్) నిధులు సమకూర్చిన సంస్థ తరపున సర్వే జరిపిన ప్రొఫెసర్ జేమ్స్ మానర్ వెల్లడించాడు. ఇంతటి 'ఘన చరిత్ర' కలిగిన చంద్రబాబు విభజనానంతర ఏపీ తొలి ముఖ్యమంత్రిగా తన హయాంలో చేసిన నిర్వాకం ఇది. ఆనాటి దాగుడు మూతలకు కాలం చెల్లిపోయింది కాబట్టి తాజాగా వైసీపీ పాలనను జగన్ ధాటిని ఎదుర్కోవడానికి బాబు ఆశ్రయించిన కొత్త క్రిమి 'కరోనా వైరస్'. కానీ, బాబు మరిచిపోతున్న అసలు వాస్తవం– జీవ శాస్త్రవేత్తలు మానవుడే అసలు బ్యాక్టీరియా (మ్యాన్ ఈజ్ బ్యాక్టీరియా) అని నామకరణం చేశారని మరచిపోరాదు!

abkprasad2006@yahoo.co.in

రెండో మాట



సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కులం

"బాబు సీఎంగా లేని రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా ఉండటానికి వీల్లేదని వ్యవస్థల్లోకి ఆయన చొప్పించిన 'స్లీపర్ సెల్స్' కరాఖండీగా చెబుతున్నాయి. దేశం కంటే కులమే గొప్పది. మాదేవుడు బాబు అంతకంటే పెద్దోడు. ఆర్థిక సంఘం నిధులు 5 వేల కోట్లు రాకపోతే మాకేంటి అంటున్నాయి ఈ 'నిద్రాణశక్తులు'. ఉగ్రవాద సంస్థలు తాము టార్గెట్ చేసిన వ్యవస్థలను విచ్ఛిన్నం చేయడానికి మోల్స్(ద్రోహులు), కోవర్టులు, స్లీపర్ సెల్స్‌ను ప్రవేశపెడతాయి. ప్రజా సంక్షేమం కోసం కలసికట్టుగా పనిచేయాల్సిన చోట ఇలా ద్రోహులను జొప్పించడం, అదను చూసి వారు విధ్వంసానికి తెగబడటం, టెర్రర్ గ్రూపుల కంటే ఘోరం కాదా?"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

హోటళ్లు

"విదేశాల నుంచి వస్తున్న వారిలో వైద్య పరీక్షలు అవసరమైనవారు ఆధునిక సౌకర్యాలు కోరుతున్నారు. దీంతో విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న మూడు పెద్ద హోటళ్లను కోరడంతో, ఇందు కోసం వాళ్లు 182 గదులను కేటాయించారు. అయితే, వీటికి నిర్ణీత ధర చెల్లించవలసి ఉంటుంది"

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

పరీక్ష

"మంగళవారం నాటికల్లా తన బలాన్ని నిరూపించుకోవాలని లేనట్లయితే మెజార్టీ కోల్పోయినట్లుగా భావించాల్సి వస్తుందని మధ్యప్రదేశ్ గవర్నర్, ముఖ్యమంత్రి కమల్ నాథ్‌కు తేల్చి చెప్పేశారు. బీజేపీ గవర్నర్, కాంగ్రెస్ స్పీకర్ మధ్య మనం అసలైన రాజ్యాంగ పరీక్షను వీక్షించబోతున్నాం. కరోనా కంటే రాజకీయ వైరస్ ఎక్కువకాలం జీవిస్తుంది"

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

నిరసన

"కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా షహీన్ బాగ్ నిరసనలు ఉపసంహరించుకోవాలని అక్కడి మహిళలను కొందరు సదుద్దేశంతోనే ఒత్తిడి చేస్తున్నారు. బాగుంది. కానీ, సీఏఏ ఉపసంహరించుకోవాలని ప్రభుత్వంపై కాసింత ఒత్తిడి కూడా వీళ్లు ఎందుకు తేలేకపోతున్నారు? పీడితులే బాధ్యతాయుతంగా, నిజాయితీగా వ్యవహరించాలని ఎందుకు కోరుకుంటారు? పీడకుల నుంచి ఎందుకు ఆశించరు?"

– అర్ఫాఖనుమ్ షెర్వాణీ, జర్నలిస్ట్

మద్దతు

"ఐక్యరాజ్య సమితిలో మన దేశాన్ని ఇరాన్ ఎప్పుడూ విమర్శిస్తూ ఉంటుందనీ, భారత్‌లోని దేశద్రోహులకు వత్తాసు పలుకుతుందనీ, ఇరాన్‌లో ఉన్న భారతీయ యువకులకు కరోనా పరీక్షలు జరపడానికి కూడా నిరాకరించిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారత్ పెట్టిన ప్రతి తీర్మానానికీ మద్దతు తెలిపింది. ట్వీట్లు చేసే ముందు కొంత చరిత్ర తెలుసుకుంటే మంచిది"

– అడ్వైడ్, రచయిత

బాధితులు

"కరోనా బాధితుల్లో తేడాను చూడదు. కానీ, దాన్ని ఎదుర్కోవడంలో బాధితుల సామర్థ్యం, వారి సామాజిక, ఆర్థిక స్థాయిని బట్టి ఉంటుంది. సామాజిక దూరాన్ని, నిర్బంధాన్ని కూడా పాటించలేని స్థితిలో సామాన్య ప్రజలు ఉన్నారు. మరి ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు?"

– దామినీకైన్, విద్యార్థి నేత

ఇన్‌బాక్స్

చమురు పేరిట ఇంత నిలువు దోపిడీనా?

ప్రపంచంలోనే ఏ దేశమూ చమురు పేరిట ఇంత నిలువుదోపిడీ చేయలేదేమో.. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల వ్యవహారం చూస్తే అలానే అన్పిస్తుంది. వినియోగదారుడు కొనుక్కొనే పెట్రోల్, డీజిల్ ధరల్ని అంతర్జాతీయ మార్కెట్‌కి అనుసంధానం చేసేసారు ఏళ్ల క్రిందటనే. 15 రోజులకోమారు రేట్లు మారే విధానం బదులుగా ప్రతీ రోజూ సవరించే విధానం డైనమిక్ ప్రైసింగ్ పేరుతో 2017లో తీసుకువచ్చారు. అప్పుడు చెప్పిందేమిటంటే అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధర లకనుగుణంగా వినియోగదారుడు నేరుగా ధరల్లో హెచ్చుతగ్గుల్ని వెంటనే అనుభవించాలని. తద్వారా ప్రభుత్వం, ప్రయివేట్ రిఫైనరీలు తమ లాభాల్ని మాత్రమే చూసుకొనేలా ధరలపై పెత్తనం చెయ్యడం తగ్గుతుందని. అయితే నేడు పరిస్థితి మాత్రం భిన్నం. 2014 నుండి నేటి వరకూ 11సార్లు పెట్రో ధరలు పెరగ్గా, రెండుసార్లు తగ్గాయి.

ఈ సారి మరీ ఘోరం. వివిధ కారణాలతో క్రూడ్ ఆయిల్ ధర 50 శాతానికి పడిపోయింది. బారెల్ ధర 63 డాలర్ల నుండి ఎకాయెకి 33 డాలర్లయ్యింది. ప్రభుత్వం తన మాట ప్రకారం వేలుపెట్టకుండా వుంటే కనీసం పెట్రోల్ ధర గణనీయంగా తగ్గి సామాన్యుడికి ఊరట దక్కేది. కానీ ప్రజాప్రభుత్వం అలా ఎందుకు చేస్తుంది? చక్కగా లీటరు పెట్రోల్‌పై మూడు రూపాయల పన్ను అదనంగా వడ్డించింది. గత ఎనిమిదేళ్లలో వడ్డించిన పన్నుల్లో రికార్డిది. వెరసి మళ్ళీ ప్రజలు అదే పాత రేటుకి ఇంధనం కొనుక్కోవాలి. అంటే అంతర్జాతీయ మార్కెట్ బట్టే ఇంధనం ధర ఉంటుందని చెప్తూనే అక్కడ ఏభై శాతం తగ్గితే ఇక్కడ ఏడు శాతం మాత్రమే తగ్గిస్తున్నారు. పెట్రోల్ అసలు ధరకన్నా దానిపై పన్నులే ఎక్కువైన ఈ నిలువుదోపిడీ మారాలి. జీఎస్టీ పరిధిలోకి ఇంధనం ధరల్ని తీసుకురావడమే కాకుండా ధరల్లో వెసులుబాటుని నేరుగా ప్రజలకు అందించాలి. ఇప్పుడలా చేసి వుంటే ప్రజలకు కష్టకాలంలో ఊరట ఉండేది.

– సాంబశివరావు, కార్ఖానా, సికింద్రాబాద్

పౌరసత్వ సవరణ చట్టం దళితులకే వరం

సందర్భం

చింతా సాంబమూర్తి

పౌరసత్వ సవరణ చట్టం–2019 పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లో మతహింసను ఎదుర్కొంటున్న మైనార్టీ సముదాయాలకు వరం. ఆ దేశాల్లో మతహింసను తట్టుకోలేక ఎంతోమంది భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో 80 శాతం మంది షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందినవారేనని అంబేడ్కర్ గణాంకాలతో వివరణ ఇచ్చారు. బెంగాల్‌లోని నామసూద్రులలో అత్యధికంగా ఉన్న మాతువ ప్రజల పరిస్థితి హృదయ విదారకమే. పాండ్రా క్షత్రియ, మహి వంటి వారు షెడ్యూల్డ్ కులాలకు చెందినవారే. దేశ విభజన సమయంలోనే వారు భారత్ రాకుండా అప్పటి నాయకత్వం బలవంతంగా ఆపింది. మహ్మద్ అలీ జిన్నా తదితరులు వారి భద్రత విషయంలో హామీ ఇచ్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 17-3-2020

మూడోసారి రెండు భాషల్లో...

సినిమా పేజీలో...

కొత్త సవాల్

థప్పడ్ అంటే చెంపదెబ్బ. భార్యను చెంపదెబ్బ కొట్టే హక్కు భర్తకు ఉందని సమాజం అనుకుంటుంది. కానీ, చెంపదెబ్బయినా సరే ఎందుకు కొట్టాలి? అని బాలీవుడ్‌లో ఇటీవల వచ్చిన 'థప్పడ్' సినిమా ప్రశ్నించింది. పురుషాహంకారం మీద చెంపదెబ్బ కొట్టిన సినిమా ఇది. స్త్రీల తరఫున వకాల్తా పుచ్చుకునే హిందీ సినిమాలు ఇప్పుడు గొప్పగా వస్తున్నాయి.

ఇప్పుడు డైలాగ్ ఆమెదే

చైల్డ్ అబ్యూజ్

దేహం మనదే... దేశం మనదే

'ఇప్పుడు ప్రేక్షకులు ఏమి ఆలోచిస్తుండొచ్చు?' 'నేరస్తులను తుపాకితో కాల్చి పడేయ్యాలని అనుకుంటున్నారు' 'ఇలాంటి వాళ్లను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి ఉరి తీసి పారేయాలని భావిస్తున్నట్టున్నారు' 'ఆడవాళ్ల మీద జరుగుతున్న ఈ హింసకు సమాజం బాధ్యత వహించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించుకుంటున్నారు'

ఇది 'పాజిటివ్‌లీ షేమ్‌లెస్' అనే నాటకం లోని ఒక సన్నివేశం. ప్రేక్షకులనూ ఈ నాటకంలో భాగస్వామ్యం చేయడానికి నటీమణులు వాళ్లలో వాళ్లే ప్రశ్నలు అడుగుతూ ప్రేక్షకులను సమాధానం వెతుక్కునేలా చేయడం ఇది. బెంగళూరుకు చెందిన శబరి రావు, మైత్రి గోపాలకృష్ణ, శరణ్య అయ్యర్, శిల్పా వాఘ్మోర్, ఏపీ సత్యం అనే అయిదుగురు మహిళలు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు.

నా శరీరం.. నా సొంతం.. దీనిమీద పూర్తి హక్కు నాదే.. తరుణ్‌తేజ్ పాల్ కేసులో బాధితురాలు ఈ పాయింట్ మీదే పోరాడింది. సాహిత్యంలో చలం, సినిమాల్లో బాలచందర్ కూడా దీనిమీదే అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. 'పాజిటివ్‌లీ షేమ్‌లెస్' కాన్సెప్ట్ కూడా అదే. దేశంలో పిల్లలు, మహిళల మీద జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా 2016లో ఈ నాటక ప్రదర్శనను మొదలు పెట్టారు ఆ అయిదుగురు యువతులు. 'నా శరీరాన్ని తిరిగి నా స్వాధీనం లోకి తెచ్చుకునే ప్రయాణం'గా దీన్ని వర్ణిస్తారు ఈ నాటకానికి దర్శకత్వం వహిస్తున్న శబరీ రావు. ఈ ఐదుగురు నిజ జీవితంలో 'చైల్డ్ అబ్యూజ్'కి గురైనవాళ్లే. ఈ నాటకంలో వీరు రంగస్థలం మీదకు వచ్చి ఎవరికివారే చిన్నప్పుడు తాము అనుభవించిన లైంగిక హింసను వర్ణిస్తూ.. వ్యాఖ్యానమూ చేస్తూ నాటకాన్ని అభినయిస్తూంటారు. 'మన శరీరంతో మనకున్న సంబంధాన్ని చెప్పడమే పాజిటివ్‌లీ షేమ్‌లెస్ నాటకంలోని కీలకాంశం. మనమీద దాడి జరిగినప్పుడు ఈ బాడీ హింసకు స్థావరం. దాన్నలాగే వదిలేస్తే మెదడు మనల్ని మొద్దుబారుస్తుంది. ఆ దాష్టీకం నుంచి త్వరగా కోలుకోవాలన్నా.. తిరిగి దాని బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవాలన్నా మన శరీరం మీద మన హక్కును గుర్తించాలి. హింసకు గురైన ఈ దేహాన్ని త్వరగా మన అధీనంలోకి తెచ్చుకోవాలి. అప్పుడే ఆత్మవిశ్వాసం, మనపట్ల మనకు గౌరవం పెరుగుతాయి. మా అనుభవాలను నాటకంగా మలిచి మేం చెప్తున్నది ఇదే. దీన్ని ఒకరకంగా మేమిచ్చే థెరపి అనుకోవచ్చు.. సమాజాన్ని అప్రమత్తం చేసే బాధ్యతగానూ భావించొచ్చు' అంటారు శబరీ రావు. ఇప్పటి వరకు ఈ నాటకాన్ని మూడు సార్లు ప్రదర్శించారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ ఉంటారు. 'ఒకట్రెండు ప్రదర్శనలు పూర్తయ్యాక ఇంక మనం కొత్తగా చెప్పేదేమీ లేదని ఈ జర్నీని ఇంతటితో ముగిస్తే మంచిదని భావించాం మేము. పాత విషయాన్నే పదేపదే చెప్పడంలో అర్థంలేదని మా అభిప్రాయం. కాని ప్రతి ప్రదర్శనతో కొత్త జీవితం పొందినట్టు ఫీలయ్యేవాళ్లం. ప్రదర్శనకు ప్రదర్శనకు మార్పులు చేయడం స్టార్ట్ చేశాం. అలా నిర్భయ ఘటనను, ఈ మధ్య జరిగిన దిశ సంఘటననూ 'పాజిటివ్‌లీ షేమ్‌లెస్' స్క్రిప్ట్‌లో చేర్చుకున్నాం. భూమికలూ మార్చుకోవడం మొదలుపెట్టాం.. కేవలం నటనకు సంబంధించే కాకుండా బ్యాక్‌స్టేజ్ బాధ్యతలనూ మార్చుకుంటున్నాం' అన్నారు శబరీ రావు.

'పాజిటివ్‌లీ షేమ్‌లెస్' నాటకంలోని దృశ్యాలు

ఇంటర్నేషనల్ కమ్యూనిటీ ఆర్ట్స్ ఫెస్టివల్

ఈ నాటకాన్ని మార్చి 27, 28 తేదీల్లో అమెరికాలోని రోటర్ డ్యామ్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ కమ్యూనిటీ ఆర్ట్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శన ఇవ్వాల్సిందిగా వీరికి ఆహ్వానం అందింది. ఆ తర్వాత న్యూయార్క్ యూనివర్శిటీ నుంచీ ఇన్విటేషన్ వచ్చింది తమ దగ్గరా 'పాజిటివ్‌లీ షేమ్‌లెస్' ప్లేను పెర్‌ఫార్మ్ చేయమని. ప్రస్తుతం ఈ బృందం అమెరికా ప్రదర్శనకు రిహార్సల్స్ పూర్తి చేసుకొని ప్రయాణానికి సన్నద్ధం అవుతోంది.

బాలీవుడ్ మారింది. స్త్రీ ఆత్మగౌరవాన్ని గుర్తించింది. స్త్రీ, పురుష సమానత్వ సాధనకు ఆలస్యంగానైనా తనవంతు పోరాటం, అవగాహన కల్పించే ప్రయత్నం మొదలుపెట్టింది. బాలీవుడ్‌లో గత రెండు దశాబ్దాలుగా వస్తున్న సినిమాలే ఇందుకు నిదర్శనం. 'థప్పడ్' తాజా ఉదాహరణ. చెంపదెబ్బతో తన పురుషాహంకారాన్ని చూపించిన భర్త నుంచి వేరు కావాలనుకుంటుంది ఈ సినిమాలోని కథానాయిక. ఆ ఒక్క చెంపదెబ్బతో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని కథానాయిక ప్రశ్నించుకుంటుంది. భార్యాభర్తలు సమానంగా ఉండాల్సిన వివాహ బంధాన్ని చెంపదెబ్బతో కలుషితం చేయడం ఎందుకు? చెంపదెబ్బ కొట్టి భార్య స్థానాన్ని చులకన చేయడం ఎందుకు? ఇదేం కాపురం? తనతో సమానంగా చూడలేని భర్తతో ఒకే కప్పు కింద ఉండడం ఎందుకు? అని విడాకులు కోరుకుంటుంది తాప్సీ. అయితే మొగుడూ పెళ్లాలన్నాక కాపురమన్నాక ఇవన్నీ కామన్... మొగుడు కాకపోతే ఎవరంటారు.. అని ఆమె నిర్ణయం చూసి సమాజం ఆశ్చర్యపోతుంది. 'కేవలం ఒక్క చెంపదెబ్బకు విడాకులా?' అనే ప్రశ్నకు 'అవును.. ఒక్క చెంపదెబ్బ కొట్టినా విడాకులే' అని కథానాయిక తాప్సీ పాత్ర అంటుంది. గృహహింసకు 'థప్పడ్' ఒక తిరుగు జవాబు.

మారిన ధోరణి

ఇలా స్త్రీల తరఫున మాట్లాడే సినిమాలు పెరిగాయి బాలీవుడ్‌లో. నిన్న వచ్చిన 'తుమ్హారీ సులూ', మొన్న వచ్చిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' ఇల్లాలి ఆత్మగౌరవాన్ని సమాజానికి చూపించాయి. 'తుమ్హారీ సులూ'లో గృహిణిగా సగటు జీవితం గడుపుతున్న కథానాయికను ఏమీ చేతకాదు అంటూ దెప్పిపొడుస్తుంటారు. ఆమె రేడియో జాకీగా మారి తనను తాను నిరూపించుకుంటుంది. ఉద్యోగం పోయిన భర్తకు అదే రేడియో స్టేషన్‌లో క్యాటరింగ్ బిజినెస్ పెట్టిస్తుంది. ఈ విజయం ఆమె ఆత్మ సమ్మానం. శ్రీదేవి నటించిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' చెప్పిందీ అదే. ప్రేమ కన్నా స్త్రీకి ముఖ్యమైంది గౌరవమని. గౌరవం లేని ప్రేమ బానిసత్వానికి బంగారు సంకెలని. ఆ సినిమాలో 'వంట తప్ప మీ అమ్మకేం తెలుసు?' అంటూ పొద్దస్తమానం భర్త అవమానిస్తుంటే, కూతురు 'పేరెంట్–టీచర్ మీటింగ్‌కి అమ్మ వద్దు నాన్నా, తనకు ఇంగ్లిష్ రాదు. మా టీచర్ల ముందు నాకు ఇన్సల్టింగ్‌గా ఉంటుంది' అంటూ తనూ అమ్మను రెండు మెట్లు కిందకు తోసి నాన్నకు కిరీటం పెడుతుంది. దీన్ని భర్త ప్రేమ, కూతురి చనువుగా తేలిగ్గా తీసుకొని హాయిగా నవ్వుకోదు ఆమె. అవమానంగా ఫీలవుతుంది. ఆ ఇంట్లో తనకెలాంటి స్థానం కావాలో చెప్పాలనుకుంటుంది. చెప్తుంది.. ఇంగ్లిష్‌లోనే!

ప్రపంచం వినాలి..

'ఏం కావాలి నీకు?' అడుగుతుంది తల్లి తన బిడ్డను. 'ఈ ప్రపంచమంతా నా పాట వినాలనుకుంటున్నానమ్మా' సమాధానం ఇస్తుంది కూతురు. 'సీక్రెట్ సూపర్‌స్టార్' సినిమాలోని డైలాగ్ అది. ఆడపిల్లకు లక్ష్యం ఏంటి.. తలవంచుకొని అనుసరించక? ఆడపిల్లకు సంగీతం, డాన్స్ ఏంటి.. ఇంటిపనులు చూసుకోక? వంటి మూస ఆలోచనలతో కొట్టుకుపోతున్న తండ్రికి ఆడపిల్లా మనిషే అని చెప్పే ఓ కూతురి కథ ఈ సినిమా. ఇక ప్రోత్సహించే తండ్రులు ఉంటే ఆడపిల్లలకు ఆకాశమే హద్దు అని చెప్పిన సినిమా 'దంగల్'. ఆ సినిమాలో తండ్రి తన కుస్తీ ఆటను కుమార్తెలకు పంచి వస్తాదులుగా నిలబెడతాడు. అలాగే ప్యాషన్ ఉంటే క్రీడలలో కృషి చేయాలనుకునే మహిళలకు పెళ్లి, పిల్లలు అడ్డంకే కాదు అని నిరూపించాయి 'మేరీ కామ్', 'పంగా' సినిమాలు.

చపాక్... ఇంకొన్ని

ఇవి కాక స్త్రీ సాధికారతను ఫోకస్ చేసిన సినిమాలూ ఉన్నాయి. వారసత్వ వ్యాపారాలకు రబ్బర్‌స్టాంప్ యజమానులుగా కాక స్వంత శక్తితో అంట్రెపెన్యూర్స్ కాగలరని 'బాండ్ బాజా బారాత్', నిశ్శబ్దాన్ని ఛేదించకపోతే నష్టపోయేది స్త్రీలే అని వర్క్ ప్లేస్ హెరాస్‌మెంట్‌ను ఎదుర్కోవడానికి మహిళలకున్న చట్టపరమైన ఆయుధాలను తెలియజెప్పిన 'ఇన్‌కార్', 'సెక్షన్ 375', మోసాన్ని మోసంతోనే జయించాలన్న ధైర్యాన్నిచ్చే 'ఇష్కియా', అవతలి వ్యక్తి యాసిడ్‌తో కసి తీర్చుకున్నా మనోనిబ్బరం మసి కాలేదని నిరూపించిన 'చపాక్', సైన్యంలోనూ, దేశరక్షణ కోసం చేసే స్పైలోనూ, దేశ ప్రతిష్టను పెంచే సైన్స్‌లోనూ మహిళలు ముందున్నారని 'రాజీ', 'మంగళ్‌యాన్' తో చెప్పింది బాలీవుడ్.

'నో' అంటే 'ఎస్' అని కాదు

ఆడవాళ్లను సెక్సువల్ ఆబ్జెక్ట్స్‌గా చూపించిన ఒకప్పటి హిందీ సినిమాయే మహిళలకూ మెదడుంటుంది వాళ్ల అభిప్రాయాలకూ గౌరవమివ్వాలని గ్రహించింది నేడు. 'పింక్' లాంటి సినిమాలను నిర్మించింది. కట్టుబొట్టు తీరుతో స్త్రీని అంచనా వేయడం, జడ్జ్ చేయడం ఆపండి... ఆమె శరీరం మీద హక్కు ఆమెదే... భార్య అయినా, గర్ల్ ఫ్రెండ్ అయినా వేశ్య అయినా సరే.. ఒకసారి ఆమె 'నో' అన్నదంటే 'నో'అనే అర్థం ..అని 'పింక్' సినిమా చెప్పింది! ఆడవాళ్ల మాటలకు వేరే అర్థాలు లేవు. కాదంటే అవునని కాదు.. స్పష్టంగా కాదు అనే.. అంటూ సమాజం మెడలు తిప్పి మరీ చూపించిన మూవీ 'పింక్'.

పరువు హత్య.. పరువు చేటు

కులం, మతం, ఆస్తి, అంతస్తును లెక్క చేయకుండా పెళ్లి చేసుకుని 'పరువు తక్కువ పని' చేసిందని.. అందుకు ఆమెను చంపే హక్కు తమకు ఉందని భావించే పెద్దలను తీవ్రంగా నిలదీసిన సినిమా 'ఎన్‌హెచ్ 10'. అలాగే చైల్డ్ అబ్యూజ్‌ని మన దేశం కడుపులో పెట్టుకొని ఎలా దాచుకుంటుందో చూపించిన సినిమా 'హై వే'!

ప్రయాణం ఆపొద్దు..

ఆడపిల్లకు పెళ్లే జీవిత పరమావధి కాదు. అది జీవితంలో ఒక భాగం మాత్రమే. ఒకవేళ పరిస్థితులు తలకిందులై అనుకున్నది జరక్కపోతే కుంగిపోయి నాలుగు గోడలకే పరిమితం కావాల్సిన పని లేదు. కొత్త దారి వెదుక్కొని దర్జాగా ఆ దారెంట నడవచ్చు అని చూపిస్తుంది 'క్వీన్'. ఆత్మవిశ్వాసం హ్యాండ్ బ్యాగ్‌లో కాదు మైండ్‌లో ఉంటుంది.. ఆలోచనలతో బయటకు వస్తుంది.. కార్యాచరణలో కనిపిస్తుంది...అని చెప్తుందీ సినిమా. అందుకే ప్రతి మహిళ జీవితంలో ఒక్కసారైనా సోలోగా ప్రయాణించాలి అని ఈ సినిమా గురించి రాసిన రివ్యూలో చెప్పాడు ఒక రైటర్. ప్రయాణాన్ని మించిన పుస్తకం ఉంటుందా లోకజ్ఞానానికి!

ఇవి మారిన బాలీవుడ్ ట్రెండ్‌కు కొన్ని ట్రైలర్స్ మాత్రమే.

పురుషుడు వంట చేస్తే ఆర్ట్.. స్త్రీకైతే బాధ్యత అని ఒక సినిమాలో డైలాగ్. ఆర్ట్ అయినా.. బాధ్యత అయినా స్త్రీ, పురుషులిద్దరికీ సమానమే అన్న ప్రాథమిక సూత్రాన్ని ఆమోదించదగ్గ నిజాన్ని చూపిస్తున్న బాలీవుడ్‌కు థ్యాంక్యూ.

– సాక్షి ప్రతినిధి

బ్యూటీ టిప్స్

ముడతల నివారణకు...

- గుడ్డులోని తెల్లసొనలో అర టీ స్పూన్ మీగడ కలిపి ముఖానికి రాసి, పది నిమిషాల తర్వాత కడగాలి. లేదా బాగా మగ్గిన అరటిపండు గుజ్జును ముఖానికి, మెడకు రాసి పది నిమిషాల తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.
- రెండు టీ స్పూన్ల రోజ్ వాటర్‌లో ఒక చుక్క గ్లిజరిన్ కలిపి దూది ఉండతో ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాయాలి. ఈ మిశ్రమం మాయిశ్చరైజర్‌లా పనిచేసి చర్మం ముడతలు పడటాన్ని తగ్గిస్తుంది.
- గంధంలో పాలు కలిపి ముఖానికి ప్యాక్ వేసుకోవడం వల్ల త్వరగా మురికి పోవడంతో పాటు ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది. ఇందులో చిటికెడు పసుపు కలుపుకుంటే మొటిమల వల్ల ఏర్పడ్డ మచ్చలు తగ్గుతాయి.

నాదం సృష్టించే చేతులు

తబల, మృదంగం వంటి చర్మవాద్యాల తయారీ అనాదిగా పురుషుల పని. కాని బెంగళూరుకు చెందిన అశ్వత్థమ్మ గత ఆరు దశాబ్దాలుగా ఈ కళలో ఆరితేరారు. నాదాన్ని సృష్టించే చేతులు స్త్రీలవి కూడా కాగలవని నిరూపించారు.

భారతీయ సంప్రదాయ సంగీతంలో కొన్ని వందల వాద్య పరికరాలు ఉన్నాయి. అందులో కొన్ని తంత్రీ వాద్యాలైతే, కొన్ని చర్మ వాద్యాలు. వీటిని తయారుచేయటానికి ఎంతో కొంత సంగీత పరిజ్ఞానం ఉండాలి. స్వరస్థానాలను గుర్తించగలిగే శక్తి ఉండాలి. ఇవన్నీ ఉంటేనే ఒక వాద్య పరికరం శృతిపక్వంగా తయారవుతుంది. ముఖ్యంగా తబలా, మృదంగం వంటివి తయారు చేయటం చాలా కష్టం. వాటి తయారీకి కలపతోపాటు జంతు చర్మాలను ఉపయోగిస్తారు. సాధారణంగా వీటిని మగవారే తయారుచేస్తారు. కాని పురుషులకు ఏ మాత్రమూ తీసిపోను అంటూ ఇప్పటి వరకు 10 వేల పరికరాలు తయారు చేశారు బెంగళూరుకు చెందిన అశ్వత్థమ్మ.

''మా వారు ఆర్ ఎస్ అనంతరామయ్య సంగీతకారులు. ఆయన తబలా, మృదంగ వాద్యాలలో నిపుణులు. నా పదిహేనో ఏట నాకు వివాహమైంది. నేను వంటతోపాటు మావారి దగ్గర వాద్యపరికరాల తయారీ, వాటిని బాగు చేయటం రెండూ నేర్చుకున్నాను.'' అంటున్న అశ్వత్థమ్మ బెంగళూరు బాలాపేట్ సర్కిల్‌లోని శాంతా తబలా వర్క్స్‌లో పని చేస్తున్నారు.

''ఈ పరికరాల తయారీకి శారీరక బలం చాలా అవసరం. గట్టి గట్టి దెబ్బలు కొడుతూ వాద్యాలు తయారు చేయడం మగవారికి మాత్రమే అలవాటు. అటువంటిది నా కండబలంతో ఈ కళలో నైపుణ్యం సాధించాను'' అంటారు 75 సంవత్సరాల అశ్వత్థమ్మ. సంగీతానికి సంబంధించి ఎటువంటి కోర్సులు చేయలేదు అశ్వత్థమ్మ. స్కూలు చదువులు కూడా లేవు. కాని, వాద్యపరికరాలు తయారు చేసేటప్పుడు అందులో పలికే అపశృతులను గుర్తించగలరు. వాటిలోని మాధుర్యం తెలుసుకోగలరు. బెంగళూరులో ఎవరికి వాద్యపరికరాలు కావాలన్నా శాంతా తబలా వర్క్స్‌కి రావలసిందే.

అశ్వత్థమ్మ భర్త అనంతరామయ్య దేవాలయాల్లోను, నాటకాలలోను తబలా, మృదంగం వాయించేవారు. ఆ రోజుల్లో కచేరీలకు పెద్దగా డబ్బులు వచ్చేవి కాదు. అందువల్లే వాద్యపరికరాల తయారీ ప్రారంభించారు. అశ్వత్థమ్మ ఆ పని నేర్చుకున్నారు. భార్యాభర్తలు ఈ పనులు చేస్తున్నందుకు బంధువుల నుంచి ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నారు. ''వాద్యపరికరాలను జంతు చర్మాలతో చేస్తారని అందరికీ తెలిసిందే. మా కుటుంబమంతా దేవాలయాలలో పనిచేసేవారు. మేము జంతు చర్మాలతో పనిచేస్తున్నందుకు, మమ్మల్ని దూరం పెట్టారు. మగవారు చేసే మృదంగం పనులు చేయటం ఎందుకు అంటూ నన్ను ఎగతాళి చేసేవారు. వాస్తవానికి జంతుచర్మాలతో తయారుచేసే పరికరాలకు శక్తి కంటె తెలివి ఉండాలి'' అంటారు అశ్వత్థమ్మ.

ఆడ్యురాలు

తబలా తయారుచేస్తున్న అశ్వత్థమ్మ

అశ్వత్థమ్మ

తబలాను రిపేర్ చేయడానికి వారం రోజులు, మృదంగమైతే పది రోజుల సమయం పడుతుంది. ఈ వాద్యాలను పనస చెక్క, మామిడి చెక్కలతో పాటు ఇతర చెక్కలతోను తయారు చేస్తారు. ఆవు, గేదె, మేక చర్మాలను పరికరాల తోలుకోసం ఉపయోగిస్తారు. ''నేను సుమారు వంద రకాల వాద్య పరికరాలను తయారు చేస్తాను. ఇప్పటివరకు కొన్ని వందల రిపేర్లు చేశాను'' అంటారు ఆమె. ప్రముఖ సంగీత విద్వాంసులందరూ అశ్వత్థమ్మ దగ్గరే బాగు చేయించుకుంటారు.

ఈ అరవై సంవత్సరాలలో అశ్వత్థమ్మ చేతి నుంచి 10000 వాద్యపరికరాలు కళాకారుల చేతుల్లోకి వెళ్లాయి. తబలా, మృదంగం, ఢోలక్, ఢోల్కీ, ఢమరుకం, నగారీ, కంజరా వంటివి తయారవుతుంటాయి. 'మా వారికి కర్ణాటక కళాశ్రీ బహుమతి వచ్చింది. ప్రస్తుతం మా అబ్బాయి శ్రీనివాస్ ఈ సంస్థను ముందుకు తీసుకువెళ్తున్నాడు' అంటూ సంతోషంగా చెబుతారు అశ్వత్థమ్మ.

– వైజయంతి

మూడోసారి రెండు భాషల్లో...

సమంత

ప్రశాంత్

''ఇక సమంత సినిమాలకు దూరం. ప్రెగ్నెంట్' అనే వార్త ఫిల్మ్‌నగర్‌లో హల్‌చల్ చేస్తోంది. సోషల్ మీడియాలోనూ ఇదే ప్రచారం జరుగుతోంది. అయితే తాజా వార్త ఏంటంటే.. సమంత ఓ సినిమాకి సైన్ చేశారట. 'గేమ్ ఓవర్' దర్శకుడు అశ్విన్ శరవణన్ చెప్పిన కథ నచ్చి, ఆమె ఈ సినిమా అంగీకరించారట. ఈ చిత్రకథ సమంత చుట్టూ తిరుగుతుందని టాక్. తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న ఈ చిత్రంలో 'జీన్స్' ఫేమ్ ప్రశాంత్ నటించనున్నారు. ఇదిలా ఉంటే ఈ మధ్య సమంత చేసిన 'యు టర్న్', 'మజిలీ', 'ఓ బేబీ' చిత్రాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. 'జాను' ఆశించిన ఫలితం సాధించకపోయినా నటిగా సమంతకు మంచి మార్కులు పడ్డాయి. ఇక 'యు టర్న్', 'ఓ బేబీ' చిత్రాలతో లేడీ ఓరియంటెడ్ మూవీస్‌ని నడిపించగలిగే సత్తా సమంతకు ఉందని ప్రూవ్ అయింది. ఇప్పుడు అశ్విన్ శరవణన్ దర్శకత్వంలో అంగీకరించిన సినిమా కూడా కథానాయిక ప్రాధాన్యం ఉన్న సినిమానే అని భోగట్టా. ఇప్పటివరకూ సమంత రెండు ద్విభాషా చిత్రాల్లో చేశారు. 'ఎటో వెళ్లిపోయింది మనసు' ఇటు తెలుగు అటు తమిళంలో ఒకేసారి రూపొందింది. అలాగే 2018లో వచ్చిన 'యు టర్న్' తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన విషయం గుర్తుండే ఉంటుంది. ముచ్చటగా మూడోసారి ద్విభాషా చిత్రం చేయనున్నారామె. వచ్చే నెల ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారట.

అరణ్య వాయిదా

రానా

రానా హీరోగా నటించిన తాజా చిత్రం 'అరణ్య'. హిందీలో 'హాథీ మేరే సాథీ', తమిళంలో 'కాడన్' పేర్లతో రూపొందిన ఈ చిత్రానికి ప్రభు సాల్మన్ దర్శకత్వం వహించారు. ఈరోస్ ఇంటర్నేషనల్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 2న విడుదల కావాల్సి ఉంది. అయితే కరోనా వైరస్ ప్రభావం నేపథ్యంలో ఈ సినిమా విడుదల తేదీని వాయిదా వేశారు. ''ప్రేక్షకుల అభిరుచికి ఈరోస్ ఇంటర్నేషనల్ ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది. ఇదివరకెన్నడూ చెప్పని విలక్షణ కథలతో సినిమాలు నిర్మించడానికి, పంపిణీ చేయడానికి ప్రేక్షకులు మమ్మల్ని ఎప్పుడూ మోటివేట్ చేస్తూనే ఉన్నారు. కరోనా వైరస్‌కు సంబంధించి ఇటీవల వస్తున్న వార్తలను దృష్టిలో ఉంచుకొని తెలుగు, హిందీ, తమిళ భాషల్లో మా సినిమా విడుదల తేదీని మార్చుతున్నాం. మా భాగస్వాములు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రేక్షకుల అభిప్రాయాలను గౌరవిస్తూ, మనందరి ఆరోగ్యాన్నీ, ఆనందాన్నీ కోరుకుంటూ త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని నిర్మాతలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ''25 ఏళ్లుగా అరణ్యంలో జీవిస్తూ వస్తున్న ఒక వ్యక్తి కథ 'అరణ్య'. ఈ చిత్రంలో పర్యావరణం, అడవుల నరికివేత వంటి అంశాలను చర్చించాం'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. విష్ణు విశాల్, జోయా హుస్సేన్, శ్రియా పిల్గావోంకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: శంతను మొయిత్రా, కెమెరా: ఎ.ఆర్. అశోక్ కుమార్. ఈ చిత్రానికి అసోసియేట్ ప్రొడ్యూసర్: భావనా మానిక.

సూపర్ హీరోకి కరోనా ఎఫెక్ట్


సిల్వెస్టర్ స్టాలోన్

కరోనా దెబ్బకు సూపర్ హీరో కాస్తా వెనక్కి తగ్గాడు. రెండు వారాల పాటు తన యూనిట్‌ని ఇంటిపట్టున ఉంచాలనుకున్నాడు. ప్రముఖ హాలీవుడ్ నటుడు సిల్వెస్టర్ స్టాలోన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న సూపర్ హీరో మూవీ 'సమారిటన్'. ఈ చిత్రం షూటింగ్ గత వారం జార్జియాలో జరిగింది. అయితే కోవిడ్ 19 ఎఫెక్ట్‌కి ఈ సూపర్ హీరో చిత్రం షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చారు. రెండు వారాల తర్వాత పరిస్థితి బాగుంటే అప్పుడు షూటింగ్ మొదలుపెట్టాలనుకుంటున్నారు. ఇందులో సిల్వెస్టర్ స్టాలోన్ పారిశుధ్య కార్మికుడి పాత్ర చేస్తున్నారు. ఆయన ఓ నిర్మాత కూడా. ఓవర్‌లార్డ్ జూలియస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 1న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

కరోనా బారిన పడ్డాను

ఓల్గా కురిలెంకో

గత వారం హాలీవుడ్ నటుడు టామ్ హ్యాంక్స్, ఆయన భార్య, నటి రీటా విల్సన్‌లు చేయించుకున్న పరీక్షల్లో కరోనా సోకిందని తేలింది. ఇప్పుడు మరో హాలీవుడ్ తార ఓల్గా కురిలెంకో కూడా కరోనా బారిన పడ్డారు. ఈ విషయాన్ని స్వయంగా ఓల్గానే తెలిపారు. ''వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. టెస్ట్ చేయిస్తే పాజిటివ్ వచ్చింది. జ్వరం, అలసట కరోనా ప్రధాన లక్షణాలు. ఏముందిలే అనుకోకుండా ఈ లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. ప్రస్తుతం నేను కరోనా కారణంగా గృహనిర్భంధంలో ఉన్నాను. చికిత్స చేయించుకుంటున్నాను'' అని ఓల్గా పేర్కొన్నారు. 2008లో వచ్చిన 'క్వాంటమ్ ఆఫ్ సోలేస్', 2013లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ మూవీ 'ఒబ్లివిన్'లో ఓల్గా నటన ఆకట్టుకుంది. ఆమె నటించిన తాజా చిత్రం 'ఎంపైర్స్ ఆఫ్ ది డీప్' విడుదలకు సిద్ధమవుతోంది. ఇది కాల్పనిక కథతో రూపొందిన యాక్షన్ అడ్వంచరెస్ మూవీ. ఇది కాకుండా ఓల్గా నటించిన 'ది బే ఆఫ్ సైలెన్స్' అనే థ్రిల్లర్ మూవీ కూడా విడుదలకు సిద్ధమవుతోంది.

నాలుగోసారి...

విజయ్

ఎ.ఆర్. మురుగదాస్

కొన్ని కాంబినేషన్స్ చాలా క్రేజీగా ఉంటాయి. అలాంటి కాంబినేషన్స్‌లో సినిమాలు మళ్లీ మళ్లీ రావాలనుకుంటారు ప్రేక్షకులు. తమిళ హీరో విజయ్–దర్శకుడు ఎ.ఆర్. మురుగదాస్‌లది అలాంటి కాంబినేషనే. ఈ ఇద్దరి కాంబోలో 'తుపాకి', 'కత్తి', 'సర్కార్' సినిమాలు విడుదలై బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయాలు నమోదు చేశాయి. ఈ మూడూ పక్కా కమర్షియల్ సినిమాలు. కానీ సందేశం కూడా ఉండేట్లుగా చూసుకున్నారు విజయ్, మురుగదాస్. ఈ క్రేజీ కాంబినేషన్‌లో మరో సినిమా రానుందట. 'సర్కార్' చిత్రాన్ని నిర్మించిన సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. విజయ్ నటించనున్న 65వ చిత్రమిది. ప్రస్తుతం విజయ్ హీరోగా నటించిన 'మాస్టర్' చిత్రం ఆడియో వేడుకను చిత్రబృందం సమక్షంలో జరపాలనుకుంటున్నారు. కరోనా కారణంగా భారీ వేడుక రిస్క్ అని యూనిట్ భావించింది. మోహన్‌రాజా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతానికి సినిమా థియేటర్లు మూతపడ్డాయి. షూటింగ్‌లు ఆగాయి. ఏప్రిల్‌నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో? మరి 'మాస్టర్' చెప్పిన ప్రకారం ఏప్రిల్ 9న వస్తాడా? వాయిదా పడతాడా? చూడాలి.

కొత్త సవాల్

అనుపమా పరమేశ్వరన్

అన్నీ కుదిరితే అనుపమా పరమేశ్వరన్ ఓ లేడీ ఓరియంటెడ్ సినిమాలో నటించబోతున్నారని తెలిసింది.. 'అఆ', 'ప్రేమమ్' చిత్రాల్లో కీలక పాత్రలు చేసి, 'శతమానం భవతి', 'ఉన్నది ఒకటే జిందగీ', 'హలో గురూ ప్రేమ కోసమే' వంటి హిట్ చిత్రాల్లో కథానాయికగా నటించారు ఈ మలయాళ కుట్టి. గత ఏడాది హిట్ మూవీ 'రాక్షసుడు'లో కనిపించిన అనుపమ ప్రస్తుతం ఓ మలయాళ సినిమా, ఓ తమిళ చిత్రం చేస్తున్నారు. త్వరలో ఓ తెలుగు సినిమా సైన్ చేయనున్నారట. ఇది లేడీ ఓరియంటెడ్ మూవీ అని సమాచారం. ఒకవేళ ఈ వార్త నిజమైతే అనుపమ చేయబోతున్న తొలి కథానాయిక ప్రాధాన్యం ఉన్న సినిమా ఇదే అవుతుంది. హనుమాన్ అనే కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారట. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం ఉంటుందని భోగట్టా. ఇప్పటివరకూ చేసినవన్నీ హీరో ఓరియంటెడ్ సినిమాలే అయినా వాటిలో మంచి పాత్రలే చేశారు అనుపమ. తనలో మంచి నటి ఉందని నిరూపించుకున్నారు. ఇప్పుడు లేడీ ఓరియంటెడ్ మూవీ అంటే సవాల్ అయినా అనుపమ ఈ స్టెప్‌లోనూ సక్సెస్ అవుతారని చెప్పొచ్చు. పీవీపీ బేనర్‌లో ఈ సినిమా రూపొందనుందట.

19 నుంచి తమిళ చిత్రాల షూటింగ్స్‌కి బ్రేక్



తెలుగు చిత్రాల షూటింగ్స్‌ని ఆపివేయాలని ఆదివారం తెలుగు ఇండస్ట్రీ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు తమిళ చిత్రాల షూటింగ్స్ కూడా ఆగిపోనున్నాయి. ఈ నెల 19 నుంచి షూటింగ్స్‌ని ఆపివేస్తామని 'ఫెఫ్సీ' (దక్షిణ చలన చిత్ర కార్మికుల సమాఖ్య) సోమవారం ప్రకటించింది. ''భారీ నష్టం జరుగుతుంది. అయితే ఒక సమస్య వచ్చినప్పుడు అందరూ కలిసికట్టుగా ఉండాలి. నిర్ణయాలకు కట్టుబడాలి. మా కార్మికుల క్షేమమే మాకు ముఖ్యం. నిర్మాతలు, సాంకేతిక నిపుణులందరూ మా నిర్ణయాన్ని ఆమోదించి ఈ 19 నుంచి షూటింగ్స్ ఆపివేయాలని విన్నవించుకుంటున్నాం'' అని 'ఫెఫ్సీ' అధ్యక్షుడు, దర్శకుడు ఆర్.కె. సెల్వమణి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. సినిమా షూటింగ్స్ మాత్రమే కాదు టీవీ కార్యక్రమాలు, వాణిజ్య ప్రకటనల చిత్రీకరణను కూడా నిలిపివేయమని కోరారు. మళ్లీ షూటింగ్‌లు ఎప్పుడు మొదలుపెట్టాలన్నది పరిస్థితులను బట్టి నిర్ణయిస్తామని కూడా పేర్కొన్నారు. కరోనా కారణంగా ఇప్పటికే విక్రమ్ 'కోబ్రా', అజిత్ 'వలిమై', శింబు 'మానాడు' చిత్రాల విదేశీ షెడ్యూల్స్ రద్దయ్యాయి. అన్ని చిత్రాల షూటింగ్స్ నిలివేయాలని సోమవారం తీసుకున్న నిర్ణయంతో ఇక్కడ తెలుగు స్టూడియోలు ఖాళీగా ఉన్నట్లే తమిళ స్టూడియోలు కూడా ఖాళీగా ఉండబోతున్నాయి.

ఏప్రిల్‌లో పెళ్లి

అలీ ఫజల్, రిచా చద్దా

నాలుగేళ్ల ప్రేమను పెళ్లి వరకూ తీసుకెళ్లడానికి బాలీవుడ్ నటుడు అలీ ఫజల్, నటి రిచా చద్దా రెడీ అయిపోయారు. రిజిస్టర్ ఆఫీసులో పెళ్లి చేసుకుని, ఆ తర్వాత బంధువులు, సన్నిహితుల సమక్షంలో పెళ్లి వేడుకలు చేసుకుంటారట. అందుకని రిజిస్ట్రేషన్ కోసం ముంబై కోర్టులో అప్లికేషన్ పెట్టుకున్నారని సమాచారం. ఏప్రిల్ చివరి వారంలో పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారని ఇద్దరి సన్నిహితులు పేర్కొన్నారు. 2017లో 'ఫక్రీ రిటర్న్స్'లో ఈ ఇద్దరూ జంటగా నటించారు. ఆ సమయంలోనే ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. రిచా పంజాబీ అమ్మాయి. అలీది ఉత్తర్‌ప్రదేశ్. పెద్దల అంగీకారంతోనే వీరి పెళ్లి జరగనుంది.

మంచి టర్న్

పవన్ కుమార్

కొన్ని సినిమా కథలు ఎలాంటి మలుపులు తీసుకుంటాయో ఊహించలేం. 'యు–టర్న్' సినిమా కథ అలాంటిదే. ఈ కథలో వచ్చిన మలుపులను ప్రేక్షకులు ముందే ఊహించలేకపోయారు. అంత పకడ్బందీగా ఆ కథ రాసుకున్నారు చిత్రదర్శకుడు పవన్ కుమార్. అందుకే కన్నడంలో హిట్ అయిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రీమేక్ అయి, రెండు భాషల్లోనూ హిట్ అయింది. ఇప్పుడు 'యు–టర్న్' మరో మంచి టర్న్ తీసుకోబోతోంది. ఈ చిత్రం ఫిలిపైన్ భాషలో రీమేక్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు పవన్ కుమార్ మాట్లాడుతూ – ''మా 'యు–టర్న్' ఫిలిపైన్‌లో రీమేక్ కానుంది. కిమ్ చియు, జెఎమ్‌డి గుజ్‌మ్యాన్, టోనీ లబ్రుస్కా ఈ చిత్రాన్ని రీమేక్ చేయబోతున్నారు. ఫిలిపైన్ దర్శకుడు డెరిక్ కాబ్రిడో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తారు. మనం తీసిన సినిమా ఇతర భాషల్లో రీమేక్ అవుతోందంటే చాలా ఆనందంగా ఉంటుంది. పైగా దర్శకుడిగా కన్నా ఈ కథ రాసినందుకు రచయితగా ఎక్కువగా ఆనందపడుతున్నా. ఎందుకంటే ఈ కథ రాస్తున్నప్పుడు లోకల్ స్టోరీ అనుకుని రాశాను. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రానికి రీచ్ ఉంటుందనుకోలేదు. గత నెల సింహళ భాషలో ఈ చిత్రం రీమేక్ అయింది. ఇంకా థాయ్, చైనీస్ భాషల్లోనూ రీమేక్ కానుంది. విశేషం ఏంటంటే.. ఈ సినిమాని రీమేక్ చేస్తారా? అని మా అంతటమేం ఎవరినీ అడగలేదు. సినిమా చూసి రీమేక్ చేయడానికి వాళ్లంతట వాళ్లే ముందుకొచ్చారు'' అన్నారు. ''భారతీయ సినిమాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయి. మేం రీమేక్ చేయబోతున్న 'యు–టర్న్' మా ఫిలిపైన్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని నమ్ముతున్నాం'' అన్నారు చిత్రనిర్మాతలు.

కల్పిత పాత్రలతో...

మేఘన, పవన్‌తేజ్

పవన్ తేజ్ కొణిదెల హీరోగా, మేఘన, లక్కీ హీరోయిన్లుగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఈ కథలో పాత్రలు కల్పితం'. అభిరామ్ ఎం. దర్శకత్వం వహిస్తున్నారు. మాధవి సమర్పణలో ఎంవీటీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాజేష్ నాయుడు నిర్మిస్తున్నారు. రాజేష్ నాయుడు మాట్లాడుతూ– ''థ్రిల్లింగ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. టైటిల్ ప్రకటించినప్పటి నుంచి మా సినిమాకి పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. మంచి విజన్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునే థ్రిల్లింగ్ అంశాలతో అభిరామ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పవన్ తేజ్ కొణిదెలకి ఒక పర్ఫెక్ట్ లాంచింగ్ అవుతుంది. 'జెస్సీ', 'ఓ పిట్టకథ' సినిమాలకి పనిచేసిన సునీల్ కుమార్ విజువల్స్, 'ఆర్ఎక్స్ 100', 'కల్కి' చిత్రాల ఫేమ్ తాజుద్దీన్ సయ్యద్ మాటలు ఈ చిత్రానికి హైలెట్‌గా నిలుస్తాయి. త్వరలోనే టీజర్, పాటల విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం. సినిమా విడుదల తేదీని కూడా త్వరలో ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కృష్ణ పామర్తి, లైన్ ప్రొడ్యూసర్: దుర్గా అనీల్ రెడ్డి.

రఘుపతి వెంకయ్య నాయుడు ఫిల్మ్ నగర్‌గా మార్చాలి

''తెలుగు సినిమా పరిశ్రమ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన రఘుపతి వెంకయ్య నాయుడు పేరును ఫిల్మ్‌నగర్‌కి చేర్చి 'రఘుపతి వెంకయ్యనాయుడు ఫిల్మ్ నగర్'గా మార్చాలి'' అని 'రఘుపతి వెంకయ్య అకాడమీ' సభ్యులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఫిల్మ్ చాంబర్ ఎదుట ఉన్న రఘుపతి వెంకయ్య నాయుడు విగ్రహం వద్ద ఆయన 79వ వర్ధంతిని 'రఘుపతి వెంకయ్య అకాడమీ' ఆధ్వర్యంలో నిర్వహించారు. ''ఇక నుంచి ప్రతి సంవత్సరం మార్చి 15న రఘుపతి వెంకయ్యగారి వర్ధంతిని, అక్టోబర్ 15న జయంతిని ఘనంగా జరుపుతాం'' అని 'రఘుపతి వెంకయ్య అకాడమీ' సభ్యులు పేర్కొన్నారు. ''ఫిల్మ్‌చాంబర్ వద్ద రఘుపతి వెంకయ్య నాయుడుగారి విగ్రహాన్ని బాగు చేయించి, దాని చుట్టూ ఫెన్సింగ్, గొడుగు, నిచ్చెనలాంటి వాటిని ఏర్పాటు చేయడానికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందిస్తా'' అని మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో 'రఘుపతి వెంకయ్య అకాడమీ' నూతన అధ్యక్షుడు యన్.గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు పి.విజయ వర్మ, ప్రధాన కార్యదర్శి జె.వి. మోహన్ గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాబ్జీ, సహాయ కార్యదర్శి యస్.ఏ.ఖుద్దూస్, కోశాధికారి తుమ్మలపల్లి రామసత్యనారాయణ, కమిటీ సభ్యులు గాంధీ, జమా, హనుమంతరావు తదితరులు వెంకయ్యనాయుడి సేవలను కొనియాడారు.

సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 17-3-2020
ఉత్తరాభాద్ర కార్తె : మార్చి 18 నుంచి

ఆకులు పోషకాల గనులు. భూమిని సారవంతం చేయడానికి తోడ్పడే అద్భుత సాధనాలు. ప్రతి ఆకూ రూ.5తో సమానమని గుర్తెరగాలి. ఆకులను తగులబెట్టకుండా భూమికి చేర్చాలి.

– దివంగత డా. ఎల్. నారాయణరెడ్డి, ప్రసిద్ధ రైతు శాస్త్రవేత్త, దొడ్డబళ్లాపూర్, కర్ణాటక

కంపోస్టు కథలు-1

ఎండాకులు ఛలో ఎరువు!

నవంబర్ నుంచి దాదాపు ఏప్రిల్ వరకు మన చుట్టూతా ఉండే చెట్లు ఆకులను రాల్చుతూ ఉంటాయి. పొద్దున్న లేచేటప్పటికల్లా వాకిలి నిండా, ఇంటి ఆవరణలో, చెట్ల పక్కనున్న ఇంటి పైకప్పుల మీద, కాలనీల్లో రోడ్ల మీద, పార్కుల్లో.. ఎక్కడ చూసినా ఆకులే.. ఆకులు.. రాలిన ఆకులు! ఈ ఆకులను చక్కని కంపోస్టు ఎరువుగా మార్చుకోవచ్చని తెలిసినా.. నిర్లక్ష్యం కొద్దీ ఆకులను కుప్పజేసి నిప్పు పెట్టడమో లేదా చెత్తను మోసుకెళ్లే మున్సిపాలిటీ వాళ్ల నెత్తిన వెయ్యడమో చేస్తున్నాం.. అయితే, స్వల్ప ప్రయత్నంతోనే ఈ ఎండాకులను అమూల్యమైన సహజ ఎరువుగా మార్చుకోవచ్చని ఓ మహిళ ఎలుగెత్తి చాటుతున్నారు. మహారాష్ట్రలోని పుణే నగరవాసి అదితి దేవ్‌ధర్ 'బ్రౌన్‌లీఫ్' పేరిట ఏకంగా ఓ సామాజిక ఉద్యమాన్నే ప్రారంభించి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. ఈ స్ఫూర్తి కథనంతో 'కంపోస్టు కథలు' సిరీస్‌ను ఈ వారం ప్రారంభిస్తున్నాం..

● తమ ఇంటి ఆవరణలో సేకరించిన ఎండాకులతో అదితి దేవ్‌ధర్

పచ్చని చెట్లంటే మనందరికీ ఇష్టమే. అందుకే పొలాల గట్లమీద, పడావుభూముల్లో, ఇంటి దగ్గర, ఊళ్లు / కాలనీల్లో రోడ్ల పక్కన, పార్కుల్లో.. ఇష్టపడి పచ్చని చెట్లను పెంచుకుంటూ ఉంటాం. అయితే, ఆ చెట్లు రాల్చే ఆకుల్ని ఏం చేయాలి? ఊడ్చి మున్సిపాలిటీ వ్యాన్‌లో వేస్తున్నారు లేదా కుప్ప చేసి నిప్పు పెడుతున్నారు. ఈ రెండూ మంచి పనులు కాదు. పనిగట్టుకొని మొక్కలు నాటి పచ్చని చెట్లని పెంచుతున్న వారు సైతం నాకెందుకులే అనో.. ఓ రకమైన నిరాసక్తతతోనో, నిర్లక్ష్యంతోనో చూస్తూ ఊరుకుంటున్నారు.

● ఆకులను తగులబెట్టడం అనర్థదాయకం

కానీ, అదితి దేవ్‌ధర్ ఊరుకోలేదు. తమ ఇంటి ఆవరణలో పెద్ద చెట్లు రాల్చే ఆకులు పోగు పడుతూ ఉంటే.. ఆ ఆకులను నిప్పు పెట్టి వాయుకాలుష్యాన్ని పెంచి ప్రజారోగ్యానికి ముప్పు తేవడానికి గానీ, మున్సిపాలిటీ వాళ్లకు ఇచ్చి డంపింగ్ యార్డులో చెత్తదిబ్బలను కొండలుగా పెంచడానికి గానీ ఆమె ఒప్పుకోలేదు. తానే చొరవతో ఎండాకుల సమస్యకు పరిష్కారం వెదికారు.

బ్రౌన్‌లీఫ్ ఛాలెంజ్ తీసుకున్నారు. నలుగురినీ కూడగట్టారు. ఒక్క ఎండాకునూ తగులబెట్టనియ్యకూడదని ప్రతిన బూనారు. నాలుగేళ్లుగా ఎండాకులను తగులబెట్టకుండా చూస్తున్నారు. ఎండాకులతో కంపోస్టు తయారు చేసుకునే పద్ధతులను ప్రచారం చేస్తున్నారు. ఆ కంపోస్టుతో చక్కని సేంద్రియ ఇంటిపంటలు పండించుకోవడానికి దోహదం చేస్తూ మరెందరికో ప్రేరణగా నిలుస్తున్నారు. కంగ్రాట్స్ టు అదితి!

● ఎండాకులను కంపోస్టు చేసే పద్ధతి

ఆకులను తగులబెడితే ఏమవుతుంది?

ఎండాకులను తగులబెట్టినప్పుడు ధూళి కణాలు గాలిలో కలుస్తాయి. భూతాపాన్ని పెంచే కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సయిన్, మిథేన్ వంటి వాయువులు విడుదలవుతాయి. ఇవి శ్వాసకోశ వ్యాధులనూ కలిగిస్తాయి. చెట్లు రాల్చే ఆకులు.. భూమికి చెట్లు కృతజ్ఞతగా తిరిగి ఇస్తున్న పోషకాలు. ప్రకృతిలో, అడవిలో రాలిన ఆకులు దొంతర్లుగా పేరుకొని భూమికి ఆచ్ఛాదన కల్పిస్తున్నాయి. వర్షానికి తడిచిన ఆకులు కుళ్లి భూమిని సారవంతం చేస్తాయి. కంపోస్టు చేయడం ద్వారా ఈ ప్రక్రియకు దోహదపడటం మన కర్తవ్యం.

(వచ్చే వారం: లీఫ్ కంపోస్టర్‌ను తయారు చేసుకోవడంతోపాటు కంపోస్టు మెళకువలు నేర్చుకుందాం)

1 ఆచ్ఛాదన (మల్చింగ్) చెయ్యండి: ఎండాకులను మొక్కలు, చెట్ల దగ్గర నేలపై ఎండ పడకుండా మల్చింగ్ చేయాలి. ఎండ నేరుగా నేలకు తగలకుండా ఆకులతో ఆచ్ఛాదన కల్పిస్తే మట్టిలో ఉండే సూక్ష్మజీవులు, వానపాములకు మేలు జరుగుతుంది. కాలక్రమంలో ఆకులు కుళ్లి భూమిని సారవంతం చేస్తాయి.

2 కంపోస్ట్ చెయ్యండి: ఎండాకులను కుళ్లబెట్టి కంపోస్టు తయారు చేయండి. కంపోస్టు చేయడానికి మూడు పద్ధతులు ఉన్నాయి. ఎ) ఇంటి ఆవరణలో ఒక మూలన గుంత తవ్వి ఆకులను అందులో వేయటం. బి) ఇనుప మెష్‌తో ట్రీగార్డు మాదిరిగా గంపను తయారు చేసి అందులో ఎండాకులు వేసి ఎక్కడికక్కడే కంపోస్టు తయారు చేయడం. సి) ఎండాకులను కుప్పగా పోసి కూడా కంపోస్టు చెయ్యొచ్చు. ఈ మూడు పద్ధతుల్లోనూ ఆకులను తేమగా ఉండేలా నీరు పోస్తుండాలి. పేడనీరు లేదా జీవామృతం లేదా వేస్ట్ డీ కంపోజర్ ద్రావణం లేదా లాక్టిక్ ఆసిడ్ బాక్టీరియా ద్రావణం లేదా పుల్లమజ్జిగ వంటి సేంద్రియ పదార్థాన్ని కుళ్లింపజేసే సూక్ష్మజీవరాశి ఉండే కల్చర్‌ను కలపాలి

3 ఇతరులకివ్వండి: పట్టణాలు, నగరాలలో నివసించే వారు ఇంటి దగ్గర లేదా కాలనీ రోడ్లపై లేదా పార్కుల్లో చెట్లు రాల్చే ఆకులను కంపోస్టు చేసే ఉద్దేశం లేకపోతే వాటిని కంపోస్టు చేసుకోదలచిన వారికి అందించడం ఉత్తమం. పుణే వాసులు ఎండాకులను ఇచ్చి పుచ్చుకోవడానికి వీలుగా అదితి బ్రౌన్‌లీఫ్ పేరుతో వాట్సప్‌గ్రూప్, ఫేస్‌బుక్ ఖాతాతోపాటు వివరంగా చర్చించేందుకు వెబ్‌సైట్‌ను సైతం ప్రారంభించారు. తొలి ఏడాదే 500 బస్తాల ఎండాకులను ప్రజలు ఇతరులకు అందించారట. సోషల్ మీడియా ద్వారా సామాజికోద్యమం ప్రారంభించి ఉండకపోతే ఈ ఆకులన్నిటినీ తగులబెట్టి ఉండేవారని, ఇప్పుడు ఇలా సద్వినియోగం అయ్యాయని ఆమె సంతోషంగా చెబుతారు. అయితే, రెండో ఏడాదికి ఆకులను ఇతరులకిస్తాం అనే వారు లేకుండా పోయారట. అంటే అందరూ కంపోస్టు తయారు చేసుకోవడం, దానితో కుండీలలో సేంద్రియ ఇంటిపంటలు పండించడం ప్రారంభించారన్న మాట!

వైరస్‌ను జయించిన మిరప వంగడాలు

● క్షేత్రప్రదర్శనలో మిరప తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

మిరప.. ఉద్యాన పంటల్లో ప్రధానమైనది. దేశవ్యాప్తంగా 8 లక్షల హెక్టార్లలో సాగవుతుంటే, ఇందులో 20-22 శాతం ఆంధ్రప్రదేశ్‌లో పండిస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం విస్తీర్ణంలో 40 శాతంతో గుంటూరు జిల్లా అగ్రభాగాన నిలుస్తోంది. మిరపకు వెరసల బెడద అధికమన్న సంగతి తెలిసిందే. జెమిని వైరస్ / బొబ్బర తెగులు అనే పేర్లతో వ్యవహరిస్తున్న వైరస్ కొన్నేళ్లుగా మిర్చి రైతులను బెంబేలెత్తిస్తోంది. వైరస్ ఆశించిన చేలో పంటపై రైతు ఆశలు వదిలేసుకోవాల్సిందే. లేదా నిత్యం పంటచేలోనే ఉంటూ రకరకాల మందుల పిచికారీతో నిరంతరం యుద్ధమే చేస్తుంటారు.

ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి

జెమిని వైరస్ / బొబ్బర తెగులును నూరు శాతం తట్టుకొని, ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడిని సాధించే మిరప రకాలు రూపొందించడానికి నాలుగైదేళ్లుగా మేం చేసిన కృషి ఫలితంచింది. ఈ వంగడాలు మా పరిశోధన స్థానంలో 20-25 క్వింటాళ్ల దిగుబడిని నమోదు చేశాయి. రాబోయే సీజన్లో వీటిని సాగు చేయాలని భావించే రైతులు లాం ఫారంలో తమను సంప్రదిస్తే.. చిరుసంచుల రూపంలో రైతుకు 25 గ్రాముల విత్తనాలను ఇస్తాం.

– డా. సి.వెంకట రమణ, సీనియర్ శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన కేంద్రం, లాం ఫారం, గుంటూరు

ఎల్‌సీఏ-657

మొక్కలు ఎత్తుగా, దృఢమైన కాండంతో 3-4 బాగా నిటారుగా ఉండే కొమ్మలతో పెరుగుతాయి. ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుతో మందంగా అనిపిస్తాయి. కాయలు ముదురు ఆకుపచ్చ రంగుతో మంచి నిగారింపుతో ఉంటాయి. ఎండుకాయలు మంచి ప్రకాశవంతమైన ఎరుపు రంగుతో, ఎక్కువ కారంగా ఉంటాయి. జెమిని వైరస్/ బొబ్బర/ మిరప ఆకుముడుత వైరస్‌ను తట్టుకుంటుంది. నీటి ఎద్దడిని కూడా తట్టుకోగలదు.

ఎల్‌సీఏ-680

ఈ రకం మిర్చి మొక్కలు ఎక్కువ కొమ్మలతో గుబురుగా పెరుగుతాయి. ఆకులు ఎక్కువగా ఉండి, కాయలన్నీ ఆకులతో కప్పబడినట్టుగా ఉంటాయి. కాయలు లావుగా ఉండి ఆకుపచ్చ రంగు కలిగి ఉంటాయి. పచ్చి మిరప సాగుకు అనువైన రకం. ఎండుకాయ మంచి రంగుతో నిగారింపుతో, మధ్యస్థ కారంగా ఉంటుంది. జెమిని వైరస్/ బొబ్బర/ మిరప ఆకుముడత వైరస్‌ను తట్టుకుంటుంది.

ఎల్‌సీఏ-684

ఈ రకం మిరప మొక్కలు ఎక్కువ కొమ్మలతో ఒక మోస్తరు గుబురుగా కనిపిస్తాయి. కాయలు ఆకుపచ్చ రంగులో సన్నగా 9-10 సెం.మీ పొడవుగా ఉంటాయి. పచ్చి కాయలు పక్వతకు వచ్చినపుడు మెరూన్ రంగులో ఉన్నా తర్వాత ఆకర్షణీయమైన ఎరుపు రంగుకు మారతాయి. ఎండుకాయలో ముడతలు స్వల్పంగా ఉండి, ఎక్కువ కారంగా ఉంటాయి. జెమిని వైరస్/ బొబ్బర/ ఆకుముడత వైరస్‌ను తట్టుకునే రకం.

ఈ నేపథ్యంలో ఈ వైరస్‌ను తట్టుకొనే 3 మిర్చి వంగడాలను గుంటూరులోని లాం ఉద్యాన పరిశోధన కేంద్రం రూపొందించటం విశేషం. ఈ కేంద్రం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.హరిప్రసాదరావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సి.వెంకటరమణ సారధ్యంలో జెమిని వైరస్/ బొబ్బర తెగులును తట్టుకోగలిగిన మిరప రకాలు ఎల్‌సీఏ-657, ఎల్‌సీఏ-680, ఎల్‌సీఏ-684లను రూపొందించారు.

చిరుసంచుల రూపంలో రైతులకు అందజేసి 2019-20 సీజనులో సాగు చేయించారు. చేబ్రోలు మండలం శలపాడులోని దొడ్డపనేని సాంబశివరావు చేలో పండించిన ఈ మూడు రకాలపై ఇటీవల క్షేత్రప్రదర్శన నిర్వహించారు.

గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ చిరంజీవ్ చౌరది, విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి అతిథులుగా హాజరయ్యారు.

మిరప సాగులో హైబ్రిడ్ విత్తనాలు స్వైర విహారం చేస్తున్న ఈ కాలంలో విడుదలైన నూతన సూటి రకం వంగడాలు రైతులకు మేలుచేస్తాయని శాస్త్రవేత్తలు, రైతులు అంటున్నారు. విత్తనాలను ప్రతి ఏటా కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా.. రైతు పండించిన పంట నుంచి సేకరించిన విత్తనాలను తిరిగి వాడుకోవచ్చు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి, గుంటూరు జిల్లా

తెల్లదోమ విజృంభణ

'నల్ల'బోతున్న కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలు

● తెల్లదోమ ఆశించిన కొబ్బరి మొక్క

సర్పిలాకార తెల్లదోమ దెబ్బకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉద్యానతోటలు అతలాకుతలమవుతున్నాయి. మరీ ముఖ్యంగా కొబ్బరి, ఆయిల్ పామ్ తోటలను ఇది పీల్చి పిప్పి చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం పూల మొక్కలకు ప్రసిద్ధిగాంచిన కడియం నర్సరీలనూ తెల్లదోమ చుట్టుముట్టింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల రైతాంగంతోపాటు తెలంగాణలోని సత్తుపల్లి ప్రాంత కొబ్బరి, ఆయిల్ పామ్ రైతులను సైతం కలవరపెడుతోంది. దీనిని ఎదుర్కొనేందుకు అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఉద్యాన శాఖ సమీక్షలో ఆదేశాలిచ్చారు. ఇప్పటికే ఈ పనిలో నిమగ్నమైన అధికార యంత్రాంగం సీఎం ఆదేశాలతో నివారణ చర్యలను ఉధృతం చేసింది.

రూగోస్ తెల్లదోమ ఇలా వ్యాపిస్తుంది

- వలయాకారపు తెల్లదోమ (రూగోస్) ప్రధానంగా గాలి ద్వారా తొలుత కొబ్బరి, ఆయిల్ పామ్ చెట్లను ఆశిస్తుంది. వీటిలో చక్కెర ఎక్కువ ఉండటమే దీనికి ప్రధాన కారణం.
- అక్కడి నుంచి జామ, మామిడి, పూలు, అలంకరణ మొక్కలను ఆశిస్తుంది.
- ఆకులో ఉండే పత్ర హరితాన్ని హరిస్తుంది.
- ఆకుల నుంచి రసాన్ని పీల్చి వేసి మైనం లాంటి తెల్లటి పదార్థాన్ని విసర్జిస్తుంది. దానిపై 'కాప్నోడియం' అనే బూజు పెరిగి.. ఆకుపై నల్లటి పొర ఏర్పడుతుంది. దీని వల్ల సూర్యరశ్మి అందక కిరణజన్య సంయోగ క్రియ స్తంభించి చెట్టు పూర్తిగా నీరసించిపోతుంది.
- కొబ్బరిలో 40 శాతం, ఆయిల్ పామ్‌లో 35 శాతం దిగుబడి తగ్గిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- తెల్లదోమను పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదని, నివారణే మార్గమంటున్నారు.

● తెల్లదోమ తీవ్రతకు పచ్చని కొబ్బరి ఆకులు ఇలా అయిపోతాయి

ఎక్కడెక్కడ ఉందంటే..?

- తూర్పు, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని కొబ్బరి తోటల్ని, ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాల్లోని వేలాది ఎకరాల ఆయిల్ పామ్ తోటల్ని ఇది ఆశించింది.
- తెలంగాణలోని సత్తుపల్లి ప్రాంతంలో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్ని కూడా తెల్లదోమ ఆశించింది.
- కడియం నర్సరీలలో కొబ్బరి, ఆయిల్ పామ్, జామ, అలంకరణ మొక్కలను సైతం తెల్లదోమ కమ్మేసింది.
- 1.60 లక్షల ఎకరాల కొబ్బరిని, అదే స్థాయిలో ఆయిల్ పామ్ తోటల్ని ఇది ఆశించినట్టు అనధికారిక అంచనా.

– ఎ. అమరయ్య, సాక్షి బ్యూరో, అమరావతి

సమగ్ర యాజమాన్యంతోనే తెల్లదోమకు చెక్



● రుగోస్ తెల్లదోమ

- సర్పిలాకార తెల్లదోమ సోకితే రసాయనిక పురుగుమందులు చల్లటం తగదు. వీటిని చల్లితే మిత్రపురుగులు నశించి తెల్లదోమ రెండు-మూడు రెట్లు విజృంభిస్తుంది. అందువలన అవాంఛిత పురుగుమందుల వాడకం నివారించి మిత్రపురుగులను పెంచుకోవాలి.
- జీవ నియంత్రణతో తెల్లదోమను అదుపు చేయొచ్చు.
- కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో పసుపు రంగు టార్పలిన్ అట్టలను ఎకరానికి 10 నుంచి 15 చొప్పున (1 మీ.× 1 మీ. విస్తీర్ణం) అతికించి, వాటికి ఆముదం పూసి, తెల్లదోమ తల్లి పురుగులను ఆకర్షించి, చంపాలి.
- వీటి ద్వారా దోమను పూర్తిగా అదుపు చేయకున్నా.. ఒక తల్లి దోమను చంపడం ద్వారా 100 పిల్ల దోమలను నిరోధించవచ్చు.
- తెల్లదోమ సోకిన మొక్కలను ఒక చోట నుంచి మరొక చోటకు తరలించకూడదు.
- డైకోక్రైసా ఆస్టర్ పురుగు తెల్లదోమ గుడ్లను తినేస్తుంది. డైకోక్రైసా ఆస్టర్ సంతతి వృద్ధికి దాని గుడ్లను తెల్లదోమ ఆశించిన తొలి దశలోనే చెట్ల ఆకులకు పిన్ చేసుకోవాలి. వీటిని అంబాజీపేటలోని కొబ్బరి పరిశోధనా స్థానంలోనే దేశంలోకెల్లా మొట్టమొదటి సారిగా ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఏడాది 15 లక్షల గుడ్లను ఉత్పత్తి చేసి రైతులకు అందించారు. దేశవ్యాప్తంగా రోజుకు 3-4 లక్షల గుడ్లకు డిమాండ్ ఉంది. వచ్చే ఏడాది నుంచి రోజుకు లక్ష గుడ్ల ఉత్పత్తికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- మిత్రపురుగైన ఎన్‌కర్సియా గ్వడెలోపే అనే బదనికలు ఈ తెల్లదోమలను అదుపులో ఉంచుతాయి. ఈ పురుగును ప్రయోగశాలలో ఉత్పత్తి చేసే అవకాశం లేదు. సహజ సిద్ధంగా కొబ్బరి తోటల్లో ఈ మిత్ర పురుగులు అభివృద్ధి చెందుతుంటాయి. అక్కడి నుంచి సేకరించి తెల్లదోమ ఆశించిన ప్రాంతాల్లో విడుదల చేయాలి.
- రిజర్వాయర్ మొక్కలు / బ్యాంకర్ మొక్కలను పెంచడం వలన ఎన్‌కార్సియా గ్వడెలోపే సంతతి పెరుగుతుంది.
- పురుగు స్థాయి ఎక్కువగా ఉండి మిత్రపురుగులు లేకపోతే, 1 శాతం వేపనూనెకు 10 గ్రా. డిటర్జెంట్ పౌడర్ కలిపి ఆకు అడుగు భాగాలు పూర్తిగా తడిచేలా 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- ఐసోరియ ఫ్యూమోసోరోసే అనే రకం కీటకాలను అరికట్టే శిలీంధ్రాన్ని లీటరు నీటికి 5 గ్రాముల స్పోర్స్ సాంద్రత 1×10^8గా ఉండాలి చొప్పున కలిపి తయారు చేసుకున్న శిలీంధ్ర ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయడం ద్వారా తెల్లదోమను అదుపులోకి తేవచ్చు. శిలీంధ్రం సాంద్రత తగినంత లేకపోతే ఫలితాలు పాక్షికంగానే వస్తాయి. ఒక ప్రాంతంలో రైతులందరూ కలిసికట్టుగా చేయాల్సి ఉంటుంది. శిలీంధ్ర ద్రావణాన్ని తయారు చేసుకునే పద్ధతిని అంబాజీపేట లోని కొబ్బరి పరిశోధనా కేంద్రంలో రైతులకు శిక్షణ ఇవ్వడంతోపాటు మదర్ కల్చర్‌ను కూడా పంపిణీ చేస్తున్నారు.
- నీటికి కొరత లేకపోతే.. నీటిలో డిటర్జెంట్ పౌడర్ కలిపి తెల్లదోమ ఆశించిన మొక్కలపై 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- పగటి ఉష్ణోగ్రత పెరగేకొద్దీ తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది. 40 డిగ్రీల సెల్షియస్‌కు పెరిగేటప్పటికి తగ్గుతుంది.
- రైతులు సామూహికంగా నివారణ చర్యలు చేపడితే సర్పలాకార తెల్లదోమను సమర్థవంతంగా అరికట్టవచ్చు.

● తెల్లదోమ గుడ్లను తింటున్న డైకోక్రైసా ఆస్టర్ పురుగు

● ఐసోరియా శిలీంధ్రం

– డా. ఎన్‌బీవీ చలపతిరావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఉద్యాన పరిశోధన స్థానం, డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, అంబాజీపేట, తూ.గో. జిల్లా

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com
మంగళవారం
17-3-2020

చేతి రాత.. మార్కులకు చేయూత



» పరీక్షల్లో మార్కుల సాధనకు కీలకంగా మారుతున్న చేతి రాత
» ముత్యాల్లాంటి అక్షరాలతో మూల్యాంకన చేసే వారిని ఆకట్టుకునే అవకాశం
» కొట్టివేతలు లేకుండా పొందికగా రాయాలంటున్న నిపుణులు

పదో తరగతి నుంచి.. పీజీ వరకు.. పరీక్షల సమయం ఆసన్నమైంది! ఏడాది పాటు చదివిన సబ్జెక్ట్‌లను.. పొందిన నైపుణ్యాన్ని.. మూడు గంటల్లో సమాధాన పత్రంలో ప్రతిబింబించాలి! విద్యార్థులు రాసే సమాధానాలే.. మూల్యాంకన చేసే వారికి.. విద్యార్థుల నాలెడ్జ్‌ను గుర్తించేందుకు దోహదం చేస్తాయి! మరోవైపు.. సమాధానాలు రాసే క్రమంలో.. అత్యంత ప్రాధాన్యమైనదిగా నిలుస్తున్న అంశం.. చేతిరాత! సమాధాన పత్రంలో చేతిరాత ఎంత బాగుంటే.. అంతగా ఆకట్టుకునే అవకాశం ఉంటుంది! తద్వారా.. టాప్ మార్కులు సొంతం చేసుకునేందుకు ఆస్కారం లభిస్తుంది! ఎందుకంటే.. విద్యార్థులు సరైన సమాధానాలు రాసినా.. చేతిరాత అర్థం కాకుంటే.. ఆ సమాధాన పత్రాన్ని చదివి మార్కులు వేయాలనే ఆసక్తి ఉండదు. ప్రస్తుత పరీక్షల సమయంలో టాప్ మార్కుల సాధనలో చేతి రాత, సమాధానాల ప్రజెంటేషన్ ఎలా ఉండాలో తెలుసుకుందాం...

✦ 'పేపర్ ఎంతో తేలిగ్గానే వచ్చింది. అన్నింటికీ సమాధానాలు రాసాను. నూటికి నూరు మార్కులు గ్యారెంటీ' అని ఒక విద్యార్థి అనుకుంటాడు. కానీ.. ఫలితాల తర్వాత మార్కులు చూసుకుంటే ఆశించిన విధంగా నూటికి నూరు మార్కులకు బదులు 80 మార్కులే వస్తాయి.

✦ 'ప్రశ్నలు సులభంగానే ఉన్నాయి. కానీ.. సమయం సరిపోలేదు. రెండు ప్రశ్నలను వదిలేయాల్సి వచ్చింది' -ఇది మరో విద్యార్థి నుంచి వినిపించే మాట!

✦ ఈ రెండు ఉదంతాలకు మూలం.. చేతిరాత, ప్రజెంటేషన్ నైపుణ్యాలు. మొదటి సందర్భంలో నూటికి నూరు మార్కులు వస్తాయనుకున్న విద్యార్థికి 80 మార్కులే రావడానికి కారణం.. అతని చేతి రాత, ప్రజంటేషన్ నైపుణ్యాలు ఆశించిన స్థాయిలో లేకపోవడమే. రెండో సందర్భంలో విద్యార్థికి సమయం సరిపోకపోవడానికి కారణం..సమాధానాలు రాసే క్రమంలో దేనికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి, దేనికెంత సమయం కేటాయించాలో తెలియని పరిస్థితి. ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఏంటి?! అందమైన చేతిరాత, మూల్యాంకనం చేసే వారిని ఆకట్టుకునేలా పొందికగా సమాధానాలు పేపర్‌పై పొందుపర్చడమే అంటున్నారు నిపుణులు!!

పదోతరగతి పరీక్షలైనా.. పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయినా.. సమాధాన పత్రంలో చేతిరాత చూడముచ్చటగా ఉంటే పేపర్ దిద్దేవారికి మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. సమాధానం ఆసాంతం చదివి ఎక్కువ మార్కులు ఇవ్వాలనే ఆసక్తి కలుగుతుంది. ముఖ్యంగా లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లు, వ్యాసరూప సమాధానాల విషయంలో చేతిరాత ప్రాముఖ్యం ఎక్కువగా ఉంటుంది. చేతిరాత బాగుంటే అదనంగా కొన్ని మార్కులు సొంతం చేసుకోవచ్చు. ఇది ఒకరకంగా అదనపు ఆయుధం. అంటే.. సబ్జెక్ట్ పరిజ్ఞానానికి చక్కటి చేతిరాత తోడైతే పది మార్కులు వచ్చే చోట అదనంగా మరో రెండు, మూడు మార్కులు పొందొచ్చు.

ముత్యాల్లాంటి అక్షరాలు

సమాధాన పత్రంలో విద్యార్థులు రాసే సమాధానాలు సదరు ప్రశ్నకు కచ్చితంగా సరితూగే విధంగా ఉన్నప్పటికీ.. ముత్యాల్లాంటి అక్షరాలతో మూల్యాంకన చేసే వారిని ఆకట్టుకుంటే మరిన్ని మార్కులు సొంతమవుతాయి. అలా కాకుండా.. మనకు సమాధానం తెలిసిన ప్రశ్నే వచ్చింది.. త్వరగా పూర్తి చేద్దాం అనే ధోరణితో రాస్తే.. గజిబిజి చేతి రాతను అర్థం చేసుకోలేక పేపర్‌ను దిద్దాలంటే విసుగుపుట్టే ఆస్కారముంది. కాబట్టి మూల్యాంకన చేసే వారికి మన సమాధానాలు అర్థమయ్యేలా కొట్టివేతలు లేకుండా ఆకట్టుకునే విధంగా రాయాలి. ఇందుకోసం అక్షరాలను పొందికగా అమర్చాలి. గుండ్రటి అక్షరాలు, ఒక పదానికి మరో పదానికి మధ్య కొంత గ్యాప్ ఇవ్వడం వంటివి చేయాలి. ఫలితంగా మూల్యాంకనం చేసే వారికి సదరు పేపర్‌ను దిద్దాలనే ఆసక్తి కలుగుతుంది. వాస్తవానికి ప్రతిరోజు నిర్దష్ట సంఖ్యలో పేపర్లు దిద్దాలనే నిబంధన ఉంటుంది. చేతిరాత అర్థం కాకుండా ఉంటే.. అది మూల్యాంకన మీద తప్పక ప్రతికూల ప్రభావం చూపుతుంది.

సబ్ హెడింగ్స్.. అండర్‌లైన్స్

వ్యాసరూప సమాధానాలు రాసే సందర్భంలో విద్యార్థులు సదరు ప్రశ్నకు అనుగుణంగా సమాధానం ప్రారంభించాలి. సబ్ హెడింగ్స్ పెట్టడం, ముఖ్యాంశాలను ప్రత్యేకంగా రాయడం మార్కుల సాధనలో కలిసొస్తుంది. ఆన్సర్ బుక్‌లెట్‌లో ప్రతి పేజీలోనూ పదహారు నుంచి పద్దెనిమిది లైన్లు రాసే విధంగా చూసుకోవడం మేలు. దీనివల్ల అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య అవసరమైనంత నిడివి లభిస్తుంది. ఫలితంగా సమాధాన పత్రాలు చదవడం, దిద్దడం సులభం అవుతుంది.

మార్జిన్స్.. డ్రాయింగ్స్

సమాధాన పత్రంలోని ప్రతి పేజీలో రెండువైపులా మార్జిన్స్ ఇవ్వడం వల్ల ప్రజంటే షన్ మెరుగ్గా ఉండటమే కాకుండా... సమాధానాలు దిద్దేవారికి సౌకర్యంగా ఉంటుంది.

సమాధానాలు పొందికగా కనిపిస్తాయి. మ్యాథమెటిక్స్, సైన్స్ విషయంలో అవసరమైన చోట గ్రాఫ్‌లు, డ్రాయింగ్స్‌ను గీయాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు మార్జిన్స్ ఎంతో ఉపయుక్తమని చెప్పొచ్చు. ఏదైనా బొమ్మను గీసే క్రమంలో ముందుగా పెన్సిల్‌తో నిర్దిష్ట పరిమాణంలో బాక్స్‌ను గీసుకోవాలి. ఆ తర్వాత ఆ బాక్స్ పరిధిలోనే బొమ్మను గీయాలి. ఆ తర్వాత పెన్సిల్‌తో గీసిన బాక్స్‌ను చెరిపేయాలి. ఇలా చేయడం వల్ల బొమ్మ ఆకృతి ఆకట్టుకునే విధంగా ఉంటుంది. బొమ్మ పరిమాణంలో హెచ్చుతగ్గులు కూడా కనిపించవు. ఆన్సర్ షీట్‌లో ప్రతి వరుస పొందికగా ఉండాలి. వరుసలో ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా చూసుకోవాలి. ఎక్కడా కొట్టివేతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

లెక్కలైనా.. పొందికగా

మ్యాథమెటిక్స్‌కు సంబంధించి 'సమస్యను కచ్చితమైన విలువలతో సాల్వ్ చేస్తే చాలు' పూర్తి మార్కులు వస్తాయని చాలా మంది విద్యార్థులు భావిస్తుంటారు. కాని గణితం పేపర్‌లోనూ సమాధానాలు ఆకట్టుకునే విధంగా స్టెప్ బై స్టెప్ ప్రజెంట్ చేయాలి. ఒక సమస్య(ప్రాబ్లమ్)కు సమాధానం ఇచ్చేటప్పుడు అంచెలవారీ(స్టెప్‌వైజ్)గా సదరు పరిష్కారాన్ని పొందుపర్చాలి. రఫ్ వర్క్‌కు ప్రత్యేక పేజీని కేటాయించుకోవాలి. లేదా ఆన్సర్ షీట్‌లోనే రఫ్ వర్క్ వెనులుబాటు ఉంటే.. ఆ స్పేస్‌లోనే రఫ్ వర్క్ చేసుకుని, తుది సమాధానాన్ని పొందుపర్చాలి.

సమాధానం నిడివి

సమాధానాలు రాసే క్రమంలో విద్యార్థులు ముందుగా సదరు ప్రశ్నకు కేటాయించిన గరిష్ట మార్కులను గుర్తించాలి. దానికి అనుగుణంగానే సమాధానం రాయాలి. పరీక్ష విధానంలో లఘు, వ్యాసరూప సమాధానాల విధానం ఉంటుంది. లఘు ప్రశ్నకు కేటాయించిన మార్కుల ఆధారంగా.. ఒకట్రెండు వాక్యాల్లో ఉపోద్ఘాతం ముగించి నాలుగైదు ముఖ్యమైన పాయింట్లు రాయాలి. లఘు ప్రశ్నలకు వివరంగా సమాధానాలు రాస్తూ పోతే... వ్యాసరూప ప్రశ్నలకు సమాధానాలు రాసేందుకు సమయం సరిపోదు. ఎంత నిడివిలో రాసినా.. నిర్దిష్టంగా కేటాయించిన గరిష్ట మార్కులే వస్తాయి. కాబట్టి అవసరమైనంత వరకే రాయాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు, మార్కులు ఎక్కువగా ఉండే ప్రశ్నల విషయంలో మాత్రం ఉపోద్ఘాతం, సబ్ హెడింగ్స్, అండర్‌లైన్స్, బొమ్మలు వంటివి ప్రజెంట్ చేయాలి.

ప్రశ్న పత్రం పరిశీలనకు సమయం

విద్యార్థులు ప్రశ్న పత్రం చేతిలోకి తీసుకోగానే.. సమాధానాలు రాయడానికి బదులు.. ముందుగా సదరు ప్రశ్న పత్రం మొత్తాన్ని పరిశీలించడానికి పది నుంచి పదిహేను నిమిషాల సమయం కేటాయించాలి. అలా పరిశీలించిన తర్వాత సులభం, క్లిష్టం, అతి క్లిష్టం అనే కేటగిరీలుగా ప్రశ్నలను గుర్తించాలి. ఇలా గుర్తించిన తర్వాత సులువైన ప్రశ్నలతో సమాధానాలు మొదలు పెట్టాలి. సులభమైన ప్రశ్నలను మొదటి గంటలో పూర్తి చేసుకునే విధంగా సమయం నిర్దేశించుకోవాలి. ఆ తర్వాత ఎక్కువ మార్కులున్న క్లిష్టం, అతి క్లిష్టం ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.

ప్రశ్నను అర్థం చేసుకొని

సమాధానం రాయడానికి ముందు ప్రశ్నలో అడిగిన నిర్దిష్ట అంశాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఇలా కాకుండా ప్రశ్నను పైపైన చూసి.. వెంటనే సమాధానం రాయడానికి ఉపక్రమిస్తే.. పొరపాట్లకు ఎక్కువ ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు.. సోషల్‌లో.. మొగలుల పాలనలో అక్బర్ హయాంలో చోటు చేసుకున్న ముఖ్య పరిణామాలేంటి? అనే ప్రశ్న అడిగారనుకుందాం. ఇలాంటి సందర్భాల్లో కొందరు విద్యార్థులు మొగల్ రాజుల కాలంలో జరిగిన పరిణామాలను రాయడానికి ఉపక్రమిస్తారు. కానీ.. ఇక్కడ ప్రశ్నలో అక్బర్ హయాంలో చోటు చేసుకున్న పరిణామాలు మాత్రమే అడిగారని గుర్తించాలి.

ఛాయిస్ ఎంపికలో జాగ్రత్తగా

పరీక్ష సమయంలో, సమాధానాలకు ఉపక్రమించే ముందు విద్యార్థులు తమకు బాగా వచ్చిన ప్రశ్ననే ఎంపిక చేసుకోవాలి. అలా కాకుండా ఏదో ఒక ప్రశ్నను ఎంచుకొని రాయడం ప్రారంభిస్తే... సమగ్రంగా సమాధానం రాయలేరు. దాంతో మొదట ఎంచుకున్న ప్రశ్నను పక్కన బెట్టి మరో ప్రశ్నను ఎంచుకునే ప్రయత్నం చేస్తారు. దీనివల్ల విలువైన సమయం వృథా అవుతుంది. ఆ ఒత్తిడి మిగతా ప్రశ్నలకు సమాధానాలు రాయడంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి ఛాయిస్ ఉన్న ప్రశ్నల ఎంపిక విషయంలో ఒకటికి రెండు సార్లు సదరు ప్రశ్నలను చదివి, సులువుగా, త్వరగా పూర్తి చేయగలిగే ప్రశ్నలనే ఎంచుకోవాలి.

మొదటి నుంచి చివరి వరకు

పరీక్షకు సమాధానాలు ఇచ్చే విషయంలో నిర్దిష్ట సమయంలో మొదటి నుంచి చివరి వరకు ఒకే విధంగా వ్యవహరించాలి. మొత్తం ప్రశ్నలు, ఆయా ప్రశ్నలకు కేటాయించిన గరిష్ట మార్కులను గుర్తించి.. దాని ఆధారంగా ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో ముందుగానే ఒక అంచనాకు రావాలి. ఇలా కాకుండా.. మొదట్లో నిదానంగా రాస్తూ.. తర్వాత మధ్యలో సమయం చూసుకుని.. ఆ ఒత్తిడితో మిగతా సమాధానాలు రాస్తే.. అది చేతిరాతపై ప్రభావం చూపుతుంది. సమాధాన పత్రంలో అక్షరాలు గజిబిజిగా ఉంటాయి. కొట్టివేతలు కనిపిస్తాయి. మొదటి రెండు, మూడు సమాధానాలు అందంగా ఉన్నప్పటికీ.. మిగతా సమాధానాలు గజిబిజిగా ఉంటే మూల్యాంకన చేసే వారికి మంచి అభిప్రాయం ఏర్పడదు. ఇలా.. పరీక్ష హాల్లో ప్రశ్న పత్రం తీసుకున్నప్పటి నుంచి చివరి ప్రశ్నకు సమాధానం ముగించే వరకూ.. ప్రశాంతంగా ఉంటూ.. ఒక పద్ధతి ప్రకారం పొందికగా, ఆకట్టుకునే చేతి రాతతో సమాధానాలు రాస్తే.. టాప్ మార్కులు సొంతం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.

చేతిరాత.. ముఖ్యాంశాలు

» చేతిరాత పొందికగా, కొట్టివేతలు లేకుండా, నీట్‌గా ఉండేలా చూసుకోవాలి.
» పదాలు, వాక్యాల మధ్య నిర్దిష్ట నిడివి ఉండేలా ప్రయత్నించాలి.
» ఆన్సర్‌షీట్‌లోని ప్రతి పేజీలో 16 నుంచి 18 లైన్లు రాయడం మేలు.
» మ్యాథమెటిక్స్ వంటి విషయాల్లో అంచెల వారీగా సమాధానాలు రాయాలి.
» ప్రశ్నకు కేటాయించిన మార్కులకు అనుగుణంగా సమాధానం నిడివి ఉండాలి.

చేతిరాతకు ప్రాధాన్యం

"సమాధాన పత్రాల మూల్యాంకన పరంగా చేతిరాతకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా వ్యాసరూప సమాధానాల విషయంలో ఇది మరింత కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి విద్యార్థులు.. ఆన్సర్ షీట్‌లో అక్షరాలు పొందికగా రాసేలా ప్రాక్టీస్ చేయాలి. వాస్తవానికి ఈ నైపుణ్యం సాధనతోనే అలవడుతుంది. అలాగని ఇప్పుడు విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ కొద్ది రోజుల్లోనూ చేతిరాత ప్రాక్టీస్‌కు కొంత సమయం కేటాయించాలి.

– శ్రద్ధ శ్రీనివాస్, హ్యాండ్ రైటింగ్ ట్రైనర్

న్యాయం కోరే.. లాయర్

నోటిఫికేషన్స్

» లా కోర్సులతో ఉజ్వల భవిష్యత్తుకు భరోసా
» తెలుగు రాష్ట్రాల్లో విడుదలైన లాసెట్ నోటిఫికేషన్‌లు
» యూజీ, పీజీ లా కోర్సుల్లో ప్రవేశాలకు ఎంట్రెన్స్‌లు

తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్, డిగ్రీ తర్వాత న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాలకు వీలు కల్పించే టీఎస్ లాసెట్ 2020, ఏపీ లాసెట్ 2020లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే టీఎస్ లాసెట్‌లో అర్హత సాధించిన వారు తెలంగాణలోని లా కళాశాలల్లో 3/5 ఏళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల్లోప్రవేశం పొందొచ్చు. అలాగే శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(అనంతపురం) నిర్వహించే ఏపీ లాసెట్ 2020తో ఆంధ్రప్రదేశ్‌లోని లా కోర్సుల్లో చేరొచ్చు. ఈ నేపథ్యంలో.. టీఎస్/ఏపీ లాసెట్ 2020 ద్వారా ప్రవేశం లభించే లా కోర్సులు.. అర్హతలు, ప్రవేశ పరీక్ష విధానం, సిలబస్, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం...

టీఎస్ లాసెట్ 2020

తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉన్న 3/5 ఏళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా టీఎస్ లాసెట్ నోటిఫికేషన్ విడుదల అవుతుంది. తెలంగాణ ఉన్నత విద్యామండలి, హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే లాసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినఅభ్యర్థులకు మూడేళ్ల, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.

అర్హతలు

- మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశాల కోసం అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 45శాతం, ఓబీసీ 42శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 40శాతం మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.
- ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్‌లో.. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 45శాతం, ఓబీసీ 42శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 40 శాతం మార్కులు సాధించాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం

మూడేళ్ల, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులకు సంబంధించి మొత్తం 120 మార్కులకు ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ప్రశ్న పత్రంలో మూడు భాగాలు ఉంటాయి. పార్ట్-ఏలో జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ నుంచి 30 ప్రశ్నలు-30 మార్కులు; పార్ట్-బీలో కరెంట్ అఫైర్స్‌పై 30 ప్రశ్నలు-30 మార్కులు; పార్ట్-సీ అప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ ఆఫ్ లాపై 60 ప్రశ్నలు-60 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే ప్రశ్న పత్రం ఇంటర్మీడియట్ స్థాయిలో.. అలాగే మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశాలకు జరిపే ప్రశ్న పత్రం డిగ్రీ స్థాయిలో ఉంటుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల విధానం లేదు. జనరల్ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు అంటే మొత్తం 120 మార్కులకు 42 మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఎలాంటి కనీస అర్హత మార్కుల నిబంధన లేదు.

సిలబస్ ఇలా

- ఎల్ఎల్‌బీ మూడేళ్ల, ఐదేళ్ల పరీక్షకు సంబంధించి రెండింటి సిలబస్ ఒకే విధంగా ఉంటుంది. మూడేళ్ల ఎల్ఎల్‌బీ అభ్యర్థులకు డిగ్రీ స్థాయిలో, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ అభ్యర్థులకు ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రశ్నలను అడుగుతారు.
- **పార్ట్-ఎ (జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ):** ఈ విభాగం నుంచి 30 ప్రశ్నలకు పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో జనరల్ నాలెడ్జ్ నుంచి ఇండియన్ హిస్టరీ,ఇండియన్ కాన్స్టిటిట్యూషన్, ఇండియన్ కల్చర్ అండ్ హెరిటేజ్, ఇండియన్ పాలిటీ, కరెంట్ అఫైర్స్(జాతీయ,అంతర్జాతీయ అంశాలు), ఎకానమీ నుంచి అంశాలు అడుగుతారు.
- మెంటల్ ఎబిలిటీకి సంబంధించి కాంప్లెక్స్ అరేంజ్‌మెంట్స్,కోడింగ్ అండ్ డీకోడింగ్, నాన్ వెర్బల్, లైనర్ అరెంజ్‌మెంట్స్, బ్లడ్ రిలేషన్స్, రూట్స్ అండ్ నెట్‌వర్క్స్, వెర్బల్ సిరిస్, ఆల్ఫాబెట్ టెస్ట్, సింబల్స్ అండ్ నేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా సఫిషియన్సీ, ఆర్డరింగ్ అండ్ సీక్వెన్సింగ్, ప్రాబ్లమ్ బేస్డ్ విజువల్ ఎబిలిటీ,అనలిటికల్ రీజనింగ్ అంశాలు ఉంటాయి.
- **పార్ట్-బీ(కరెంట్ అఫైర్స్):** ఈ అంశం నుంచి 30 ప్రశ్నలు 30 మార్కులకు అడుగుతారు. ఇందులో పాలిటీ, ఎకానమీ, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, అవార్డులు, క్రీడలు, బిజినెస్, సైన్స్ అండ్ టెక్నాలజీపై ప్రశ్నలు ఎదురవుతాయి.
- **పార్ట్-సీ(స్టడీ ఆఫ్ లా):** ఈ విభాగానికి సంబంధించి మొత్తం 60 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇందులో ఇంటర్నేషనల్ లా, ఇంటర్నేషనల్ అండ్ మున్సిపల్ లా, సబ్జెక్ట్స్, స్టేట్ టెరిటరీ, స్టేట్ జురిస్‌డిక్షన్, యునైటెడ్ నేషన్స్ వంటి అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది.

ఉపాధి అవకాశాలు

✦ లా కోర్సులు పూర్తి చేసిన ప్రతిభావంతులకు ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో అవకాశాలకు కొదవలేదు. ✦ న్యాయ పట్టభద్రులు కోర్టుల్లో న్యాయమూర్తులుగా చేరే అవకాశం ఉంటుంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్, జనరల్ ప్రాసిక్యూటర్‌గా అవకాశాలు లభిస్తాయి. ✦ బ్యాంకులు, సెబీ, ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వే, పోలీస్ తదితర సంస్థల్లో న్యాయ అధికారులుగా మంచి అవకాశాలున్నాయి. అంతేకాకుండా అవుట్ సోర్సింగ్‌లో లీగల్ ప్రాసెస్ ఆఫీసర్లుగా(ఎల్‌పీఓ)గా కూడా చేరవచ్చు.

దరఖాస్తు ఫీజు

- టీఎస్ లాసెట్, పీజీ లాసెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.800, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.500 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.
- టీఎస్ పీజీఎల్‌సెట్‌కు దరఖాస్తు చేయాలనుకునే జనరల్ అభ్యర్థులు రూ.1000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.800 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 06 ఏప్రిల్ 2020
- **పరీక్ష తేదీ (లాసెట్, పీజీ లాసెట్):** 27 మే 2020
- **వెబ్‌సైట్:** https://lawcet.tsche.ac.in

టీఎస్ పీజీ ఎల్‌సెట్ 2020

టీఎస్ పీజీఎల్‌సెట్ 2020 ద్వారా రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సులో ప్రవేశం లభిస్తుంది. పీజీ ఎల్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు మూడేళ్ల ఎల్ఎల్‌బీ లేదా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీని పూర్తి చేసి ఉండాలి. ఆయా కోర్సు చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

✦ **పరీక్ష విధానం:** 120 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో టీఎస్‌పీజీఎల్‌సెట్ పరీక్ష జరుగుతుంది. ఇందులో పార్ట్- ఏలో 40 ప్రశ్నలు-40 మార్కులు(జురిస్‌ప్రుడెన్స్ 20 ప్రశ్నలు-20 మార్కులు, కన్స్టిటిట్యూషనల్ లా 20 ప్రశ్నలు -20 మార్కులు); అలాగే పార్ట్-బీలో 80 ప్రశ్నలు-80 మార్కులు (పబ్లిక్ ఇంటర్నేషనల్ లా 16 మార్కులు, మర్కంటైల్ లా 16మార్కులు, లేబర్‌లా 16 మార్కులు, క్రైమ్స్ అండ్ టార్ట్స్ 16 మార్కులు తదితర అంశాలపై పరీక్ష జరుగుతుంది)

ఏపీ లాసెట్-2020

ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాలకు వీలు కల్పించే ఏపీ లాసెట్/పీజీ లాసెట్-2020 నోటిఫికేషన్‌ను శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (అనంతపురం) విడుదల చేసింది. ఏపీలాసెట్/పీజీ లాసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలో గల న్యాయ విద్యా కళాశాలల్లో ఐదు/మూడేళ్ల ఎల్ఎల్‌బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం(పీజీ లా)కోర్సుల్లో చేరొచ్చు. అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎల్ఎల్‌బీ కోర్సుకు అర్హతలు

✦ మూడేళ్ల ఎల్ఎల్‌బీ చదివేందుకు అభ్యర్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థ నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ(10+2+3) ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీలో ఇంతకంటే తక్కువ మార్కులు వచ్చినవారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో నైనా 45 శాతం మార్కులు సాధించి ఉండాలి.

✦ ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాల నుంచి 45 శాతం మార్కులతో రెండేళ్ల ఇంటర్మీడియెట్ (10+2) ఉత్తీర్ణులు అర్హులు. ✦ మూడేళ్లు/ఐదేళ్ల కోర్సులకు జనరల్ కేటగిరీ (ఓసీ) అభ్యర్థులు 45 శాతం, బీసీలు 42 శాతం, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 40 శాతం మార్కులు తప్పనిసరి. ఎలాంటి విద్యార్హత లేకుండా సింగిల్ సిట్టింగ్‌లో ఇంటర్/డిగ్రీ పాసైనవారికి లాసెట్ రాసేందుకు అర్హత లేదు.

✦ **ఎల్ఎల్ఎం కోర్సు:** రెండేళ్ల పీజీ లా కోర్సులో చేరేందుకు ఎల్ఎల్‌బీ/బీఎల్ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో జనరల్ (ఓసీ) అభ్యర్థులకు 50శాతం, బీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు తప్పనిసరి.

ఎల్ఎల్‌బీ ప్రవేశ పరీక్ష విధానం

పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 120 మార్కులకు (మూడు విభాగాలు) ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, లా ఆప్టిట్యూడ్‌పై ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 90 నిమిషాల్లో 120 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. **పార్ట్-ఎ:** జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ 30 ప్రశ్నలు-30 మార్కులకు; **పార్ట్-బి:** కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు-30 మార్కులకు; **పార్ట్-సి:** లా ఆప్టిట్యూడ్ 60 ప్రశ్నలు-60 మార్కులకు (ఇందులో న్యాయ శాస్త్రం ప్రాథమిక సూత్రాలు, భారత రాజ్యాంగంపై ప్రశ్నలు ఉంటాయి) ఉంటుంది. ఐదేళ్ల లా కోర్సు ఎంట్రెన్స్ ఇంటర్ స్థాయిలోను, మూడేళ్ల కోర్సుకు డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి.

ఎల్ఎల్ఎం ప్రవేశ పరీక్ష ఇలా..

ఇందులో అన్ని స్పెషలైజేషన్లకు ఒకే టెస్ట్ ఉంటుంది. మొత్తం 90 నిమిషాల వ్యవధిలో 120 ప్రశ్నలు (మల్టిపుల్ ఛాయిస్) ఉంటాయి. **పార్ట్-ఎ:** 40 ప్రశ్నలు (న్యాయ శాస్త్రం 20, రాజ్యాంగ చట్టం 20 ప్రశ్నలు)-40 మార్కులకు; **పార్ట్-బి:** 80 ప్రశ్నలు (పబ్లిక్ ఇంటర్నేషనల్ లా 16, మర్కంటైల్ లా 16, లేబర్ లా 16, క్రైమ్స్ అండ్ టార్ట్స్ 16, ఐపీఆర్ అండ్ ఏఎంపీ, ఇతర చట్టాలు 16)- 80 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ✦ **దరఖాస్తు ఫీజు:** ఐదేళ్లు/మూడేళ్ల ఎల్ఎల్‌బీకి రూ.750; పోస్టు గ్రాడ్యుయేట్ లా కోర్సు ఎల్ఎల్ఎం: రూ.850 దరఖాస్తు ఫీజు చెల్లించాలి.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తులు:** మార్చి 11 నుంచి ఏప్రిల్ 10 వరకు
- **ఆలస్య రుసుం:** రూ.500తో ఏప్రిల్ 19 వరకు, రూ.1000తో ఏప్రిల్ 28 వరకు, రూ.2000తో ఏప్రిల్ 30 వరకు అవకాశం ఉంది.
- **హాల్‌టికెట్ల జారీ:** మే 3 నుంచి

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
17-3-2020

మహిళల ఐపీఎల్ అనవసరం!

దానికంటే మెరుగైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి

- మా జట్టుకు మంచి భవిష్యత్తు ఉంది
- వన్డే వరల్డ్ కప్ కోసం సిద్ధంగా ఉండాలి
- భారత మహిళల క్రికెట్ జట్టు కోచ్ డబ్ల్యూవీ రామన్ విశ్లేషణ

భారత మహిళల క్రికెట్ జట్టు టి20 ప్రపంచ కప్ ఫైనల్లో ఓడిపోయి ఉండవచ్చు. కానీ గత కొంత కాలంగా జట్టు ఆటతీరులో వచ్చిన మార్పులు మాత్రం అనూహ్యం. సాంప్రదాయ ధోరణిలో కాకుండా దూకుడు పెంచి సమకాలీన టి20 టీమ్‌గా మన జట్టు ఎదగగలిగింది. ఏ ఒక్కరిపైనో ఆధారపడకుండా జట్టులో అందరు ప్లేయర్లు తమ ఆటతో నమ్మకాన్ని కలిగించగలిగారు. దీని వెనక ఉన్నది జట్టు కోచ్ వూర్కేరి వెంకట్ (డబ్ల్యూవీ) రామన్. శిక్షకుడిగా గతంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ మాజీ క్రికెటర్ 14 నెలల తక్కువ వ్యవధిలోనే మహిళల జట్టుపై కూడా తన ముద్ర వేయగలిగారు. వరల్డ్ కప్‌లో జట్టు ప్రదర్శనను విశ్లేషించడంతో పాటు జట్టు భవిష్యత్తుకు సంబంధించి పలు అంశాలపై ఆయన మీడియాతో మాట్లాడారు. విశేషాలు రామన్ మాటల్లోనే....

కెప్టెన్ హర్మన్‌ప్రీత్, కోచ్ రామన్

స్మృతి, హర్మన్ వైఫల్యాలపై...

ఇద్దరు స్టార్ బ్యాటర్లు టోర్నీ మొత్తం విఫలం కావడం దురదృష్టకరం. అయితే అలా జరిగినా జట్టు విజయాలు సాధించగలిగిందంటే అది సానుకూల అంశం. క్రీజ్‌లో నిలబడిపోవడంకంటే ఒక భారీ షాట్ ఆడి హర్మన్ తిరిగి వచ్చేయడమే మంచిదని భావించా. ఎందుకంటే ఆమె అలా చేస్తే ప్రత్యర్థులు మానసికంగా పైచేయి సాధిస్తారు. ఆమె తర్వాత వచ్చే మన అమ్మాయిలేమో హర్మనే ఆడలేకపోతోంది మనమేం ఆడగలం అనే ధోరణితో మైదానంలో దిగుతారు. అది మంచిది కాదు. అయితే హర్మన్ సాధ్యమైనంతగా ప్రయత్నించింది. అయితే అనుభవం లేని ఒక జట్టును నడిపిస్తూ వ్యక్తిగతంగా కూడా విఫలమవుతూ ఆమె తీవ్ర ఒత్తిడిని అనుభవించింది.

కోచ్‌గా పని చేసే శైలిపై...

నా దృష్టిలో కోచ్ అనేవాడు ఒక ఎయిర్‌క్రాఫ్ట్‌కు పని చేసే సర్వీస్ ఇంజినీర్‌లాంటివాడు. అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకొని, అన్నింటినీ చక్కబెట్టి ఇవ్వడమే నా బాధ్యత. ఆపై ఒక పైలెట్‌లాగా మైదానంలో కెప్టెన్ జట్టును నడిపించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఏం జరుగుతుందో బయటి నుంచి పరిశీలించడమే నేను చేస్తాను. మ్యాచ్‌కు ముందే ఆటగాళ్లతో వివరంగా మాట్లాడి వారు మనసులో ఏదైనా సందేహాలు ఉంటే వాటిని తీర్చి ఆత్మ విశ్వాసంతో గ్రౌండ్‌లోకి అడుగు పెట్టేలా చేయగలను. ఇప్పటి వరకు కోచ్‌గా నేను ఇలాగే పని చేస్తున్నాను.

జట్టు ప్రదర్శనపై...

వరల్డ్‌కప్‌కంటే ముందు మేం ముక్కోణపు టోర్నీ కూడా ఆడాం. ఈ రెండు టోర్నమెంట్‌లను కలిసి చూస్తే ఆస్ట్రేలియాలాంటి జట్టును రెండు సార్లు, మహిళల క్రికెట్‌లో అతి పటిష్టమైన ఇంగ్లండ్, న్యూజిలాండ్‌లను కూడా ఓడించగలిగాం. మా అమ్మాయిల ప్రదర్శన పట్ల చాలా గర్వపడుతున్నాను. మా బలం ఏమిటో గట్టిగా నమ్మి దాని ప్రకారం ఆడటం వల్లే ఇది సాధ్యమైంది. సరిగ్గా చెప్పాలంటే గతంలో ఈ జట్లతో మ్యాచ్‌కు ముందు ప్లేయర్లు ఒక పెద్ద సవాల్ ఎదురైనట్లుగా భావించేవారు. ఇప్పుడు అలా కాదు. ప్రపంచంలో ఏ జట్టునైనా ఓడించగలమనే ఆత్మ విశ్వాసం వచ్చింది. అదే విజయానికి తొలి మెట్టు. మెగా టోర్నీ జరిగిన సమయంలో నేను ఒక్కసారి కూడా 'వరల్డ్ కప్' అనే మాటను ఉచ్ఛరించలేదు. ఒక టోర్నీ అని మాత్రమే అన్నాడు. ఎందుకంటే ప్రపంచకప్ అనే వారిపై అనవసరపు ఒత్తిడి పెంచవచ్చు. రాబోయే వన్డే వరల్డ్ కప్ కోసం కూడా నాకంటూ కొన్ని ఆలోచనలు ఉన్నాయి. టోర్నీకి ఆరు నెలల ముందుగా పూర్తి స్థాయిలో జట్టును ఎంపిక చేసుకొని వారితో సన్నాహాలు సాగించాలి. టి20 ప్రపంచకప్‌లో ఆడినవారే కాకుండా వన్డేలకు తగిన ప్లేయర్లను తీసుకోవడం కూడా కీలకం. రాబోయే చాలెంజర్ టోర్నీ అందుకు కావాల్సిన అవకాశమిస్తుంది.

ఫైనల్లో ప్రేక్షకులు, ఒత్తిడి గురించి...

మెల్‌బోర్న్ మైదానంలో దాదాపు లక్ష మంది ప్రేక్షకులు ఉంటారనే విషయం నాకు తెలుసు. కానీ ఆ సమయంలో ఎలా ఉండాలో, ఏం చేయాలో నేను చెప్పలేదు. ఎందుకంటే ఆ వాతావరణం, జోష్ అంతా అనుభవిస్తేనే అర్థమవుతుంది తప్ప ఇలా ఉంటుందని మనమేమీ చెప్పలేం. ఇలాంటి స్థితిలో కూడా బంతిపైనే దృష్టి పెట్టడం చాలా ముఖ్యం. లేదంటే ప్రేక్షకుల చేతుల్లోనే ఓడిపోతాం. అయితే మా పరాజయానికి ప్రేక్షకుల సంఖ్య లేదా అక్కడి వాతావరణం కారణం కానే కాదు. నేను అలాంటి సాకులు చెప్పను. అయితే ఫైనల్‌కు ముందు వారం రోజుల పాటు మ్యాచ్ లేకుండా విరామం రావడం మమ్మల్ని దెబ్బ తీసిందనేది మాత్రం వాస్తవం. ఒక యువ జట్టు ఇన్ని రోజులు ఆటకు దూరంగా ఉండి మళ్లీ ఆటలోకి వచ్చి నేరుగా ఫైనల్ ఆడటం మానసికంగా అంత సులువు కాదు. నలుగురు స్పిన్నర్లతో ఆడటం ఎప్పుడైనా దెబ్బ కొట్టవచ్చని ఒక దశలో భయపడ్డాను. చివరకు ఫైనల్లోనే అది జరిగింది. మనకు అందుబాటులో ఉన్న వనరులతోనే జట్టును రూపొందించాలి కదా. కొన్ని ప్రణాళికలు ఫైనల్లో పని చేయలేదు. అయితే ఆటలంటే ఇలాగే ఉంటాయి. వాటిని మరచి ముందుకు సాగాలి.

టీనేజర్ షఫాలీ వర్మ గురించి...

బౌలర్లపై విరుచుకుపడటమే షఫాలీ శైలి. దాదాపు అన్ని మ్యాచ్‌లలో ఆమె అదే చేసింది. షఫాలీతో ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని నాకర్థమైంది. నిజంగా బ్యాటింగ్ గురించి ఆమెకు నేను సూచనలేమీ చేయను. జట్టు సమావేశాల తర్వాత ఆమెతో విడిగా మాట్లాడుతూ అక్కడ చెప్పిందంతా నీకు కాదులే. నువ్వు ఎలా ఆడాలనుకుంటే అలా ఆడు అనేవాడిని. 16 ఏళ్ల అమ్మాయితో అలాగే చెప్పాలి. అవసరం లేకపోయినా మనసులో వేరే ఆలోచనలు ఎందుకు చొప్పించాలి. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు ముందు రోజు ప్రాక్టీస్ సెషన్‌లో ఆమె ఒక్క షాట్ కూడా గాల్లోకి కొట్టకుండా ఆడింది. చూశారా నేను ఎంత పద్ధతిగా ఆడానో అని నాతో చెప్పింది కానీ నేను పట్టించుకోలేదు. తర్వాతి రోజు ఏం చేస్తుందో నేను వేచి చూశా. అన్ని షాట్లు గాల్లోకి వెళ్లాయి. నాలుగు సిక్సర్లు వచ్చేశాయి (ఆ మ్యాచ్‌లో 17 బంతుల్లో 39). నాకు నవ్వొచ్చింది. ఆమె ఆటలో చాలా వినోదం లభించింది.

అమ్మాయిల ప్రతిభ గురించి...

మా టీమ్ సగటు వయసు 22 ఏళ్లు! ఆస్ట్రేలియా గడ్డపై చూపిన ప్రదర్శనను కొనసాగించగలిగితే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఆడినవారిలో ఆత్మవిశ్వాసం పెరగడమే కాదు, వారిని చూసినవారు కూడా స్ఫూర్తి పొందేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుంది. ప్రపంచకప్‌లాంటి మెగా టోర్నీ జట్టులో ముగ్గురు టీనేజర్లు, అనుభవం లేని ఇద్దరు యువ ప్లేయర్లను ఎంపిక చేసినప్పుడు అంతా ఆశ్చర్యపోయారు. అయితే ప్రతిభ ఉంటే వేదిక ఎంత పెద్దదైనా భయపడకుండా ఆడవచ్చని వారు నిరూపించారు. కొన్ని చిన్న చిన్న లోపాలు సరిదిద్దుకుంటే ఈ జట్టు మున్ముందు మరింత బలమైన జట్టుగా ఎదగడం ఖాయం. సరిగ్గా చెప్పాలంటే పేస్ బౌలింగ్ దళాన్ని పటిష్ట పరచుకోవాల్సి ఉంది. ఇది మాకు బలహీనతగా కనిపించింది కాబట్టి పేసర్లను తీర్చిదిద్దడం ముఖ్యం. నిజాయితీగా చెప్పాలంటే మన అమ్మాయిలు శారీరకంగా కొంత బలహీనంగానే ఉన్నారు. వారు తమ ఫిట్‌నెస్‌పై మరింత శ్రద్ధ పెట్టి బలంగా తయారవడంతో పాటు విరామం లేకుండా బౌలింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలి. గతంతో పోలిస్తే వేగం, చురుకుదనం కొంత పెరిగినా అది ఇంకా మెరుగవ్వాలి. దీనికి కొంత సమయం పట్టవచ్చు కానీ భవిష్యత్తులో ఫలితాలు బాగుంటాయి.

నాణ్యత లోపిస్తే పరిస్థితి ఘోరం...

మహిళల ఐపీఎల్ విషయంపై తొందరపడవద్దని నా హెచ్చరిక! నా అభిప్రాయం ప్రకారం ఇప్పటికిప్పుడు అనవసరం. ప్రస్తుతం మన మహిళా క్రికెటర్లు పూర్తి స్థాయి (ఎనిమిది జట్లతో) ఐపీఎల్‌కు సిద్ధంగా లేరు. ఐపీఎల్ ఆలోచన మంచిదే కావచ్చు. కానీ వాటిని అమలు చేయడం అంత సులువు కాదు. ఇప్పటికిప్పుడు హడావిడిగా ఐపీఎల్ అని మొదలు పెట్టి అందులో నాణ్యత లోపిస్తే పరిస్థితి ఘోరంగా మారిపోతుంది. పురుషుల ఐపీఎల్ కూడా ఆరంభమైనప్పుడు ఇంత సూపర్ సక్సెస్ అవుతుందని ఎవరూ ఊహించలేదు. నాకు తెలిసి ముందుగా పెద్ద సంఖ్యలో ప్లేయర్లకు గుర్తించి జట్లను తయారు చేయడం ముఖ్యం. నా అవగాహన ప్రకారం ఈ విషయంలో తొందర పడాల్సిన అవసరం లేదు. ఇక ప్లేయర్లకు మ్యాచ్ ప్రాక్టీస్ ఎలా అని ప్రశ్నిస్తే... రాబోయే రోజుల్లో భారత్ 'ఎ', అండర్-23 టోర్నీలు నిర్వహించవచ్చు. అండర్-19 ప్రపంచకప్ ప్రతిపాదన కూడా ఉంది కాబట్టి అమ్మాయిలకు పెద్ద సంఖ్యలో క్రికెట్ ఆడే, తమ సత్తాను నిరూపించుకునే అవకాశం లభిస్తుంది. ఆ తర్వాత ఏదో రోజు ఐపీఎల్ రావచ్చేమో. హడావిడిగా కాకుండా క్రమక్రమంగా ఒక్కో అడుగు వేసుకుంటూ వెళ్లాలి. ఈసారి నాలుగు జట్లు అంటున్నారు మంచిదే. ఒక్కో జట్టు మరో టీమ్‌తో కనీసం రెండు సార్లయినా తలపడితే బాగుంటుంది.

'టోక్యో'పై నీలినీడలు

- విశ్వ క్రీడలపై జపాన్ వాసుల వ్యతిరేకత
- ప్రభుత్వం... బయటికి గాంభీర్యం, లోలోపల మాత్రం గుబులు

టోక్యో: ప్రపంచాన్ని కరోనా వైరస్ చుట్టేయడంతో విశ్వక్రీడలపై అనుమానాలు అంతకంతకు పెరుగుతున్నాయి. జపాన్ ప్రభుత్వం, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) బయటికి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ... లోలోపల గుబులు వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 కేసులు వేలల్లో పెరుగుతున్నాయి. వందల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే ఇరుగుపొరుగు దేశాలకు వెళ్లాలన్నా ఎన్నో ఆంక్షలున్నాయి. ఇక సుదూర దేశాలకు పయనం దాదాపు గగనమే అయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరు టోక్యోకు వెళతారు. ప్రాణాలను పణంగా పెట్టి ఆడేవాళ్లెంత మంది? ధైర్యం చేసి విదేశీయులు వెళ్లడానికి సిద్ధమైనా... జపాన్ వాసుల్లో ఇప్పుడిప్పుడే అసహనం కూడా వ్యక్తమవుతోంది. ఎందుకంటే... ప్రతిష్టకు పోయి విదేశీయుల రాక వల్ల తమ ప్రాణాలకు ముప్పుతెచ్చుకోవడం ఎందుకని జపనీయులు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మా ప్రాణాలతో ఈ 'ఆట'లొద్దు

కోవిడ్-19 జపాన్‌లోనూ జడలు విప్పింది. అధికారిక సమాచారం మేరకు 814 మంది కరోనా బాధితులుండగా.. 24 మంది మృత్యువాత పడ్డారు. ఒలింపిక్స్ నేపథ్యంలో కరోనా కేసుల్ని తక్కువగా చూపిస్తున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే యూరప్ దేశాల కంటే ముందుగానే జపాన్‌కు కరోనా వైరస్ వ్యాపించింది. అందువల్ల బాధితులు ఎక్కువగానే ఉండొచ్చనే అనుమానాలకు బలం చేకూరుతోంది. టోక్యోకు చెందిన 27 ఏళ్ల ఉద్యోగి కొకి మురా మీడియాతో మాట్లాడుతూ 'నిజాయితీగా చెబుతున్నా... జపాన్ ఈ కరోనా కల్లోలం నుంచి త్వరగా బయటపడినా సరే, మెగా ఈవెంట్ కోసం విదేశీయుల రాకను ఎంతమాత్రం కోరుకోం. నిక్కచ్చిగా చెప్పాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో అసలు ఈ ఈవెంట్‌ను నిర్వహించకపోవడమే మంచిది' అని కుండబద్దలు కొట్టినట్లు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇది అతని ఒక్కడి మాటలే కాదు... కరోనా స్వైరవిహారం చేస్తున్న నేపథ్యంలో జపనీయులంతా ఇప్పుడిదే కోరుకుంటున్నారు. ఓ ఆటల వేడుక కోసం తమ ప్రాణాలను రిస్క్‌లో పెట్టేందుకు ఎవరు సిద్ధంగా లేరు. ఓ అభిప్రాయ సేకరణలో పాల్గొన్న వెయ్యి మందిలో 70 శాతం మంది (700 మంది జపాన్ వాసులు) ఒలింపిక్స్ నిర్వహణకు వ్యతిరేకంగానే ఉన్నారు. మిగతా వారేమో వాయిదా వేస్తేనే మంచిదని భావిస్తున్నారు.

ఎలాంటి డెడ్‌లైన్ లేదు

టోక్యో ఒలింపిక్స్ నిర్వహణపై ఐఓసీ అధికారి జాన్ కోట్స్ వివరణ

సిడ్నీ: టోక్యో ఒలింపిక్స్ నిర్వహణ కోసం ఇప్పుడైతే ఎలాంటి డెడ్‌లైన్లు లేవని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) కో ఆర్డినేషన్ కమిషన్ అధికారి జాన్ కోట్స్ తెలిపారు. జూలై 24 నుంచి జరిగే మెగా ఈవెంట్ కోసం మే నెలాఖరులోగా అన్ని క్వాలిఫికేషన్ టోర్నీలు ముగియాలనే గడువు విధించారు. అయితే ప్రపంచం మొత్తాన్ని కరోనా మహమ్మారి కాటేయడంతో దాదాపు అన్ని దేశాల్లోనూ క్వాలిఫయింగ్ టోర్నీలన్నీ వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్‌ను నిర్వహిస్తారా లేదా అనే నిర్ణయం తీసుకునేందుకు తుదిగడువు లేదని కోట్స్ స్పష్టం చేశారు. ఆసీస్ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు కూడా అయిన కోట్స్ ఒలింపిక్స్ పనుల మీద యూరప్ చుట్టివచ్చాడు. అయితే అతను స్వదేశం (ఆస్ట్రేలియా) చేరాక ప్రస్తుత నిబంధనల మేరకు ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా 14 రోజుల ఐసోలేషన్ వార్డులో చేరాల్సి ఉంటుంది.

ఆ వేడుకను ముగించారు...

ఒలింపిక్స్ సంప్రదాయం ప్రకారం ఏథెన్స్‌లో నిర్వహించిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా ముగించేశారు. కోవిడ్-19 వల్లే గ్రీకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అక్కడ 331 మంది వైరస్ బారిన పడగా... నలుగురు మృతి చెందారు.

బంగ్లాదేశ్, పాకిస్తాన్ సిరీస్ రద్దు

కరాచీ: కరోనా (కోవిడ్-19) దెబ్బకు వచ్చే నెలలో బంగ్లాదేశ్, పాకిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన వన్డే, టెస్టు మ్యాచ్‌లు వాయిదా పడ్డాయి. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల మధ్య ఏకైక వన్డే ఏప్రిల్ 1న జరగాల్సి ఉండగా... ఫిబ్రవరిలో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌కు కొనసాగింపుగా రెండో టెస్టు ఏప్రిల్ 5 నుంచి 9 వరకు జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఈ రెండు మ్యాచ్‌లు వాయిదా పడ్డాయి. అవి ఎప్పుడు జరుగుతాయనే విషయంపై సమాచారం లేదు. మార్చి 24 నుంచి జరగాల్సిన పాకిస్తాన్ దేశవాళీ క్రికెట్ టోర్నీ పాకిస్తాన్ కప్ వన్డే టోర్నమెంట్‌ను కూడా వాయిదా వేస్తున్నట్లు పీసీబీ ప్రకటించింది. ఇప్పటికే కుదింపుతో సాగుతోన్న పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) క్రికెట్ టోర్నీకి మరో షాక్ తగిలింది. కరోనా భయంతో ఈ లీగ్‌ను వదిలిన విదేశీ ఆటగాళ్ల జాబితాలో క్రిస్ లిన్ (ఆస్ట్రేలియా), డేవిడ్ వీస్ (ఆస్ట్రేలియా), సెక్కుగె ప్రసన్న (శ్రీలంక) కూడా చేరారు.

బీసీసీఐ కార్యాలయం మూసివేత

కరోనా నేపథ్యంలో ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' వెసులుబాటు

న్యూఢిల్లీ: కరోనా మహమ్మారి కారణంగా ఇప్పటికే దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో విద్యా సంస్థలు సెలవులు ప్రకటించగా... ఐటీ కారిడార్లు తమ ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆదేశాలు జారీ చేశాయి. తాజాగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కూడా ఇదే బాటలో నడుస్తోంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలోని తమ ప్రధాన కార్యాలయాన్ని నేటి నుంచి మూసివేయనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. తమ ఉద్యోగులను ఇంటి నుంచి పని చేయాలంటూ ఆదేశించింది. కోవిడ్-19 కారణంగా ఇప్పటికే పలు టోర్నీలను బీసీసీఐ వాయిదా వేసింది. ఈ జాబితాలో దేశవాళీ క్రికెట్ టోర్నీలు, ఇరానీ కప్, మహిళల చాలెంజర్ ట్రోఫీతో పాటు ఐపీఎల్ టోర్నీ కూడా ఉంది. మరోవైపు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) అన్ని జోనల్ శిక్షణా శిబిరాలను నిలిపివేసింది. కానీ బెంగళూరులోని ఎన్‌సీఏ పునరావాస కేంద్రం మాత్రం సోమవారం కూడా తన విధుల్లో నిమగ్నమై ఉంది. ఐపీఎల్ ఫ్రాంచైజీ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఈనెల 21 నుంచి జరగాల్సిన శిక్షణా శిబిరాన్ని వాయిదా వేసింది.

ప్రేక్షకులు లేకుండానే గ్రాండ్‌ప్రి ఈవెంట్‌లు

న్యూఢిల్లీ: ఇండియన్ గ్రాండ్‌ప్రి (ఐజీపీ) అథ్లెటిక్స్ సిరీస్‌లో భాగంగా జరిగే తొలి రెండు పోటీలను ప్రేక్షకులు లేకుండానే నిర్వహించేలా భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) సోమవారం నిర్ణయం తీసుకుంది. మన దేశంలోనూ కోవిడ్-19 తీవ్రమవుతున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏఎఫ్ఐ తెలిపింది. ఐజీపీ-1 ఈ నెల 20వ తేదీన... ఐజీపీ-2 ఈ నెల 25వ తేదీన పటియాలాలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ వేదికగా జరగనున్నాయి. భారత్‌లో కరోనా వ్యాప్తి జరగకుండా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విదేశీయుల ప్రయాణాలపై ఆంక్షలు విధించగా... స్పోర్ట్స్ ఈవెంట్‌లలో పెద్ద ఎత్తున జనం ఒకేచోట గుమికూడకుండా చర్యలు తీసుకోవాలంటూ అన్ని జాతీయ క్రీడల సమాఖ్యలను కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ కోరింది.

భయం... భయంగానే ఆడా: శరత్ కమల్

న్యూఢిల్లీ: పదేళ్ల తర్వాత మరో అంతర్జాతీయ సింగిల్స్ టైటిల్ నెగ్గిన భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) స్టార్ ఆటగాడు ఆచంట శరత్ కమల్ కోవిడ్-19 విస్తరిస్తున్న నేపథ్యంలో ఒమన్‌లో తాను భయం భయంగా ఆడాల్సి వచ్చిందని చెప్పాడు. 'పోలిష్ ఓపెన్ సహా పలు ఈవెంట్లను అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ఏప్రిల్ ఆఖరు దాకా రద్దు చేసింది. దీంతో నేను ఒమన్‌కు అనవసరంగా వచ్చాననే గుబులు రేగింది. స్వదేశంలో నా కుటుంబసభ్యులు కూడా కంగారు పడ్డారు. చివరకు ఒమన్ టోర్నీ జరగడంతో మెల్లిగా ఆటపై దృష్టిపెట్టాను. టైటిల్ గెలిచినందుకు ఎంతో సంబరపడ్డాను' అని శరత్ తెలిపాడు. ఒమన్ నుంచి చెన్నై చేరిన శరత్‌కు విమానాశ్రయంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. శరీర ఉష్ణోగ్రత సాధారణంగా ఉండటంతో ఇంటికి పంపారు. అయితే నిబంధనల ప్రకారం శరత్ రెండు వారాల పాటు స్వీయనిర్భంధంలో ఉండాలి.

స్పోర్ట్స్‌లో భారత్ సూపర్ పవర్‌గా ఎదగాలి

రాజ్యసభలో క్రీడల మంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: ప్రపంచ క్రీడల్లో భారత్ 'సూపర్ పవర్'గా ఎదగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సోమవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ 'స్పోర్ట్స్‌లో భారత్ సూపర్ పవర్ కావాలన్నదే మా కల. ప్రణాళికా బద్ధంగా ప్రతిభావంతుల్ని గుర్తించి శిక్షణ ఇచ్చేందుకు 'టాలెంట్ సెర్చ్ కమిటీ'ని ఏర్పాటు చేయాలని ఇదివరకే నిర్ణయించాం. ఈ కమిటీ కుర్రాళ్ల ప్రతిభను గుర్తించే పనిలో ఉంటుంది. గ్రామీణ, ఇతర మారుమూల పల్లెల్లోని ప్రతిభ గల క్రీడాకారులను ఈ కమిటీ వెలుగులోకి తెస్తుంది' అని అన్నారు. కరోనా వల్ల ఇప్పుడు క్రీడా ఈవెంట్లన్నీ రద్దు లేదంటే వాయిదా పడ్డాయని... అయితే ఆటగాళ్లు మాత్రం ఎక్కడా ధైర్యం కోల్పోకుండా క్రీడాస్ఫూర్తితో రాణించాలని ఆయన సూచించారు. ఆటగాళ్లు ప్రాక్టీస్‌పైనే దృష్టి పెట్టాలని అన్నారు.

వ్యాఖ్యాతగా విశ్వనాథన్ ఆనంద్

కోవిడ్ కారణంగా తిరుగు ప్రయాణంపై ఆంక్షలు

చెన్నై: భారత గ్రాండ్‌మాస్టర్, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ కోవిడ్ వైరస్ కారణంగా జర్మనీలో ఇరుక్కుపోయాడు. అక్కడ జరిగిన చెస్ లీగ్‌లో పాల్గొన్న విషీ సోమవారం చెన్నైకి రావాల్సి ఉంది. అయితే కోవిడ్-19 వైరస్ వేగంగా విస్తరిస్తోన్న నేపథ్యంలో విధించిన ప్రయాణ ఆంక్షల కారణంగా ఆనంద్ ఫ్రాంక్‌ఫర్ట్‌లోనే ఉండిపోయాడని ఆయన భార్య అరుణ తెలిపారు. నేటి నుంచి రష్యాలోని ఎకతెరీన్‌బర్గ్‌లో జరుగనున్న 'ఫిడే' క్యాండిడేట్స్ టోర్నమెంట్ ద్వారా ఆనంద్ కామెంటేటర్‌గా కొత్త పాత్ర పోషించనున్నాడని అరుణ తెలిపింది.

राष्ट्रीय ग्रामीण विकास एवं पंचायती राज संस्थान
NIRDPR
नेशनल इन्स्टिट्यूट ऑफ रूरल डेवलप्मेंट & पंचायती राज
राजेंद्रनगर, హైదరాబాద్-500030.
గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం

ప్రవేశ ప్రకటన

రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో కెరీర్ కోసం దరఖాస్తు కోరుతోంది

1. AICTE అప్రూవ్డ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ - రూరల్ మేనేజ్‌మెంట్ (PGDM-RM) 2020-22 బ్యాచ్-3

రెండు సంవత్సరాల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్
అర్హత: కనీసం 50% మార్కులతో (SC/ST/PWD లకు 45%) బ్యాచిలర్స్ డిగ్రీ
క్వాలిఫైయింగ్ ఎగ్జామ్స్: CAT/MAT/XAT/ATMA/CMAT/GMATలో దేనిలోనైనా వ్యాలిడ్ స్కోర్స్‌పై ఆధారపడి ఎంపిక ఉంటుంది.
మరిన్ని వివరాలకు దర్శించండి: www.nirdpr.org.in

2. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (PGDRDM) 2020-21 బ్యాచ్-18

ఒక సంవత్సరం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్
అర్హత: కనీసం 50% మార్కులతో (SC/ST/PWD లకు 45%) బ్యాచిలర్స్ డిగ్రీ
క్వాలిఫైయింగ్ ఎగ్జామ్స్: CAT/XAT/MAT/ATMA/CMAT/GMATలో దేనిలోనైనా వ్యాలిడ్ స్కోర్స్‌పై (లేదా) NIRDPR చే నిర్వహించబడే ఆలిండియా ఎంట్రన్స్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన దానిపై ఆధారపడి ఎంపిక ఉంటుంది.
i) ఆఖరు తేది: 10-04-2020, ii) కోర్సు ప్రారంభం: జూన్ 2020
మరిన్ని వివరాలకు దర్శించండి: www.nirdpr.org.in, ఫోన్- 040-24008460 / 442 / 540, మొబైల్ నం. 98487 80141, ఇ-మెయిల్:cpgs.nird@gov.in

ట్రైనింగ్ & కెపాసిటీ బిల్డింగ్ | రిసెర్చ్ & కన్సల్టెన్సీ | పాలసీ ఫార్మ్యులేషన్ & అడ్వకసి | టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ | అకడమిక్ ప్రోగ్రామ్స్ | ఇన్నోవేటివ్ స్కిల్లింగ్ & లైవ్‌లిహుడ్

సాక్షి బిజినెస్
మంగళవారం
17-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
2,713 ▼	758 ▼
31,390	9,197

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)

నాస్‌డాక్	7,134	▼ 740
డోజోన్స్	20,922	▼ 2264
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,151	▼ 215
డాక్స్	8,742	▼ 489
షాంఘై	2,789	▼ 98
నికాయ్	17,002	▼ 429

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌డీవీ	73.35	75.00
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌డీవీ	89.96	93.11
€	యూరో	ఎన్‌డీవీ	80.98	83.93
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌డీవీ	68.09	70.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌డీవీ	44.71	46.80
S$	సింగపూర్ డాలర్	ఎన్‌డీవీ	51.44	53.15
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	18.76	20.62
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	18.89	21.12
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.46	11.23

సెన్సెక్స్ 2,713 పాయింట్లు డౌన్

- కొనసాగుతున్న కరోనా వైరస్ కల్లోలం
- ప్రపంచ వ్యాప్తంగా పతన బాటలోనే మార్కెట్లు
- ప్రభావం చూపని ఫెడరల్ రిజర్వ్ రేట్ల తగ్గింపు
- మాంద్యం భయాలను పెంచిన చైనా గణాంకాలు
- ఆరంభంలోనే వెయ్యి పాయింట్లు పతనమైన సెన్సెక్స్ 31,390 వద్ద ముగింపు
- 758 పాయింట్ల నష్టంతో 9,197కు నిఫ్టీ
- మూడేళ్ల కనిష్టానికి నిఫ్టీ, సెన్సెక్స్ రెండున్నరేళ్ల కనిష్టం
- చరిత్రలో ఇదే రెండో అత్యధిక పతనం

కోవిడ్-19 (కరోనా) వైరస్ కల్లోలం కొనసాగుతుండటంతో స్టాక్ మార్కెట్ సోమవారం భారీగా నష్టపోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఫండ్ల రేట్లను దాదాపు సున్నా స్థాయికి తగ్గించినప్పటికీ, భారత్‌తో పాటు ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లన్నీ పతనబాటలోనే సాగాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 32,000 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 9,200 పాయింట్ల దిగువకు పడిపోయాయి. సెన్సెక్స్ చరిత్రలోనే రెండో అతి పెద్ద పతనాన్ని నమోదు చేసింది. 2,713 పాయింట్లు క్షీణించి 31,390 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 758 పాయింట్లు పతనమై 9,197 పాయింట్ల వద్దకు చేరింది. శాతం పరంగా చూస్తే, సెన్సెక్స్ 7.96 శాతం, నిఫ్టీ 7.61 శాతం చొప్పున క్షీణించాయి. అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. నిఫ్టీ మూడేళ్లు, సెన్సెక్స్ రెండున్నరేళ్ల కనిష్టానికి పడిపోయాయి.

ఆరంభం నుంచి అదే వరుస....

ఆసియా మార్కెట్ల బలహీనతతో సెన్సెక్స్, నిఫ్టీలు భారీ నష్టాల్లో మొదలయ్యాయి. సెన్సెక్స్ 1,000 పాయింట్ల నష్టంతో 33,103 పాయింట్ల వద్ద, నిఫ్టీ 368 పాయింట్లు పతనమై 9,588 పాయింట్ల వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 2,827 పాయింట్లు, నిఫ్టీ 790 పాయింట్ల మేర పతనమయ్యాయి. ఈ నెల 12న సెన్సెక్స్ 2,919 పాయింట్లు, నిఫ్టీ 868 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. చరిత్రలో ఇదే అతి పెద్ద పతనం. సోమవారం రెండో అతి పెద్ద పతనం నమోదైంది. వారం వ్యవధిలో స్టాక్ సూచీలు ఇలా భారీ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. శుక్రవారం విరామం అనంతరం స్టాక్ మార్కెట్‌లో నష్టాలు మళ్లీ కొనసాగాయి.

ఎదురీదిన యస్ బ్యాంక్

అన్ని రంగాల షేర్లు భారీగా పతనమైనప్పటికీ, యస్ బ్యాంక్ షేర్ మాత్రం 45% ఎగసి రూ.37కు చేరింది. యస్ బ్యాంక్‌లో వివిధ బ్యాంక్‌లు రూ.10,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తుండటం, నగదు విత్‌డ్రాయల్ పరిమితులను మరో 2 రోజుల్లో తొలగించనుండటం సానుకూల ప్రభావం చూపాయి.

ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్

అమెరికా వడ్డీ రేట్లు @ 0

ఫెడ్ మరో అనూహ్య కోత

వాషింగ్టన్: అమెరికా సెంట్రల్ బ్యాంక్-ఫెడరల్ రిజర్వ్ రెండు వారాల్లోనే రెండోసారి వడ్డీ రేట్లలో కోత పెట్టింది. అదీ ఏకంగా 1 శాతం తగ్గించేసింది. వెరసి ప్రస్తుతం ఫెడ్ ఫండ్ రేటు సున్నా (0-0.25 శాతం) స్థాయికి చేరింది. రెండు వారాల్లోనే రేటును ఫెడ్ ఏకంగా 1.5 శాతం తగ్గించడం గమనార్హం. నిజానికి ఈ నెల 17, 18 తేదీల్లో ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశాన్ని నిర్వహించవలసి ఉంది. అయితే కోవిడ్-19 సృష్టిస్తున్న విలయం కారణంగా రెండు వారాల క్రితం తొలిసారి అత్యవసర ప్రాతిపదికన 0.5 శాతం వడ్డీ రేటును తగ్గించింది. ఆది వారం అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారు జామున) వడ్డీ రేట్లను సున్నా స్థాయికి చేర్చుతున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా 700 బిలియన్ డాలర్లతో భారీ సహాయక ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు బాండ్లను కొనుగోలు చేయనుంది. తాజా రేటు కోత నేపథ్యాన్ని పరిశీలిస్తే, కరోనా వైరస్‌తో ప్రపంచం నిలువెల్లా వణుకుతోంది. దాదాపు ప్రపంచ దేశాలన్నీ కోవిడ్-19 వైరస్ ప్రభావానికి లోనైనట్లు వార్తలు వెలువడుతున్నాయి. దీంతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యే పరిస్థితులు తలెత్తాయి. ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థపైతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

2008 తదుపరి...

2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితులకు దారితీసిన సబ్‌ప్రైమ్ సంక్షోభ సమయంలో వృద్ధికి ఊతం అందించడానికి అమెరికా ఫెడ్ ఫండ్ రేటును సున్నా స్థాయికి తగ్గించడం జరిగింది. తరువాత కొన్ని సానుకూల ఆర్థిక అంశాలతో ఈ రేటు 2.5 శాతం వరకూ పెరుగుతూ వచ్చింది. అటు తర్వాత గడచిన సంవత్సర కాలంలో వేగంగా తిరిగి సున్నా స్థాయికి చేరింది. తాజాగా ఫెడ్ వడ్డీ రేట్లలో భారీ కోతలను చేపట్టడంతోపాటు.. బ్యాంకులు నగదు నిల్వలను వినియోగించుకునేందుకు వీలుగా రిజర్వ్ రిక్వైర్‌మెంట్స్ నిబంధనలు సడలించింది.

అధ్యక్షుని ప్రశంసలు...

మరోవైపు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫెడ్ నిర్ణయాలను ప్రశంసించారు. ఫెడ్ చర్యలను ఊహించలేదని..ఇదెంతో సంతోషకర విషయమని వ్యాఖ్యానించారు. ఇటీవల ఎదురవుతున్న సంక్షోభాల నుంచి ఆర్థిక వ్యవస్థ గట్టెక్కినట్లు విశ్వసించేవరకూ కనీస వడ్డీ రేట్లనే కొనసాగించనున్నట్లు ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ పేర్కొన్నారు. కరోనా కారణంగా ఎదురవుతున్న క్లిష్ట పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే బాటలో ఇటీవల ఫెడ్ 0.5 శాతం వడ్డీ రేట్లను తగ్గించడంతోపాటు.. 500 బిలియన్ డాలర్లను వ్యవస్థలోకి విడుదల చేసే చర్యలను చేపట్టిన సంగతి తెలిసిందే.

రూ.7.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ భారీ నష్టాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.7.6 లక్షల కోట్లు ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బిఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.7.62 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.121.63 లక్షల కోట్లకు పడిపోయింది.



నష్టాలు ఎందుకంటే....

కోవిడ్-19 వైరస్ కల్లోలం....

కోవిడ్-19 వైరస్ కల్లోలం అంతకంతకూ పెరిగిపోతోంది. సోమవారం తాజాగా 9 కొత్త దేశాలకు పాకింది. మరోవైపు ఇటలీ, స్పెయిన్ దేశాల్లో మరణాల సంఖ్య పెరుగుతోంది. మన దేశంలో ఇప్పటివరకూ కరోనా కేసుల సంఖ్య 110కు, మరణాలు రెండుకు చేరాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా 1.70 లక్షల మందికి ఈ వైరస్ సోకగా, 6,500 మందికి పైగా మరణించారు.

గణాంకాలతో గజగజ....

చైనా తయారీ రంగ, రిటైల్ అమ్మకాల గణాంకాలు సోమవారం వెలువడ్డాయి. చైనా తయారీ రంగ సూచీ 30 ఏళ్ల కనిష్టానికి పడిపోయింది. రిటైల్ అమ్మకాలు కూడా బారీగా తగ్గాయి. కోవిడ్-19 వైరస్ కల్లోలం ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందనే భయాలను ఈ గణాంకాలు మరింతగా పెంచాయి.

ప్రపంచ మార్కెట్ల పతనం.....

ఆసియా మార్కెట్లు 2-4 శాతం రేంజ్‌లో నష్టపోవడం, యూరప్ మార్కెట్లు ఆరంభంలోనే 8 శాతం పతనం కావడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

ముడి చమురు ధరలు మరింత పతనం....

ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో వినియోగం తగ్గి, డిమాండ్ కూడా తగ్గగలదన్న ఆందోళనతో ముడి చమురు ధరలు 10 శాతం మేర దిగివచ్చాయి.

అనుసరించనున్న ఆర్‌బీఐ!

మరోవైపు భారత్ సెంట్రల్ బ్యాంక్ ఆర్‌బీఐ కూడా రెపో రేటు కోత (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు- ప్రస్తుతం 5.15%) బాటలో నిలుస్తుందన్న సంకేతాలను ఇచ్చారు గవర్నర్ శక్తికాంత దాస్. ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ''కరోనా ప్రభావం నుంచి భారత్ ఆర్థిక వ్యవస్థ బయటపడటానికి ఆర్‌బీఐ వద్ద తగిన విధానపరమైన సాధనాలు ఉన్నాయి'' అన్నారు. ఏప్రిల్ 3న పాలసీ సమీక్ష నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి పాలసీ సమీక్ష సందర్భంగా రేటు కోత నిర్ణయం ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నకు సమాధానం చెబుతూ, ''ప్రస్తుత చట్టం ప్రకారం, రేట్ కోత నిర్ణయాన్ని ద్రవ్య విధాన కమిటీ తీసుకుంటుంది. రేటు కోత నిర్ణయాన్ని తోసిపుచ్చలేను. పరిస్థితులకు అనుగుణంగా తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది'' అన్నారు. వ్యవస్థలో లిక్విడిటీ సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటామని దాస్ పేర్కొన్నారు. కోవిడ్ ఆందోళనలతో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌సహా దాదాపు 43 సెంట్రల్ బ్యాంకులు రేటు కోత నిర్ణయం తీసుకున్నాయి.

రూపాయి, క్రూడ్ క్రాష్

ముంబై: డాలర్ మారకంలో రూపాయి పతన ధోరణి కొనసాగుతోంది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో సోమవారం ఒకేరోజు 50 పైసలు పడిపోయి 74.25 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న కోవిడ్-19 భయాలు, ప్రపంచాభివృద్ధిపై దీని ప్రభావం, రేటు కోతతో వృద్ధికి ఊతం ఇవ్వాలని భావించిన అమెరికా సెంట్రల్ బ్యాంక్- ఫెడ్ నిర్ణయం... వెరసి మాంద్యం భయాలు భారత్ కరెన్సీపై ప్రభావం చూపుతున్నాయి. ఈక్విటీ భారీ నష్టాలూ ఇక్కడ గమనార్హం. శుక్రవారం రూపాయి ముగింపు 73.75. ట్రేడింగ్ మొత్తంమీద 74.09 గరిష్ట-74.35 కనిష్ట స్థాయిల మధ్య కదలాడింది. రూపాయి కనిష్ట స్థాయిల చరిత్ర గురించి చూస్తే ఈ నెల 12, 13తేదీల ఇంట్రాడేల్లో వరుసగా 74.50ని చూసినా, ఇప్పటి వరకూ కనిష్ట స్థాయి ముగింపు మాత్రం 74.39.

క్రూడ్, బంగారం 'బేర్'

మరోవైపు ఈక్విటీ మార్కెట్లతో పాటు కమోడిటీ మార్కెట్లూ కరోనా కాటుకు బలవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో నైమెక్స్ క్రూడ్ బేరల్ ధర ఈ వార్త రాసే సమయం 10.35కు 8.35 శాతం నష్టంలో (2.68 డాలర్లు) 29.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ట్రేడింగ్ ఒక దశలో 28.52 డాలర్లనూ చూసింది. బ్రెంట్ బ్యారల్ ధర ఇదే సమయానికి 11.73 శాతం నష్టంతో 29.88 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో 29.55 డాలర్లనూ చూసింది. ఇక పసిడి విషయానికి వస్తే, ఔన్స్ (31.1గ్రా) ధర 5 డాలర్ల నష్టంతో 1,512 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో ఈ యల్లో మెటల్ ధర 1,451 డాలర్లనూ చూడ్డం గమనార్హం. తాజా పరిస్థితుల నేపథ్యంలో పసిడి పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర దేశీయంగా రూ.40,000 లోపునకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వార్తరాసే సమయంలో దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్-ఎంసీఎక్స్‌లో పసిడి పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.500కుపైగా నష్టంతో రూ.39,775 వద్ద ట్రేడవుతోంది.

ఆరని విలయం!

ఎస్‌బీఐ కార్డ్స్‌కు కరోనా సెగ

రిటైల్ ఇన్వెస్టర్లకు రూ.308 కోట్ల నష్టం..

- పేలవంగా లిస్టింగ్
- 10% నష్టంతో రూ. 683 వద్ద ముగింపు

ఎస్‌బీఐ అనుబంధ కంపెనీ, ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ షేర్ల లిస్టింగ్‌పై కోవిడ్-19 వైరస్ తీవ్రంగానే ప్రభావం చూపించింది. ఈ వైరస్ కారణంగా ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్ కూడా భారీగా నష్టపోయాయి. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ షేర్ల లిస్టింగ్ కూడా పేలవంగానే జరిగింది. మరోవైపు కొన్ని కంపెనీలు తమ ఐపీఓలను వాయిదా వేశాయి. కాగా పార్క్ హోటల్స్ ఐపీఓకు మార్కెట్ నియంత్రణ సంస్థ, ఆమోదం తెలిపింది.

13 శాతం నష్టంతో లిస్టింగ్.....

ఇష్యూ ధర, రూ.755తో పోల్చితే ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ షేర్ బీఎస్‌ఈలో 13 శాతం నష్టంతో రూ.658 వద్ద లిస్టయింది. ఈ షేర్‌కు ఇదే ఇంట్రాడే కనిష్ట స్థాయి. ఇంట్రాడేలో ఇష్యూ ధర, రూ.755కు ఎగసినప్పటికీ, చివరకు 9.5 శాతం నష్టంతో రూ.683 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 41.6 లక్షలు, ఎన్‌ఎస్‌ఈలో 6.08 కోట్ల షేర్లు ట్రేడయ్యాయి. ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.57,199 కోట్లకు చేరింది. ఈ నెలలోనే వచ్చిన ఈ కంపెనీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) 22 రెట్లకు పైగా ఓవర్ సబ్‌స్క్రైబయింది. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.10.000 కోట్ల మేర నిధులు సమీకరించింది.

ఐపీఓలో భాగంగా రిటైల్ ఇన్వెస్టర్లకు (రూ.2 లక్షల కంటే తక్కువగా ఇన్వెస్ట్ చేసేవాళ్లు) 4.27 కోట్ల ఈక్విటీ షేర్లను కేటాయించారు. ఇష్యూ ధర రూ.755తో పోల్చితే ఈ షేర్ బీఎస్‌ఈలో రూ.72 నష్టంతో రూ.683 వద్ద ముగిసింది. ఒక్కో షేర్‌కు రూ.72 నష్టం పరంగా చూస్తే, మొత్తం రిటైల్ ఇన్వెస్టర్లకు రూ.308 కోట్ల నష్టం వచ్చింది. అలాగే క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు రూ.174 కోట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు రూ.132 కోట్ల మేర నష్టాలు వచ్చాయి.

మరిన్ని విశేషాలు....

సెన్సెక్స్‌లోని అన్ని షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 17.5 శాతం క్షీణించి రూ.663 వద్ద ముగిసింది సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే. టాటా స్టీల్ 11 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 11 శాతం, యాక్సిస్ బ్యాంక్ 10 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 10% మేర నష్టపోయాయి.

- యస్ బ్యాంక్ తరహానే త్వరలోనే సంక్షోభంలోకి జారిపోగలదన్న భయాలు చెలరేగడంతో ఆర్‌బీఎల్ బ్యాంక్ 21% నష్టపోయి రూ.163 వద్ద ముగిసింది.
- వివిధ రాష్ట్రాల్లో సినిమా హాళ్లను ఈ నెల 31 వరకూ మూసేయాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడంతో మల్టీప్లెక్స్‌లను నిర్వహించే పీవీఆర్, ఐనాక్స్ లీజర్ షేర్లు 19 శాతం వరకూ నష్టపోయాయి.
- దాదాపు 500కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. బంధన్ బ్యాంక్, పీవీఆర్, ఆర్‌బీఎల్ బ్యాంక్, యూపీఎల్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ హోల్డింగ్స్, ఇక్రా, పిరామల్ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ సిటీ యూనియన్ ఈ జాబితా కొన్ని.
- 600కు పైగా షేర్లు లోయర్ సర్క్యూట్లను తాకాయి. అవెన్యూ సూపర్‌మార్ట్స్, ఐఆర్‌సీటీసీ, ఆఫిల్ ఇండియా, సువెన్ ఫార్మా, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, అదానీ గ్రీన్ ఎనర్జీ, డీహెచ్‌ఎఫ్‌ఎల్, వెల్‌స్పన్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- సెన్సెక్స్ 2,700 పాయింట్ల నష్టంలో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్ల వాటాయే దాదాపు నాలుగో వంతుగా ఉంది. ఈ రెండు షేర్లు కలిసి 660 పాయింట్ల మేర సెన్సెక్స్‌కు పడగొట్టాయి. సెన్సెక్స్‌ను....రిలయన్స్ ఇండస్ట్రీస్ 276 పాయింట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ 271 పాయింట్లు, ఇన్ఫోసిస్ 211 పాయింట్ల మేర నష్టపరిచాయి.

ఫెడ్ తగ్గించినా... నష్టకష్టాలే!

అమెరికా ఫెడరల్ రిజర్వ్ అత్యవసర చర్యల్లో భాగంగా ఆదివారం ఫండ్స్ రేట్‌ను దాదాపు సున్నా స్థాయికి తగ్గించింది. ప్రస్తుతం ఈ ఫండ్స్ రేటు 0-0.25 శాతం రేంజ్‌లో ఉంది. ఈ రేట్ల ఆధారంగానే బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయిస్తాయి. అంతే కాకుండా 70,000 కోట్ల డాలర్ల ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించింది. ఒక్క వారంలో ఫండ్స్ రేట్లను ఫెడరల్ రిజర్వ్ తగ్గించడం ఇది రెండోసారి. 2008లో సబ్‌ప్రైమ్ సంక్షోభం నెలకొన్నప్పుడు కూడా ఇలానే ఫెడ్ రేట్లను తగ్గించింది. సాధారణ పరిస్థితుల్లో ఫెడ్ రేట్లను తగ్గిస్తే, అదీ సున్నా స్థాయికి వస్తే, ప్రపంచ మార్కెట్లు లాభాలతో ఊగిపోయేవి. కానీ ఈ సారి పరిస్థితి రివర్స్ అయింది. ఆర్థిక సంక్షోభం అంచనాలను మించి ఉంటుందని, ఫెడ్ రేట్లను తగ్గించడం దీనికి సంకేతమన్న భావనతో ప్రపంచ మార్కెట్లు కుదేలయ్యాయి.

జీడీపీకి కరోనా కాటు!

వృద్ధి 50 బేసిస్ పాయింట్లు తగ్గుతుందన్న ఆందోళన

ముంబై: కరోనా వైరస్ మహమ్మారి ప్రతాపం మరింత వ్యవధిపాటు కొనసాగితే 2020-21 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధి రేటు అరశాతం వరకు తగ్గుతుందన్న ఆందోళన దేశీయ కంపెనీల నుంచి వ్యక్తమైంది. అంతేకాదు, ఈ వైరస్ ప్రభావం దీర్ఘకాలం కొనసాగితే ద్రవ్యలోటు మరింత పెరిగిపోవడమే కాకుండా బ్యాంకులకు మొండి బాకీలు (ఎన్‌పీఏలు) మరింత జోడవుతాయని పేర్కొన్నాయి. కరోనా వైరస్ ప్రభావం దేశ ఆరిక వ్యవస్థపై ఏ మేరకు ఉండొచ్చన్న దానిపై రేటింగ్ ఏజెన్సీ కేర్ 150 మంది సీఈవోలు, సీఎఫ్‌వోలు, ఇన్వెస్టర్లు, అనలిస్టులు, ఇతర భాగస్వాముల నుంచి అభిప్రాయాలను సేకరించగా ఈ అంశాలు వెల్లడయ్యాయి. వైరస్ ఎక్కువ కాలం పాటు ఉంటే ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం గణనీయంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. జీడీపీ అరశాతం వరకు తగ్గొచ్చని సర్వేలో పాల్గొన్న వారిలో అత్యధికులు అభిప్రాయపడితే, 22 శాతం మంది అయితే ఒక శాతం వరకు తగ్గిపోవచ్చని అంచనా వేశారు.

పార్క్ హోటల్స్ ఐపీఓ @ రూ.1,000 కోట్లు...

పార్క్ హోటల్స్ ఐపీఓకు మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా రూ.400 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. వీటితో పాటు రూ.600 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్) మార్గంలో విక్రయిస్తారు. మొత్తం మీద ఈ ఐపీఓ సైజు రూ.1,000 కోట్లు. ఈ కంపెనీ హైదరాబాద్, విశాఖపట్టణం బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, జైపూర్, జోధ్‌పూర్, కోయంబత్తూర్ తదితర నగరాల్లో ద పార్క్ బ్రాండ్ హోటళ్లను నిర్వహిస్తోంది.

ఐపీఓలు వాయిదా...: కోవిడ్-19 వైరస్ ధాటికి స్టాక్ మార్కెట్ విలవిలలాడుతుండటంతో పలు కంపెనీలు తమ ఐపీఓలను వాయిదా వేశాయి. ఈ నెల 4నే మొదలైనా, ఐపీఓను ఈ నెల 16 వరకూ పొడిగించినప్పటికీ, ఇన్వెస్టర్ల నుంచి సరైన స్పందన లేకపోవడంతో అంటోని వేస్ట్ హ్యాండ్లింగ్ సెల్ కంపెనీ తన ఐపీఓను ఉపసంహరించుకుంది. కాగా బర్గర్ కింగ్ ఇండియా కంపెనీ తన ఐపీఓను వాయిదా వేసుకుందని సమాచారం. ఈ నెలాఖరులో ఐపీఓకు వచ్చి రూ.400 కోట్లు సమీకరించాలనేది ఈ కంపెనీ ప్రణాళిక.

రేట్ల కోతతో కీడే ఎక్కువ

వివిధ దేశాల కేంద్ర బ్యాంక్‌లు రేట్లను తగ్గించడం వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోంది. కోవిడ్ వైరస్ ఆర్థికంగా చూపించే ప్రభావం అంచనాల కంటే అధికంగానే ఉండగలదన్న సంకేతాలను కేంద్ర బ్యాంక్‌ల రేట్ల తగ్గింపు సూచిస్తోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమవుతున్నాయి.

-వినోద్ నాయర్,
జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్

పతనం కొనసాగే అవకాశాలే అధికం

దేశీయంగా కోవిడ్-19 వైరస్ మెల్లమెల్లగా విస్తరిస్తోంది. ఇది ఎక్కడ దాకా చేరుతుందో అంతూ, దరీ తెలియడం లేదు. రానున్న రోజుల్లో ఈ పతనం కొనసాగే అవకాశాలే అధికంగా ఉన్నాయి.

-అజిత్ మిశ్రా,
రెలిగేర్ బ్రోకింగ్ ఎనలిస్ట్.

ఈ నెల 31 తర్వాత పాన్ పనిచేయదు!

న్యూఢిల్లీ: పాన్‌ను ఆధార్‌తో అనుసంధానించడం తప్పనిసరి అని, ఇందుకు ఇచ్చిన గడువు ఈ నెల 31న ముగుస్తుందంటూ ఆదాయపన్ను శాఖ మరోసారి గుర్తు చేసింది. గడువు నాటికి అనుసంధానం చేసుకోకపోతే.. అప్పుడు పాన్ పనిచేయకుండా పోతుందని హెచ్చరించింది. బయోమెట్రిక్ ఆధార్ ఆథెంటికేషన్ లేదా పాన్ సేవా కేంద్రాలను సందర్శించడం ద్వారా అనుసంధానం చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు ఆదాయపన్ను శాఖ తన ట్విట్టర్ పేజీలో ఒక వీడియోను సైతం పోస్ట్ చేసింది. UIDPAN అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఆధార్ నంబర్ టైప్ చేసి స్పేస్ ఇచ్చి, పాన్ నంబర్ టైప్ చేసిన తర్వాత 567678 నంబర్‌కు ఎస్ఎంఎస్ చేయడం ద్వారా అనుసంధానం చేసుకోవచ్చు. అలాగే, ఆదాయపన్ను శాఖ ఈఫైలింగ్ పోర్టల్ www.incometaxindiaefiling.gov.in కు వెళ్లి కూడా అనుసంధానం చేసుకోవచ్చు.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	42,210
బంగారం (22 క్యారెట్లు)	40,200
వెండి (కిలో)	40,800
హైదరాబాద్/చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	41,400
బంగారం (22 క్యారెట్లు)	39,430
వెండి (కిలో)	40,800
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	42,200
బంగారం (22 క్యారెట్లు)	39,170
వెండి (కిలో)	41,900
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	42,690
బంగారం (22 క్యారెట్లు)	39,430
వెండి (కిలో)	39,700

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన పాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	29.22 రాత్రి 11.30కు	$ 32.11 శుక్రవారం ముగింపు
బ్రెంట్	30.02 రాత్రి 11.30కు	$ 33.85 శుక్రవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 17-3-2020

విశాఖ	300-00
చిత్తూరు	263-00
వరంగల్	253-00
విజయవాడ	290-00
గోదావరి	290-00
16-3-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	250-00

'యస్' షేర్ల ట్రేడింగ్‌పై ఆంక్షలు

- ఆందోళనలో ఎఫ్‌పీఐలు, సంస్థాగత ఇన్వెస్టర్లు
- మరింత ముందుగానే సూచీల నుంచి తొలగింపు
- రేపట్నుంచీ బ్యాంక్ డిపాజిట్ విత్‌డ్రాయల్స్‌పై ఆంక్షల ఎత్తివేత

న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న యస్ బ్యాంక్ పునరుద్ధరణ ప్రణాళికలో భాగంగా షేర్ల ట్రేడింగ్‌పై హఠాత్తుగా ఆంక్షలు విధించడం.. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) సహా ఇతరత్రా సంస్థాగత ఇన్వెస్టర్లను ఆందోళనలోకి నెట్టింది. ప్రస్తుత ఇన్వెస్టర్లు తమ దగ్గరున్న షేర్లలో పాతిక శాతానికి మించి విక్రయించడానికి లేకుండా విధించిన నిబంధనతో సోమవారం మదుపరులు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. షేరు ఏకంగా 50 శాతం పైగా ఎగిసినప్పటికీ తమ దగ్గరున్న వాటిని విక్రయించే పరిస్థితి లేకుండాపోయింది. క్యాష్, డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో తమ పొజిషన్లను వదిలించుకోలేకపోవడంపై పలువురు సీనియర్ ఫండ్ మేనేజర్లు, ఎఫ్‌పీఐలు, సంస్థాగత ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈ నిబంధనను ప్రవేశపెట్టడంతో డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో భారీగా పొజిషన్లు ఉన్న ఇన్వెస్టర్లు ఇరుక్కుపోయినట్లయిందని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత నియంత్రణ సంస్థను ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు వివరించారు. ఆంక్షల గురించి సోమవారం ఉదయానికి మాత్రమే ఇన్వెస్టర్లకు తెలిసింది. అంతే కాకుండా యస్ బ్యాంక్ షేర్లలో ట్రేడింగ్‌ను మొబైల్ యాప్స్ ద్వారా కుదరదని, డెస్క్‌టాప్ ద్వారా మాత్రమే చేయాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ తదితర బ్రోకింగ్ సంస్థలు .. ఇన్వెస్టర్లకు సమాచారమిచ్చాయి. ఒకవేళ యస్ బ్యాంక్ షేర్లలో ఈ-మార్జిన్ పొజిషన్లు గానీ ఉంటే సోమవారం వాటిని డెలివరీ కింద మారుస్తామని, అందుకు తగినంత స్థాయిలో నిధులు తమ అకౌంట్లలో ఉంచుకోవాలని సూచించాయి.

19నే సూచీల నుంచి నిష్క్రమణ..

తాజా పరిస్థితుల నేపథ్యంలో గతంలో అనుకున్న దానికంటే ముందుగానే యస్ బ్యాంక్‌ను నిఫ్టీ సహా వివిధ సూచీల నుంచి తొలగించాలని ఎన్ఎస్ఈ ఇండిసెస్ ఇండెక్స్ మెయింటెనెన్స్ సబ్-కమిటీ నిర్ణయించింది. దీంతో ముందుగా అనుకున్నట్లు మార్చి 27న కాకుండా 19 నుంచే నిఫ్టీ 50, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ 100, నిఫ్టీ 500 వంటి అన్ని ఈక్విటీ సూచీల నుంచి యస్ బ్యాంక్ నిష్క్రమించనుంది.

18 నుంచి పూర్తి సేవలు: ఆర్‌బీఐ

పునరుద్ధరణ ప్రణాళిక అమల్లోకి రావడంతో మార్చి 18 సాయంత్రం నుంచి యస్ బ్యాంక్‌పై మారటోరియం తొలగిపోయి, అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. దీంతో ఖాతాదారులు .. ఆంక్షలేమీ లేకుండా విత్‌డ్రాయల్స్ లావాదేవీలు జరపవచ్చని పేర్కొన్నారు.

కార్పొరేట్లకు ఈడీ సమన్లు..

యస్ బ్యాంక్ మాజీ వ్యవస్థాపకుడు రాణా కపూర్ తదితరులపై మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా పలువురు కార్పొరేట్ దిగ్గజాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. ఎస్సెల్ గ్రూప్ ప్రమోటరు సుభాష్ చంద్ర, జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్, ఇండియాబుల్స్ చైర్మన్ సమీర్ గెహ్లోట్‌లను విచారణకు హాజరు కావాలంటూ ఆదేశించింది. అటు అడాగ్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ కూడా ఈ నెల 19న హాజరు కానున్నారు.

యస్ బ్యాంక్ అప్‌గ్రేడ్ ..

తాజాగా పెట్టుబడులు వచ్చిన నేపథ్యంలో యస్ బ్యాంక్ రేటింగ్‌ను సానుకూల అంచనాలతో అప్‌గ్రేడ్ చేసినట్లు రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ వెల్లడించింది.

బోర్డు పునర్‌వ్యవస్థీకరణకు ఓకే ..

ప్రస్తుతం అడ్మినిస్ట్రేటరుగా ఉన్న ప్రశాంత్ కుమార్.. కొత్త ఎండీ, సీఈవోగా బోర్డు పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికకు ఆమోదం తెలిపినట్లు యస్ బ్యాంక్ వెల్లడించింది.

మార్కెట్లోకి 'కొడాక్ సీఏ సిరీస్' టీవీలు

43 అంగుళాల టీవీ ప్రారంభ ధర రూ. 23,999



న్యూఢిల్లీ: గూగుల్ సర్టిఫికేట్ పొందిన అండ్రాయిడ్ టెలివిజన్లలో అత్యంత చౌక ధరలకే కొడాక్ తన కొత్త తరం టీవీలను అందుబాటులోకి తెచ్చింది. భారత్‌లో ఈ బ్రాండ్ విక్రయానికి లైసెన్సు కలిగి ఉన్న సూపర్ ప్లాస్ట్రోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌పీపీఎల్).. 'కొడాక్ సీఏ సిరీస్' పేరిట వీటిని సోమవారం మార్కెట్లోకి విడుదలచేసింది. డాల్బీ విజన్, 4కే హెచ్‌డీఆర్10, ఆండ్రాయిడ్ 9.0 ఇంటర్‌ఫేస్, డీటీఎస్ ట్రూసరౌండ్ కలిగిన డాల్బీ డిజిటల్ ప్లస్, యుఎస్‌బీ 3.0, బ్లూటూత్ వీ5.0 (తాజా వెర్షన్), అమెజాన్ ప్రైమ్ వంటి ఆప్షన్లు కలిగిన యూజర్ ఫ్రెండ్లీ రిమోట్ వంటి అధునాతన ఫీచర్లు కొత్త సిరీస్‌లో ఉన్నాయి. 43, 50, 55, 65 అంగుళాల సైజుల్లో టీవీలు లభిస్తుండగా.. ప్రారంభ ధర రూ. 23,999, హై ఎండ్ రూ. 49,999కే లభిస్తున్నట్లు ఎస్‌పీపీఎల్ డైరెక్టర్, సీఈఓ అవనీత్ సింగ్ మార్వ్ ప్రకటించారు. మార్చి 19 నుంచి ఈ సీరిస్ టీవీలు ఫ్లిప్‌కార్టులో అందుబాటులో ఉండనున్నాయి.

ఓఎన్‌జీసీ డివిడెండ్ రూ.5

న్యూఢిల్లీ: ముడి చమురు ధరలు తీవ్రమైన ఒడిదుడుకుల్లో ట్రేడ్ అవుతున్నప్పటికీ, కార్యకలాపాలు కొనసాగించడానికి తగిన నిధులు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వ రంగ చమురు సంస్థ, ఓఎన్‌జీసీ భరోసానిచ్చింది. అంతే కాకుండా 100 శాతం మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. రూ.5 ముఖ విలువ గల ఒక్కో ఈక్విటీ షేర్‌కు రూ.5 మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నామని ఓఎన్‌జీసీ తెలిపింది. కేంద్రానికి 62.78 శాతం వాటా ఉండటంతో కేంద్ర ఖజానాకు రూ.3,949 కోట్లు డివిడెండ్ ఆదాయం లభించగలదని వివరించింది.

అదుపులో టోకు ధరల స్పీడ్: ఫిబ్రవరిలో 2.26 శాతం

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2020 ఫిబ్రవరిలో అదుపులో ఉంది. 2.26 శాతంగా నమోదయ్యింది. అంటే 2019 ఫిబ్రవరితో పోల్చితే టోకు బాస్కెట్‌లోని వస్తువుల ధరల పెరుగుదల రేటు 2.26 శాతంగా ఉందన్నమాట. సూచీలో దాదాపు 64 శాతంగా ఉన్న తయారీ విభాగంలో ద్రవ్యోల్బణం రేటు కేవలం 0.42 శాతంగా నమోదయ్యింది. సోమవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాల్లో ముఖ్యాంశాలను చూస్తే... ఫుడ్, నాన్ ఫుడ్ ఆర్టికల్స్‌తో కూడిన ప్రైమరీ ఆర్టికల్స్‌లో ద్రవ్యోల్బణం 6.71 శాతంగా నమోదయ్యింది. ఇందులో ఫుడ్ ఆర్టికల్స్ ధరలు 7.79 శాతం పెరిగితే, నాన్-ఫుడ్ ఆర్టికల్స్ రేటు 6.82 శాతంగా ఉంది.

మరో రూ. 3వేల కోట్లు కట్టిన వొడా-ఐడియా

న్యూఢిల్లీ: ఏజీఆర్ బాకీలకు సంబంధించి ప్రభుత్వానికి అదనంగా రూ. 3,354 కోట్లు చెల్లించినట్లు టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) వెల్లడించింది. దీంతో తమ స్వీయ మదింపు ప్రకారం మొత్తం బాకీలు తీర్చేసినట్లవుతుందని పేర్కొంది. తాజా చెల్లింపుతో వీఐఎల్ మొత్తం రూ. 6,854 కోట్లు కట్టినట్లయ్యింది. సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) లెక్కల ప్రకారం లైసెన్సు ఫీజు, స్పెక్ట్రం యూసేజి చార్జీల బాకీల కింద వీఐఎల్ దాదాపు రూ. 53,000 కోట్లు కట్టాలని టెలికం శాఖ (డాట్) లెక్క వేసింది. అయితే, 2006-07 నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరాల దాకా తాము చెల్లించాల్సిన అసలు మొత్తం రూ. 6,854 కోట్లుగా తమ స్వీయ మదింపులో తేలినట్లు మార్చి 6న డాట్‌కు వీఐఎల్ తెలియజేసింది. దాని ప్రకారమే తాజా చెల్లింపులు జరిపింది. అంతకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరి 17న రూ. 2,500 కోట్లు, ఫిబ్రవరి 20న రూ. 1,000 కోట్లు కట్టింది.

డీలిస్టింగ్ ని'బంధన'లు తొలగింపు: సెబీ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ లిస్టెడ్ కంపెనీలకు నిబంధనల పరంగా కాస్త వెసులుబాటు కల్పిస్తూ నిర్ణయాలు తీసుకుంది. దీనిపై ఏప్రిల్ 15 వరకు ప్రజల నుంచి అభిప్రాయాలను ఆహ్వానించింది. ఒక లిస్టెడ్ కంపెనీ తన లిస్టెడ్ మాతృ సంస్థలో విలీనం కావాలనుకుంటే.. డీలిస్ట్ నిబంధనల నుంచి మినహాయింపు కల్పించింది. కాకపోతే విలీనమయ్యే సంస్థ వాటాదారులకు.. విలీనం చేసుకుంటున్న సంస్థ షేర్లను కేటాయించాల్సి ఉంటుంది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో చురుగ్గా ట్రేడవుతున్న లిస్టెడ్ కంపెనీలు, వాటి సబ్సిడరీలు కొన్ని ఉన్నాయని సెబీ తెలిపింది. ఇలా మాతృ సంస్థ, అనుబంధ సంస్థలు ఒకే తరహా వ్యాపారాల్లో ఉంటూ, విడిగా కార్యకలాపాలు నిర్వహించడం కంటే విలీనం కావడం వల్ల వాటాదారులకు అధిక విలువ చేకూరుతుందని సెబీ పేర్కొంది. అలాగే, ప్రస్తుతం ఒక లిస్టెడ్ కంపెనీ క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) మార్గంలో నిధులు సమీకరించినట్టయితే, తిరిగి ఇదే మార్గంలో నిధుల సమీకరణకు కనీసం ఆరు నెలలు ఆగాల్సి ఉంటుంది. కంపెనీల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో రెండు క్యూఐపీల మధ్య కనీసం ఆరు నెలల గడువు నుంచి వెసులుబాటు కల్పించాలనే ప్రతిపాదనను సెబీ రూపొందించింది. ప్రజల అభిప్రాయాల తర్వాత ఈ నిర్ణయాలను అమల్లోకి తీసుకురానుంది. కాకపోతే, పబ్లిక్ ఇష్యూ, రైట్స్ ఇష్యూ తదితర మార్గాల్లో వేగంగా నిధుల సమీకరణకు అవకాశం లేని సందర్భాల్లో ఈ మినహాయింపు ఇవ్వనుంది.

హ్యుందాయ్ క్రెటా @ రూ. 9.9 లక్షలు

న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్ఎంఐఎల్) తాజాగా తన పాపులర్ ఎస్‌యూవీ 'క్రెటా' కారులో అధునాతన వెర్షన్‌ను సోమవారం మార్కెట్లో ప్రవేశపెట్టింది. పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో అందుబాటులోకి వచ్చిన ఈ నూతన కారు ధరల శ్రేణి రూ. 9.9 లక్షలు - 17.2 లక్షలుగా కంపెనీ ప్రకటించింది. ఈ సందర్భంగా కంపెనీ ఇండియా ఎండీ, సీఈఓ ఎస్ ఎస్ కిమ్ మాట్లాడుతూ.. 'ఈ విభాగంలోని లోపాలను అధిగమించి, అత్యాధునిక వాహనాన్ని మార్కెట్లోకి తీసుకుని రావడం కోసం చాలా జాగ్రత్తగా అధ్యయనం చేశాం. సాధ్యాసాధ్యాలను పరిశీలించి కొత్త మోడల్ అందుబాటులో ఉంచాం. ఇక మల్టీ-సీటర్ హై ఆక్యుపెన్సీ వెహికల్ తయారీలో పట్టు సాధించడంలో భాగంగా త్వరలోనే మల్టీ-పర్పస్ వెహికల్ (ఎంపీవీ)ని తీసుకురావాలని యోచిస్తున్నాం' అని వెల్లడించారు.

మిర్చి @ 24,500

వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మిర్చికి రికార్డు ధర లభించింది. రైతులు సోమ్లానాయక్, రూప్లానాయక్, రవీందర్ తీసుకువచ్చిన సింగిల్ పట్టీ రకం మిర్చి క్వింటాకు రూ.24,500 ధర పలికింది. కాగా, సోమవారం మార్కెట్‌కు 50 వేల బస్తాల వరకు మిర్చి వచ్చింది. -వరంగల్

పెళ్లి వేడుకలో కరోనా ఎఫెక్ట్

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ ప్రభావం పెళ్లి వేడుకల్లో కలవరం రేపుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం రెడ్డికాలనీలో సోమవారం జరిగిన ఉప్పల కుమార్, శ్రావ్యల రిసెప్షన్ కార్యక్రమంలో వధూవరులు మాస్కులు ధరించి రిసెప్షన్ జరుపుకున్నారు. వచ్చిన బంధు మిత్రులందరూ వారిని చూసి ఆశ్చర్యపోయి తాము కూడా ఆరోగ్య భద్రతా పాటించాలంటూ చర్చించుకోవడం కనిపించింది. -భూపాలపల్లి అర్బన్

గుడిలో సైతం మాస్కు

జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కరోనా వైరస్ వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు చేపడుతున్నారు. భక్తులకు అవగాహన కల్పించడంతో పాటు అర్చకులు సైతం మాస్కులు ధరించి కనిపించారు. సిబ్బందికి మాస్కులు, గ్లౌజ్‌లు, హ్యాండ్‌వాష్ లిక్విడ్ అందజేయనున్నట్లు ఈఓ ఎం.వీరస్వామి తెలిపారు. -పాలకుర్తి టౌన్

రాష్ట్రీయం

మావోల కదలికపై కన్నేయండి

చొరబడకుండా పకడ్బందీ చర్యలు: డీజీపీ

- పోలీసు ఉన్నతాధికారులకు కీలక సూచనలు
- నేరాల నియంత్రణలో దేశంలో మనమే ఫస్ట్
- కానిస్టేబుల్ నుంచి అందరూ బాధ్యతగా మెలగాలి
- ఉత్తర తెలంగాణలో పోలీసు అధికారులతో సమీక్ష

కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్/భద్రాద్రి కొత్తగూడెం/గోదావరిఖని: మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉండాలని డీజీపీ మహేందర్ రెడ్డి పోలీసులకు సూచించారు. సోమవారం ఆయన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు, గోదావరి పరీవాహక ప్రాంత జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వేర్వేరుగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లా రామగుండంలలో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కార్యకలాపాలు, భద్రాద్రి, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో యాక్షన్ టీమ్‌ల సంచారం, కొత్త రిక్రూట్‌మెంట్లు తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు తెలంగాణ జిల్లాల్లోకి చొరబడకుండా నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో దేశంలో మనమే మొదటి స్థానంలో ఉన్నామని, ఇప్పటి వరకు మంచి గుర్తింపును సాధించారని డీజీపీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను అనుసరించే విధంగా కృషి చేయాలన్నారు. వివిధ రకాల సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగేలా కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు, వివిధ సంక్షేమ పథకాల అమలు విషయంలో పోలీసులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేసేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా కృషి చేయడంపై చర్చించామని డీజీపీ పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రామగుండం కమిషనరేట్ పోలీసుల పనితీరు బాగుందని కితాబిచ్చారు.

కేటీఆర్‌కు చెక్కు అందజేస్తున్న కామిడి నర్సింహారెడ్డి. చిత్రంలో ఎర్రబెల్లి తదితరులు

దమ్మన్నపేట శ్రీమంతుడు

గ్రామాభివృద్ధికి రూ.25 కోట్ల విరాళం.. 1.50 కోట్ల చెక్కు అందజేత

వర్ధన్నపేట/హనుమకొండ: వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని దమ్మన్నపేటకు చెందిన కామిడి నర్సింహారెడ్డి గ్రామాభివృద్ధి కోసం రూ. 25 కోట్ల విరాళం ప్రకటించారు. అందులో భాగంగా రూ.1.50 కోట్ల చెక్కును హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. వ్యాపారరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన నర్సింహారెడ్డి తాను పుట్టి పెరిగిన గ్రామానికి ఏదో చేయాలని తపన పడేవారు. ఇంతలోనే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెప్రగతి కార్యక్రమానికి ఆకర్షితుడై ఈ నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వర్ధన్నపేట, ఆర్మూర్ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడు చిగురించింది

నేనంటే నేను అన్నట్టుగా పోటీపడి చిగురిస్తున్నాయి ఈ ఫొటోలోని వృక్షాలు. కరెంటు తీగలకు అడ్డు తగులుతున్నాయని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామస్తులు కొమ్మలు నరికి మోడుగా మార్చారు. అయినా మళ్లీ ఇలా చిగురించడం చూపరులను ఆకర్షిస్తోంది. -మర్రి సతీశ్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్

ఐఐటీ హైదరాబాద్‌కు 29 వరకు సెలవులు

సంగారెడ్డి టౌన్: కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఐఐటీ హైదరాబాద్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 29 వరకు విద్యార్థులెవరూ ఐఐటీ క్యాంపస్‌లో ఉండరాదని.. వారి వారి ఇళ్లకు వెళ్లాలని సూచించారు. మార్చి 29వ తేదీ వరకు తరగతులన్నీ సస్పెండ్ చేసినట్లు ఐఐటీ హైదరాబాద్ పీఆర్‌వో మిథాలీ అగర్వాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ ఆవరణలో ఉండే ఉద్యోగులు, ఇతర సిబ్బంది అత్యవసరమైతే తప్ప.. బయటకు వెళ్లరాదని సూచించారు. ఈనెల 29న అత్యవసర ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించిన తర్వాత అధికారులు తదుపరి కార్యాచరణను ప్రకటిస్తారని పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన స్టాఫ్, ఫ్యాకల్టీ రోజూ హైదరాబాద్ నుంచి వచ్చేవారే 50 శాతం వరకు ఉన్నందున ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కరోనా వైరస్ రాకుండా క్యాంపస్‌లో అన్ని చర్యలు చేపట్టామన్నారు.

15 ఏళ్ల నిరీక్షణకు తెర

పాస్‌పోర్టు, వీసా లేక నరకయాతన

- జరిమానా కట్టలేక.. ఇంటికి రాలేక..!
- ఇండియన్ ఫోరం చొరవతో రేపు స్వగ్రామానికి దుర్గయ్య

దుర్గయ్యకు విమాన టికెట్ అందిస్తున్న ఫోరం ఉపాధ్యక్షులు శ్రీనివాస్, గిరీష్ పంతు

కోనరావుపేట: ఉన్న ఊరులో ఉపాధి కరువై దుబాయ్ వెళ్లిన ఓ వలసజీవి.. అక్కడి ఏజెంట్ మోసానికి 15 ఏళ్ల నరకయాతన అనుభవించాడు. ఈ నేపథ్యంలో ఇండియన్ పీపుల్స్ ఫోరం చొరవ తీసుకొని ఆపన్నహస్తం అందించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన దుర్గయ్య రూ.80 వేలు అప్పు చేసి 2005లో దుబాయ్ వెళ్లాడు. అక్కడి విమానాశ్రయంలో దిగగానే ఓ ఏజెంట్ పాస్‌పోర్ట్ తీసుకుని వదిలేశాడు. కంపెనీ వీసా లేక దుర్గయ్య అక్రమంగా పనులు చేసుకుంటూ బతుకుతున్నాడు. ఈ క్రమంలో అక్రమంగా నివాసం ఉంటున్నాడని గుర్తించిన దుబాయ్ ప్రభుత్వం.. రూ. 5.15 లక్షలు జరిమానా విధించింది. ఏం చేయాలో తెలియక దుర్గయ్య దిక్కులు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఇండియన్ పీపుల్స్ ఫోరం ఉపాధ్యక్షుడు, సామాజికవేత్త జనగామ శ్రీనివాస్, అతడి మిత్రుడు, యూఏఈ లేబర్ కన్వీనర్ గిరీష్‌పంతు సహకారంతో దుబాయ్, ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడారు. దుర్గయ్యపై ఉన్న జరిమానా మాఫీ చేయించారు. వీసా, టికెట్, అవుట్ పాస్‌పోర్ట్ ఇప్పించి మంగళవారం ఇండియాకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం దుర్గయ్య స్వగ్రామానికి చేరుకునే అవకాశం ఉంది.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయము
(పి.ఆర్) పి.ఐ.యు మేడ్చల్-మల్కాజ్‌గిరి
సంఖ్య: T5/12/2019-20 టెండరు నోటీసు తేది. 13.03.2020
(23) పనులకు రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించనైనది. పనులు: 23 పనులు, అంచనా విలువ: రూ.213.75 లక్షలు. దరఖాస్తు తీసుకొనుటకు చివరి తేది: 24-03-2020 సా. 5:00 గం.వరకు, టెండరు షెడ్యూల్ పొందుటకు చివరి తేది: 26-03-2020 సా.5:00 గం.వరకు. టెండర్ వేయు తేది: 27-03-2020 మ.3:00 గం.వరకు. టెండరు తెరుచు తేది: 27-03-2020 మ.3:30 గంటలకు. మరిన్ని వివరాలు ఈ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించబడిన టెండర్ నోటీస్‌లో లభించును. సం/- జిల్లా పంచాయత్ రాజ్ ఇంజినీర్ (పి.ఆర్) పి.ఐ.యు మేడ్చల్-మల్కాజ్‌గిరి
DIPR Ro.No.2661-DP/CL/Advt/1/2019-20, Dt:16-03-2020

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-NIT No. 26/S.E.(R&B) KNR/01 to 03/2019-20 తేది: 05.03.2020
పనుల సంఖ్య (03). పనుల వివరణ: రాజన్న-సిరిసిల్ల జిల్లాలో జిల్లా కలెక్టర్ నివాస క్వార్టర్‌కు ఇంటీరియర్ డిజైన్ పనులు, జాయింట్ కలెక్టర్ నివాస క్వార్టర్‌కు ఇంటీరియర్ డిజైన్ పనులు, జిల్లా రెవెన్యూ అధికారి నివాస క్వార్టర్‌కు ఇంటీరియర్ డిజైన్ పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: 64.56 లక్షలు.

'కాళేశ్వరాన్ని' పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

టూరిజం పద్దులపై చర్చలో ఎంపీ రంజిత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచంలో అనేక దేశాలు పర్యాటకంపైనే ఆధారపడ్డాయని, దేశంలో కూడా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని టీఆర్ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. సోమవారం లోక్‌సభలో రైల్వే పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. దేశంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంలో ఉన్న వైఫల్యాలను సరిదిద్దాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టును కూడా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. కీలకమైన పథకాల్లో సగం నిధులు కూడా ఖర్చు కాకపోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. వికారాబాద్ గాలి అనేక వ్యాధులను నయం చేస్తుందన్న నానుడి ఉందని, ఇక్కడ మెడికల్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దీనిని స్వదేశ్ దర్శన్‌లో చేర్చాలని కోరారు. పర్యాటకం ద్వారా ఆర్జించే విదేశీ మారక ద్రవ్యం గణనీయంగా తగ్గడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదకు హైదరాబాద్ ప్రసిద్ధి గాంచిందని, హైదరాబాద్‌లో టూరిజం అభివృద్ధికి, వరంగల్‌కు కూడా నిధులు కేటాయించాలని కోరారు.

కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపించండి

రాజ్యసభ జీరోఅవర్‌లో బండ ప్రకాశ్

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపించాలని టీఆర్ఎస్ ఎంపీ బండ ప్రకాశ్ కేంద్రాన్ని కోరారు. సోమవారం ఆయన రాజ్యసభలో రైల్వే పనితీరుపై జరిగిన చర్చలో మాట్లాడారు. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ మీదుగా కాజీపేట వరకు నూతన రైల్వే ఏర్పాటు చేయాలని కోరారు. మనోహరాబాద్-కరీంనగర్ లైన్ త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, దీన్ని యాదాద్రి వరకు పొడగించాలని కోరారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటుచేయాలని కోరారు.

కేంద్ర జల శక్తి మంత్రితో కోమటిరెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర జల శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. నమామీ గంగా తరహాలో తెలంగాణలోని మూసీ నది ప్రక్షాళన చేపట్టాలని ఆయన కోరారు. నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్లాన్‌లో చేర్చాలని కోరారు. ఈ భేటీలో కేంద్ర జల శక్తి శాఖ సలహాదారు శ్రీరాం వెదిరె ఉన్నారు.

'జోగుళాంబను ప్రసాద్ కింద అభివృద్ధి చేయండి'

సాక్షి, న్యూఢిల్లీ: ఆలంపూర్‌లోని జోగుళాంబ ఆలయాన్ని ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేసిందని, దానికి పర్యాటక శాఖ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని ఆ శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ లోక్‌సభలో తెలిపారు. తెలంగాణలో టూరిస్ట్ సర్క్యూట్ల అభివృద్ధి గురించి పోతుగంటి రాములు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద మహబూబ్‌నగర్ జిల్లాలో ఎకో సర్క్యూట్ కోసం రూ.91 కోట్లు పర్యాటక శాఖ మంజూరు చేసిందని పేర్కొన్నారు. ములుగు-లక్నవరం- మేడారం- తాడ్వాయి- దామరవి- మల్లూరు-బొగత జలపాతానికి ట్రైబల్ సర్క్యూట్ కింద రూ.83 కోట్లు, కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్క్‌పైన సమాధులు-హయత్‌బక్షి మసీదు-రేమండ్స్ సమాధుల ప్రాజెక్టుకు హెరిటేజ్ సర్క్యూట్ కింద రూ.99 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.

'వాయిదా' వద్దు

షెడ్యూల్ ప్రకారం 'స్థానిక'ఎన్నికలు నిర్వహించండి

- కోవిడ్-19 నియంత్రణకు సర్కారు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది
- ఎలాంటి సంప్రదింపులు లేకుండానే ఎన్నికల వాయిదా సమంజసం కాదు
- ఎన్నికల కమిషనర్‌కు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ

ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అర్ధంతరంగా వాయిదా వేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఏపీ ఎన్నికల కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా ఎన్నికలను నిర్వహించాల్సిందిగా ఆమె కోరారు. కోవిడ్-19 నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రజారోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టంచేశారు. ఈ మేరకు నీలం సాహ్ని సోమవారం ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు లేఖ రాశారు. ప్రజారోగ్యం బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, కోవిడ్-19పై రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి ఉంటే వాస్తవ పరిస్థితిని తెలియజేసేవారమని.. కానీ, ఎలాంటి సంప్రదింపులు లేకుండానే స్థానిక ఎన్నికలను వాయిదా వేయడం సమంజసం కాదని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. అంతేకాక.. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం అంతా సర్వసన్నద్ధంగా ఉందని కూడా ఆమె వివరించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది శిక్షణ, బ్యాలెట్ బాక్సుల సేకరణ, ఓటర్ల జాబితా ముద్రణతో పాటు మిగతా కార్యక్రమాలు సైతం పూర్తయ్యాయన్నారు. మరోవైపు.. కరోనాపై రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల మీద వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రతిని కూడా తన లేఖకు సీఎస్ జతపర్చారు. నీలం సాహ్ని తన లేఖలో ఇంకా ఏం చెప్పారంటే..

- ఏపీలో గ్రామ పంచాయతీల పదవీ కాలం 1.8.18న, ఎంపీటీసీ, జెడ్పీటీసీలది 3-4-19న, పట్టణ స్థానిక సంస్థలది 2-7-19న ముగిసిందని మీకు బాగా తెలుసు.
- ఈ విషయంలో, ఎన్నికల జాబితాల తయారీ, ప్రచురణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ప్రచురణ ద్వారా ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.
- ఇంకా అనేక చట్టపరమైన అవరోధాలు ఉన్నప్పటికీ, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) రాష్ట్ర క్రియాశీల సహకారంతో 2020 మార్చిలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించి ఇదే నెల చివరి నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా 7.3.20న ఎన్నికల షెడ్యూల్ జారీచేసింది.
- దీంతో జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు ఎన్నికలకు సర్వసన్నద్ధమయ్యారు.
- నామినేషన్ల రశీదులు తయారీ, పోల్ సిబ్బందిని గుర్తించడం, శిక్షణ ఇవ్వడంతో పాటు బ్యాలెట్ బాక్సుల సేకరణను కూడా పూర్తిచేశారు. అలాగే, బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్న సమయంలోనే కరోనా వైరస్ వ్యాప్తి కారణంతో ముందుజాగ్రత్తగా ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు.
- ఈ విషయంలో.. ప్రజారోగ్యం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని తెలియజేయాలనుకుంటున్నాను. ఎన్నికల వాయిదాకు సంబంధించి ఒక నిర్ణయానికి వచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదిస్తే వాస్తవ పరిస్థితి తెలిసేది. కరోనా నివారణకు జాతీయ విపత్తు నిధి నుంచి రాష్ట్రాలకు నిధులిచ్చేందుకే కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటన చేసింది.
- ఇక రాష్ట్రంలో ఇప్పటివరకు కరోనా పాజిటివ్ కేసు ఒకటే నమోదైంది. అది కూడా ఇటలీ నుండి తిరిగి వచ్చిన వ్యక్తే కావడం గమనార్హం. ప్రస్తుతం అక్కడ స్థానికులకు ఎవ్వరికీ వైరస్ సోకలేదు.
- రాష్ట్రానికి విదేశాల నుంచి వచ్చిన ప్రతి ప్రయాణికుడికి స్క్రీనింగ్ చేసి, ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించే ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. అంతేకాక.. రాష్ట్రంలో వైరస్ అదుపులో ఉంది. రాబోయే 3-4 వారాల్లో భయంకరంగా వ్యాప్తి చెందే ప్రమాదమూ లేదు.
- ఇలాంటి తరుణంలో స్థానిక సంస్థల పాలక వర్గాలు ఏర్పాటైతే కరోనా నియంత్రణలో అవి కీలకపాత్ర పోషిస్తాయి.
- కోవిడ్-19 నివారణలో భాగంగా పోలింగ్ స్టేషన్లలో అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి తగిన సలహా ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు.
- ప్రచారం కోసం ఎలక్ట్రానిక్ మీడియాను ఉపయోగించమని అభ్యర్థులను ప్రోత్సహించవచ్చు.. పోల్ రోజున క్యూ లైన్లను పరిమితం చేయవచ్చు.. ఎన్నికల సిబ్బందిని అప్రమత్తం చేయవచ్చు.. ఏదేమైనా, తగ్గిన ప్రచార కాలం కూడా కరోనా నుండి కాపాడేందుకు సహాయపడుతుంది.
- ఈ నేపథ్యంలో.. ఎన్నికల సంఘం తీసుకున్న ఎన్నికల వాయిదా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలి.

ఎన్నికల నిలిపివేత ఉత్తర్వులను రద్దు చేయండి

సుప్రీంలో ఏపీ ప్రభుత్వం రిట్ పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను అర్ధంతరంగా వాయిదా వేస్తూ ఏపీ ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఈనెల 15న జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం ఉదయం సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన అనంతరమే ఎన్నికలు వాయిదా వేయాలని కిషన్ సింగ్ తోమర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ వ్యవహరించిందని పిటిషన్‌లో పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఇ, 243యు నిర్దేశించిన ప్రకారం స్థానిక సంస్థల కాలపరిమితి ముగిసినందున ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని, ప్రతివాది దీన్ని గౌరవించలేదని నివేదించింది. మార్చి 31లోపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పూర్తికాని పక్షంలో 14వ ఆర్థిక సంఘం నిధులకు కాలం చెల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

డ్రోన్ల కేసులో నిందితులపై చర్యలు తీసుకోవద్దు

తెలంగాణ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖులు నివాసం ఉండే ఇంటి పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణ చేశారనే అభియోగాల కేసులో నిందితులపై ఎటువంటి దుందుడుకు చర్యలు తీసుకోరాదని సోమవారం హైకోర్టు తెలంగాణ పోలీసులను ఆదేశించింది. మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి (మొదటి నిందితుడు), ఆయన సోదరుడు క్రిష్టారెడ్డి (ఏ-2), పోరెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి (ఏ-4)లు వేర్వేరుగా క్వాష్ పిటిషన్లు దాఖలుచేశారు. ఏ-2, ఏ-4లు దాఖలు చేసిన పిటిషన్లను సోమవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని పోలీసుల్ని ఆదేశించారు. పని దినాలు తగ్గిస్తూ హైకోర్టు తీసుకున్న నిర్ణయం ప్రభావం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై పడింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఇదే కేసులో రేవంత్ చర్లపల్లి జైల్లో రిమాండ్‌లో ఉన్నారు.

నౌహీరా షేక్‌కు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో నౌహీరా షేక్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. ఆర్థిక నేరాలకు సంబంధించిన నౌహీరా షేక్ కేసు విచారణను సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్‌కు అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ సంజయ్ కిష్ కౌల్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణకు స్వీకరించింది. తెలంగాణ తరపున న్యాయవాది ఉదయ్‌కుమార్ సాగర్ వాదనలు వినిపిస్తూ ఐపీసీ పరిధిలో దర్యాప్తు జరిగేందుకు అవకాశం కల్పించాలని ధర్మాసనాన్ని కోరారు. ఈనేపథ్యంలో పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని నౌహీరా షేక్‌కు ధర్మాసనం నోటీసులు జారీచేస్తూ విచారణను 30వ తేదీకి వాయిదా వేసింది.

వెదురు ముడిసరుకులపై రాయితీలివ్వండి

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కు మేదరి సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: వెదురు ఉత్పత్తుల కోసం అవసరమైన ముడిసరుకులను రాయితీపై పంపిణీ చేయాలని మేదరి కుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు సోమవారం మేదరి సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్రాముడు, మురళీకృష్ణ తదితరులు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా వెదురు ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని, ఈక్రమంలో ఉత్పత్తుల తయారీకి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన వినోద్ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

హైదరాబాద్-పుణే ఎక్స్‌ప్రెస్ టైం టేబుల్‌లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్-పుణే మధ్య వారంలో మూడు రోజులు నడిచే ఎక్స్‌ప్రెస్ (నం.17013/17014) రైలు టైంటేబుల్‌ను రైల్వే అధికారులు మార్చారు. ప్రస్తుతం నగరం నుంచి ఆది, మంగళ, శుక్రవారాల్లో నడుస్తున్న ఈ రైలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆది, బుధ, శుక్రవారాల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో సోమ, బుధ, శనివారాల్లో పుణేలో బయల్దేరనున్న రైలు ఇక నుంచి సోమ, గురు, శనివారాల్లో బయల్దేరనుంది.



మోడల్	తిన్నగా వచ్చే ప్రయోజనం (₹)	ఎక్స్‌ఛేంజ్ ప్రయోజనం (₹)	కార్పొరేట్ ప్రయోజనం (₹ వరకు)	మొత్తం ప్రయోజనం (₹ వరకు)
M8	2 24 000	25 000	7 000	2 56 000
M6	172 000	25 000	7 000	2 04 000
M4	41 000	15 000	7 000	63 000

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com